www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 26-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 238

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి తె. 3.48 తదుపరి ద్వాదశి; నక్షత్రం: హస్త తె. 4.34 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ.10.54-12.43; దుర్ముహూర్తం: ఉ.8.42-9.27, రా.9.49-10.39; అమృతఘడియలు: రా.9.46-11.35; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.29, సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అండమాన్ దగ్గర 6 టన్నుల డ్రగ్స్

విలువ రూ.25 వేల కోట్లు

ఆరుగురు మయన్మార్ జాతీయుల అరెస్టు

తీర గస్తీ దళం నిఘా విమానం ద్వారా గుర్తింపు

2



అదానీ.. వంద కోట్లు వద్దు



ఆ డబ్బులను బదిలీ చేయవద్దని లేఖ రాయించాం
స్కిల్స్ యూనివర్సిటీ వివాదాస్పదం కావడం ఇష్టం లేకే

అదానీతో బీఆర్‌ఎస్ హయాంలో 5 ఒప్పందాలు

అదానీకి కేసీఆర్ వంగి వంగి దండాలూ పెట్టారు

అప్పట్లో కమీషన్లు మెక్కి ఇప్పుడు మాపై ఆరోపణలా?

అదానీతో ఒప్పందాలపై విచారణకు కేటీఆర్ సిద్ధమా?

ఇచ్చిన ప్రాజెక్టులపై కేసీఆర్‌పైనా విచారణ చేయాలా?

మీలా ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుని కేసులు ఎత్తి వేయించుకోవడానికి మేం ఢిల్లీకి వెళ్లట్లేదు

ఎప్పుడు జైలుకెళ్తామా అని కేటీఆర్ చూస్తున్నాడు

వెళితే ముఖ్యమంత్రి అవుతానని అనుకుంటున్నాడు

ఆయనకన్నా ముందే కవిత జైలుకెళ్లింది మరి: రేవంత్

కేటీఆర్‌ను సైకో రామ్‌గా అభివర్ణించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): "ఒక సదుద్దేశంతో ప్రారంభించిన స్కిల్స్ యూనివర్సిటీ వివాదాస్పదం కావడం మాకు ఇష్టం లేదు. అందుకే అదానీ సంస్థ నుంచి రూ.100 కోట్లు స్వీకరించకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేయవద్దని పేర్కొంటూ అదానీ సంస్థకు జయేశ్ రంజన్ లేఖ రాశారు. అదానీ విషయంలో పక్క దేశాలు, రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదానికి, తెలంగాణకు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ వివాదాల్లోకి అనవసరంగా మమ్మల్ని, మా ప్రభుత్వాన్ని లాగవద్దు" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం నడుచుకుని టెండర్లు దక్కించుకునే.. పెట్టుబడులు పెట్టే అవకాశం ఏ సంస్థకైనా ఉంటుందని రాహుల్ గాంధీ ఇప్పటికే స్పష్టం చేశారని, అయినా.. ప్రస్తుతం నెలకొన్న వివాదాల నేపథ్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద అదానీ సంస్థ స్కిల్స్ వర్సిటీకి

మిగతా 13వ పేజీలో...

తొలి రోజే 'అదానీ' రచ్చ

లంచాల వ్యవహారంపై అట్టుడికిన సభలు

జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు

లోక్‌సభ, రాజ్యసభలో వాయిదా తీర్మానాల తిరస్కరణ.. సభలు రేపటికి వాయిదా

2



గుప్పెడుమంది అరాచకం

పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడమే వారి లక్ష్యం

ప్రజలు చూస్తున్నారు.. తప్పక శిక్షిస్తారు: మోదీ



పీఠికకు బాసట

సామ్య, లౌకిక వాదాల చేర్పు సరైనదే

అవతారికను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది.. విచారణ అనవసరం

సామ్యవాదం అంటే సమానత్వం

మతంలోని లోపాల నివారణ కూడా లౌకిక వాదంలో భాగం.. సుప్రీం వ్యాఖ్యలు

2

కొన్ని వర్గాలకే భూ కేటాయింపా?

అది రాజ్యాంగ వ్యతిరేకమే.. స్పష్టం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం

న్యాయమూర్తులు, అధికారులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ సర్కారు ఇచ్చిన జీవోల రద్దు

వారు కట్టిన సొమ్ము వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజా ప్రతినిధులు, అఖిల భారత సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు, జర్నలిస్టులను ప్రత్యేక వర్గంగా భావిస్తూ ఇళ్ల స్థలాల కోసం భూమి కేటాయించడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఈ వర్గీకరణకు వీలు కల్పించిన 2005 నాటి జీవో(243, 244)లనే కాక, భూమి కేటాయించేందుకు 2008లో జారీ చేసిన జీవోలు 419, 420, 422 నుంచి 425లను కూడా రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం అంతిమ తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని 14వ అధికరణ కింద సమానత్వ హక్కును ఈ కేటాయింపులు ఉల్లంఘించాయని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు నేపథ్యంలో భూమి కేటాయింపులకోసం ఏర్పడిన సహకార సంఘాలు, వాటి సభ్యులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము సహా డిపాజిట్ చేసిన మొత్తం డబ్బునూ తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ మొత్తంపై ఏ మేరకు వడ్డీ చెల్లించాలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించాలని, అయితే ఆ మొత్తం ఎప్పటికప్పుడు రిజర్వు బ్యాంకు నిర్ణయించే వడ్డీ రేట్లకు మించరాదని తేల్చింది. సహకార సంఘాలు, వాటి సభ్యులతో తెలంగాణ ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...

పిల్లలకు సొంత వైద్యం



ఇష్టారీతిన యాంటీబయాటిక్స్ ఇస్తున్న తల్లిదండ్రులు

ఆ చిన్నారి వయసు నాలుగేళ్లు. జలుబు, దగ్గు వచ్చింది. ఇంటి పక్కనే ఉన్న ఔషధ దుకాణానికి వెళ్లి మందులు తెచ్చి వాడారు. 2 రోజుల్లో తగ్గింది. తర్వాత మరోసారి జ్వరం, జలుబు వచ్చింది. ఈ సారి యాంటీబయాటిక్స్ వాడినా తగ్గలేదు. దీంతో డాక్టర్ వద్దకు వెళ్లారు. పరిస్థితి గమనించి ఆ చిన్నారికి వేరే మందులు ఇవ్వాల్సి వచ్చింది.

హైదరాబాద్‌కు చెందిన ఓ పాపకు వైరల్ జ్వరం వస్తే పిల్లల వైద్యుడికి చూపించి, మందులు వాడడంతో తగ్గింది. ఆర్నెల్ల తర్వాత మళ్లీ జ్వరం వస్తే.. గతంలో డాక్టర్ రాసిచ్చిన ఆ చీటీతోనే మందులను తెచ్చి వాడారు. కానీ, జ్వరం తగ్గలేదు. మళ్లీ వైద్యుడి దగ్గరకు పరుగులు పెట్టారు.

ఫలితంగా చిన్నారుల్లో ప్రభావం చూపని మందులు

చిన్న చిన్న జబ్బులూ తగ్గకపోవడంతో ఆస్పత్రులకు పరుగులు

60% ఈ తరహా కేసులే.. వేరే ఔషధాలు వాడాల్సిన దుస్థితి

మితిమీరిన యాంటీబయాటిక్స్‌తో ముప్పే: వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడడం వల్ల తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో రోగకారక సూక్ష్మజీవుల ఔషధ నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ-ఏఎంఆర్) పెరిగిపోతోంది. ఫలితంగా పిల్లలకు జ్వరం, జలుబు వంటి సమస్యలు వచ్చినా.. ఆస్పత్రుల్లో చేర్చి వేరే యాంటీబయాటిక్స్ వాడితే కానీ తగ్గడం లేదు. ఇటీవలి కాలంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పిల్లల వైద్యుల వద్దకు వచ్చే వారిలో దాదాపు 60 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదో ఒక యాంటీబయాటిక్ మందులు వేసిన వారే ఉంటున్నారు. సొంత వైద్యం, మెడికల్ షాప్‌లో ఇచ్చిన మందుల్ని పిల్లలకు వేసేస్తున్నారు. ఆ మందులతో ఇన్‌ఫెక్షన్లు తగ్గకపోవడంతో పరిస్థితి తీవ్రమవుతోంది. అలాంటి పిల్లల్ని కొన్నిసార్లు ఆస్పత్రిలో చేర్చుకొని వేరే మందులు ఇస్తే గానీ జబ్బులు తగ్గడం లేదని

మిగతా 14వ పేజీలో...

గూడు ఎప్పుడు?

మార్చిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం షురూ.. 8 నెలలు గడిచినా అమలేదీ?

లక్షల మంది పేదల నిరీక్షణ.. ఇందిరమ్మ కమిటీల నియామకమే పూర్తవలే

జాబితాలు ఖరారయ్యేదెప్పుడు?.. ఇళ్ల కోసం 80.54 లక్షల దరఖాస్తులు!

ఇందిరమ్మ ఇల్లు పథకం కింద అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు ఇస్తామన్నారు.. ఈ ఏడాది మార్చిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పథకాన్ని ప్రారంభించారు.. కానీ, ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు!! ఇళ్ల మంజూరు, లబ్ధిదారుల జాబితా ఖరారుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నియమించతలపెట్టిన 'ఇందిరమ్మ కమిటీ'లు కూడా పూర్తి స్థాయిలో ఏర్పడలేదు! దసరా, దీపావళికే ఈ పథకాన్ని అమలు చేస్తామంటూ వివిధ వేదికలపై ప్రకటించారు. అవి కేవలం ప్రకటనలుగా మిగిలిపోయాయి! దీంతో తమకు ఇళ్లు ఎప్పుడు మంజూరవుతాయోనని లక్షల మంది పేదలు ఎదురుచూస్తున్నారు.



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తోంది. నవంబరు 6న లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి, 15-20వ తేదీ కల్లా ఆ జాబితాలను ఖరారు చేసి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. ఇప్పుడు 26వ తేదీ వచ్చినా.. దీనిపై అడుగు ముందుకు పడలేదు. ఈ పథకం కింద తొలి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, రెండో విడతలో స్థలం లేని వారికి స్థలమిచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25)లో

మిగతా 13వ పేజీలో...



13 ఏళ్ల పోరడు కోటిగాడు

1.10 కోట్లతో రాజస్థాన్ సొంతమైన వైభవ్

భువనేశ్వర్‌కు జాక్‌పాట్.. రూ.10.75 కోట్లు

దీపక్ చాహర్‌కు రూ. 9.25 కోట్లు

ముగిసిన ఐపీఎల్ మెగా వేలం

11

'పెర్త్'లో కంగారెత్తించేసి..

తొలి టెస్ట్‌లో ఆసీస్‌పై భారత్ ఘన విజయం



చౌదరి శైలజ(ఫైల్)

14

బడిలో కలుషిత ఆహారం ప్రాణం తీసింది

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

కలుషిత ఆహారంతో తీవ్ర అస్వస్థత

20 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై..

పాప మృతికి ప్రభుత్వమే కారణం: హరీశ్

రాష్ట్రంలో అంబర్ రెసోజెట్ పరిశ్రమలు

13

250 కోట్లతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్లాంట్లు

మూడేళ్లలో స్థాపన.. వెయ్యి మందికి ఉపాధి

శ్రీధర్‌బాబును కలిసిన సంస్థ ప్రతినిధులు

పాన్ 2.0.. ఎయిమ్ 2.0

క్యూఆర్ కోడ్‌లతో పాన్ కార్డుల నవీకరణ

2028 దాకా అటల్ ఇన్నోవేషన్ మిషన్

కీలక నిర్ణయాలకు కేంద్ర క్యాబినెట్ ఓకే

2

వేలం ధాన్యాన్ని అమ్మేశారా?

రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీలు

ఈనెల 30న నివేదికకు పౌరసరఫరాల సంస్థ ఎండీ ఆదేశాలు

9 జిల్లాల్లోని 395 మిల్లుల్లో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలు

డిసెంబరు 31 లోపు ధాన్యం ఎత్తకపోతే 'ఈఎండీ' జప్తు

తుది గడువు దాటితే 125% చెల్లించాలని మిల్లర్లకు షరతు

యాసంగి బకాయిల వసూళ్లకు మిల్లర్లు, ఏజెన్సీలపై ఉక్కుపాదం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేలంలో విక్రయించిన ధాన్యం, దానికి సంబంధించిన నగదు వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. రైస్ మిల్లర్లు, వేలం సంస్థల ముక్కుపిండి మరీ.. బకాయిలను వసూలు చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. అయితే.. రైస్ మిల్లుల్లో వరిధాన్యం నిల్వలున్నాయా? లేకపోతే.. వాటిని అమ్మేసుకున్నారా? అనే దానిపై సంయుక్త తనిఖీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 9 ఉమ్మడి జిల్లాల్లోని 395 రైస్‌మిల్లుల్లో.. ఆయా జిల్లాల పౌరసరఫరాల

మిగతా 13వ పేజీలో...



మానుకోట మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్

కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం

రైతుల భూములు గుంజుకుంటున్న నియంత రేవంత్‌కు బుద్ధి చెబుతాం

మానుకోట నుంచే మొదటి అడుగు

రాష్ట్రవ్యాప్త ధర్నాలు.. సీఎం లగచర్ల వెళ్లుంటే ఉరికించి కొట్టేవారు

రాళ్లేస్తామన్న కాంగ్రెస్‌కు బెదరం

మానుకోట మహాధర్నాలో కేటీఆర్

మహబూబాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టేందుకు మానుకోట నుంచే మొదటి అడుగు పడిందని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రమంతా తిరిగి కాంగ్రెస్ పార్టీని, సీఎంను కూకటివేళ్లతో పెకిలిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్

మిగతా 12వ పేజీలో...

పీఠముడి

సీఎం ఎవరనేది తేల్చుకోలేకపోతున్న మహాయుతి పక్షాలు

ఢిల్లీలో పార్టీ పెద్దలతో చర్చలు జరిపి ముంబైకి ఫడణవీస్

ఫడణవీస్-శిందే సీఎంలుగా చెరి రెండున్నరేళ్లని ప్రచారం

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం 15వ అసెంబ్లీ ప్రారంభమైనట్లే

మహారాష్ట్రలో రాష్ట్రపతిపాలన ఉండకపోవచ్చు: నిపుణులు



శీతాకాల సమావేశాలకు ముస్తాబవుతున్న నాగ్‌పూర్‌లోని అసెంబ్లీ

ముంబై, న్యూఢిల్లీ, నవంబరు25: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి స్పష్టమైన మెజారిటీ వచ్చినా, ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో బీజేపీ, శివసేన, ఎన్సీపీ నేతలు ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశమై చర్చలు జరిపిన దేవేంద్ర ఫడణవీస్ తిరిగి ముంబైకి వెళ్లిపోయారు. శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ కూడా ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశంలో చర్చలు జరిపాకే తదుపరి

మిగతా 2వ పేజీలో...

అండమాన్ దీవుల దగ్గర
6 వేల కిలోల డ్రగ్స్ స్వాధీనం

పోర్టుబ్లెయిర్, నవంబరు 25: భారత తీర గస్తీ దళం అండమాన్ దీవుల దగ్గర భారీ ఎత్తున మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుందని సోమవారం అధికారులు వెల్లడించారు. ఆరు టన్నుల(6వేల కిలోల) ఈ మాదక ద్రవ్యాల(కాంట్రాబాండ్ మెథంఫెటమైన్) విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.25000 కోట్లు ఉంటుందని అంచనా. వీటిని ఒక్కోటి రెండేసి కేజీల చొప్పున 3000 ప్యాకెట్లుగా తయారుచేసి తరలిస్తున్నారు. ఈ నెల 23న అండమాన్ దీవుల వద్ద పహరా కాస్తున్న తీర గస్తీ దళం విమానం(డార్నియర్) పైలెట్ బ్యారెన్ దీవి దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న చేపల వేట ట్రాలర్‌ని గుర్తించారు. వెంటనే ఆ ట్రాలర్‌లో ఉన్నవారిని దాన్ని ఆపాలని హెచ్చరించి, అండమాన్, నికోబార్‌లోని తమ కమాండ్‌కి సమాచారం ఇచ్చారు. దీంతో దగ్గరలో ఉన్న తీర గస్తీదళం పడవలు వేగంగా అక్కడికి చేరుకుని ఆ ట్రాలర్‌ని పోర్ట్‌బ్లెయిర్‌కి తీసుకువచ్చాయి. అందులో ఉన్న ఆరుగురు మయన్మార్ జాతీయులను అరెస్టు చేశారు. ట్రాలర్‌లో ఉన్న మాదక ద్రవ్యాలను భారత్, దాని పొరుగు దేశాలకు సరఫరా చేసేందుకే తరలిస్తున్నారని భావిస్తున్నారు.

సీఎన్‌జీ ధర కిలోకు రూ.2 పెంపు

న్యూఢిల్లీ, నవంబరు 25: సీఎన్‌జీ వాహనదారులకు గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. సీఎన్‌జీ రిటైల్ ధరను కిలోకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. ముంబై సహా దేశంలోని పలు నగరాల్లో ఈ పెంపు చేపడుతున్నట్లు తెలిపాయి. అయితే త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీకి మాత్రం ధర పెంపు నుంచి మినహాయింపునిచ్చాయి. నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్‌లలో సీఎన్‌జీ ధరను రూ.2 పెంచుతున్నట్లు ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ప్రకటించింది. ముంబై సహా పరిసర ప్రాంతాల్లో ధర పెంచుతున్నట్లు మహానగర్ గ్యాస్ లిమిటెడ్ (ఎంజీఎల్), అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ తెలిపాయి. ఈ పెంపుతో ముంబైలో కిలో సీఎన్‌జీ ధర రూ.77 కానుండగా, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్‌లో రూ.81.70 కానుంది. ఢిల్లీలో మాత్రం రూ.75.09గానే ఉండనుంది. కాగా, హైదరాబాద్‌లో కిలో సీఎన్‌జీ ధర రూ.96గా ఉంది.

బ్యాలెట్ పేపర్‌తో మళ్లీ ఎన్నికలు

▸ మహారాష్ట్ర ఎన్నికలపై ఉద్ధవ్ ఠాక్రే శివసేన డిమాండ్

ముంబై, నవంబరు 25: మహారాష్ట్ర ఎన్నికల్లో పరాజయం తర్వాత ఉద్ధవ్ ఠాక్రే శివసేన పార్టీ కొత్త డిమాండ్ తెరపైకి తెచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల ఫలితాలు నిలిపివేసి బ్యాలెట్ పేపర్‌తో మరోసారి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. ఈ డిమాండ్‌పై ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌రౌత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఈవీఎంలపై 450 ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా పోలింగ్ కొనసాగించినందువల్ల ఆ ఎన్నికల ఫలితాలు నిలిపివేసి పేపర్ బ్యాలెట్‌తో మరోసారి నిర్వహించాలని కోరుతున్నామన్నారు. అప్పుడు తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎలక్షన్ కౌంటింగ్ రోజున మొదట లెక్కించిన బ్యాలెట్లలో తాము ఆధిక్యంలో ఉన్నా కూడా ఈవీఎంల కౌంటింగ్ మొదలైన తర్వాత పరిస్థితి మారి పోయిందని ఆరోపించారు. ఎన్నికల విజయాల్లో బీజేపీ ఓ వ్యూహం ప్రకారం వెళుతోందని, పెద్ద రాష్ట్రాల్లో ఆ పార్టీ గెలుస్తూ, చిన్న రాష్ట్రాలను మాత్రం ప్రతిపక్షాలకు ఇచ్చేస్తోందని రౌత్ ఆరోపించారు.

ఢిల్లీ వర్సిటీ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి రౌనక్

▸ ఉపాధ్యక్ష పదవికి ఏబీవీపీ అభ్యర్థి ఎన్నిక



న్యూఢిల్లీ, నవంబరు 25: ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్(డీయూఎస్‌యూ) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి రౌనక్ ఖత్రీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆరెస్సెస్ విద్యార్థి విభాగానికి చెందిన ఏబీవీపీ అభ్యర్థిపై 1,300ఓట్ల తేడాతో విజయం సాధించారు. డీయూఎస్‌యూ ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి గెలవడం గడిచిన ఏడేళ్లలో ఇదే తొలిసారి. మరోవైపు, స్టూడెంట్ యూనియన్ ఉపాధ్యక్ష పదవి ఏబీవీపీకి దక్కింది. ఏబీవీపీ నుంచి భానుప్రతాప్ సింగ్ 8,762ఓట్లతో మెజారిటీతో ఎన్ఎస్‌యూఐ అభ్యర్థిపై గెలిచారు. యూనియన్ సెక్రటరీ పదవి ఏబీవీపీకి, జాయింట్ సెక్రటరీ పదవి ఎన్ఎస్‌యూఐకి దక్కాయి. వాస్తవానికి ఈ ఫలితాలు సెప్టెంబరు 28న వెల్లడి కావాల్సి ఉండగా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో వాయిదా వేశారు. సోమవారం వెల్లడించారు.

బంగ్లాదేశ్ ఇస్కాన్ నేత కృష్ణదాస్ ప్రభు అరెస్టు

ఢాకా, నవంబరు 25: ఢాకా విమానాశ్రయంలో ఇస్కాన్ సంస్థ ప్రముఖ నాయకుడు కృష్ణదాస్ ప్రభు అలియాస్ చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారిని సోమవారం బంగ్లాదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. దేశం విడిచి వెళ్లకూడదని ఆంక్షలు విధించారు. కృష్ణదాస్ ప్రభు బంగ్లాదేశ్‌లో ప్రముఖ హిందూ నేతగా కూడా గుర్తింపు పొందారు. ఇస్లామిస్టుల దాడుల నుంచి రక్షించాలని కోరుతూ భారీ ప్రదర్శన కూడా నిర్వహించారు. దాంతో ఆయనపై దేశద్రోహంతో పాటు ఇతర కేసులు నమోదు చేశారు.

అమెరికా సైన్యం నుంచి ట్రాన్స్‌జెండర్ల తొలగింపు!

న్యూయార్క్, నవంబరు 25: ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే అమెరికా సైన్యం నుంచి ట్రాన్స్ జెండర్లను తొలగించేందుకు చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సంబంధిత ఉత్తర్వులను జనవరి 20న జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులను సాయుధ దళాల్లోకి తీసుకోవడం వల్ల భద్రత క్షీణిస్తోందని భావిస్తున్నందువల్లే ఆయన ఈ చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీకి చెందిన కీలక నేత చెప్పారు. అమెరికా సైన్యంలో దాదాపు 15వేల మంది ట్రాన్స్‌జెండర్లు విధులు నిర్వహిస్తున్నారు.

రష్యాకు చిక్కిన బ్రిటిష్ మాజీ సైనికుడు

మాస్కో, నవంబరు 25: ఉక్రెయిన్ తరఫున యుద్ధంలో పోరాడుతున్న ఓ బ్రిటిష్ మాజీ సైనికుడిని రష్యా సైన్యం పట్టుకుంది. అతని పేరు జేమ్స్ స్కాట్ రైస్. వయసు 22 సంవత్సరాలు. బందీగా పట్టుబడిన అనంతరం అతను వివరాలు వెల్లడించిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో.. తాను 2019 నుంచి 2023 దాకా బ్రిటిష్ సైన్యంలో పనిచేసినట్లు జేమ్స్ వెల్లడించాడు. తన ఉద్యోగం పోవడంతో ఉక్రెయిన్ సైన్యంలో చేరినట్లు చెప్పాడు. కాగా, దాదాపు 52 దేశాలకు చెందిన 20వేల మంది తమ సైన్యంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నట్లు ఉక్రెయిన్ గతంలోనే ప్రకటించింది. ఓ పక్క రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో పలు ఇతర దేశాలు పాల్గొంటుండటంతో మూడో ప్రపంచ యుద్ధం మొదలైనట్లే అని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నాటో దేశాల సైనికులు రష్యాకు చిక్కడం ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉంది.



ఇమ్రాన్‌ఖాన్ విడుదలకు ఇస్లామాబాద్ ముట్టడి

ఇస్లామాబాద్, నవంబరు 25: జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఆయన మద్దతుదారులు భారీ సంఖ్యలో సోమవారం ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్ ముట్టడికి యత్నించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ గండాపూర్, ఇమ్రాన్‌ఖాన్ భార్య బుష్రా బీబీ నేతృత్వంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) ఆందోళనకారులు ఇస్లామాబాద్ వైపు దూసుకురావడంతో పోలీసులు ఆ నగరంలోకి ప్రవేశించే మార్గాలన్నీ మూసేసి భద్రతను ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా చెలరేగిన అల్లర్లలో ఓ పోలీసు మృతి చెందగా పలువురు ఆందోళనకారులు గాయపడ్డారు. ఐదుగురు ఎంపీలు సహా దాదాపు 4వేల మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నామని పంజాబ్ ప్రావిన్సు భద్రతాధికారి షాహిద్ నవాజ్ తెలిపారు.

తొలి రోజే 'అదానీ' రచ్చ

లంచాల వ్యవహారంపై జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు.. అట్టుడికిన పార్లమెంటు



న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ తదితరులపై అమెరికా కోర్టులో లంచాల అభియోగాలు నమోదైన వ్యవహారంపై చర్చ కోసం, పార్లమెంటరీ సంయుక్త బృందం (జేపీసీ) ఏర్పాటుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఇందుకు అధికారపక్షం నిరాకరించడంతో వారు ఆందోళనకు దిగారు. ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే.. అదానీ ముడుపుల అంశంపై చర్చకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. వీటిని ఛైర్మన్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఖర్గేకు మాట్లాడే అవకాశమిచ్చారు. సభ ఎజెండాను సస్పెండ్ చేసి చర్చ చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. అదానీ నిర్వాకంతో ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠ మసకబారిందని.. అయినా ప్రధాని మోదీ ఆయనకు మద్దతిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో ఈ అంశంపై కూలంకషంగా చర్చించాలని ఇతర విపక్ష ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. ఛైర్మన్ చివరకు సభను బుధవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో కూడా అదే గందరగోళం తలెత్తింది. సభ మొదలుకాగానే.. చనిపోయిన సభ్యులకు సంతాపం తెలుపుతూ స్పీకర్ ఓం బిర్లా తీర్మానం చదివారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు వేణుగోపాల్, హిబీ ఈడెన్, మనీశ్ తివారీ, మాణిక్కం ఠాగూర్ అదానీ లంచాలపై చర్చించాలని, ఈ అంశంపై జేపీసీని వేయాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని కోరారు. సభాపతి అంగీకరించకపోవడంతో నినాదాలు చేశారు. దీంతో ఆయన సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు జేపీసీకి పట్టుబట్టడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మంగళవారం పార్లమెంటు భవనంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. భారత రాజ్యాంగం 1949 నవంబరు 26న అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఇంకోవైపు.. శీతాకాల సమావేశాల్లో 16 బిల్లులు ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కీలకమైనది.

ఏకతాటిపైకి..

ఉభయ సభల భేటీకి ముందు ఇండియా కూటమి నేతలు రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశమయ్యారు. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై చర్చకు ఐక్యంగా పట్టుబట్టాలని నిర్ణయించారు. ఉభయసభలూ వాయిదాపడ్డాక ఎంపీలు వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రమోద్ తివారీ తదితరులు మాట్లాడారు. అదానీపై చర్చకు ప్రభుత్వం భయపడుతోందన్నారు.

మహారాష్ట్ర ఓటమిని జీర్ణించుకోలేకే..

ఉభయసభల కార్యకలాపాలను విపక్షాలు స్తంభింపజేయడంపై బీజేపీ మండిపడింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో ఘోరపరాజయాన్ని జీర్ణించుకోలేక అదానీ అంశాన్ని అడ్డుపెట్టుకుని తమపై దాడిచేస్తున్నాయని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. 'ఎన్నికల్లో పరాజయాలతోమీలో నిరాశానిస్పృహలు ఏర్పడి ఉండొచ్చు. దానికి సభలను అడ్డుకుని ప్రతిఘటిస్తారా' అని ప్రశ్నించారు. విపక్షాల చర్య ప్రజలపై దాడేనని గిరిరాజ్‌సింగ్ ఆరోపించారు.

జేపీసీ గడువు పొడిగించాలి

వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన జేపీసీ కాలపరిమితిని పొడిగించాలని ఈ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ ఓం బిర్లాను కోరారు. బిల్లుపై విస్తృతమైన చర్చ జరగాలంటే కమిటీకి సహేతుకమైన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకే కేంద్రప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆరోపించింది.

దావూద్ బెదిరింపులతోనే
భారత్‌ను వీడా!

▸ ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం బెదిరింపుల కారణంగానే దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాల్సి వచ్చిందని ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ చెప్పారు. ఐపీఎల్ పోటీల్లో మ్యాచ్ ఫిక్సింగ్ చేయించాలని దావూద్ తనపై ఒత్తిడి తెచ్చాడని, అందుకు నిరాకరించడంతో చంపేస్తానని బెదిరించాడని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. చివరకు దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని హెచ్చరించాడని చెప్పారు. తనకు హెచ్చరికలు వచ్చిన విషయం పోలీసులకు కూడా తెలుసన్నారు. హిట్‌లిస్టులో ఉన్నావని, 12 గంటల పాటే రక్షణ ఇవ్వగలమని పోలీసులు చెప్పడంతో వెంటనే ముంబైని వీడాల్సి వచ్చిందని తెలిపారు. తాను అవినీతికి పాల్పడినట్టు ఏ కోర్టులోనూ రుజువు కాలేదన్నారు.


ప్రజలు తిరస్కరించిన
గుప్పెడుమంది అరాచకం



పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడమే వారి లక్ష్యం..ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం

న్యూఢిల్లీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు 80-90 సార్లు తిరస్కరించిన గుప్పెడుమంది వ్యక్తులు పార్లమెంటును నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమ రాజకీయ లబ్ధి కోసం అరాచకానికి పాల్పడుతున్నారని ప్రధాని మోదీ విమర్శించారు. సోమవారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాల ప్రారంభానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు పురోగతిలో భాగస్వాములవడం కన్నా, దాని కార్యకలాపాలను అడ్డుకోవడమే ప్రతిపక్ష పార్టీల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని మండిపడ్డారు. 'మన రాజ్యాంగ 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. రేపు సంవిధాన్ సదన్‌లో ప్రతి ఒక్కరం రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నాం. మన పార్లమెంటు, మన ఎంపీలు కూడా ఇందులో ముఖ్యమైన భాగమే. పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చలు ఉండాలి. ఈ చర్చల్లో మరింతమంది భాగస్వాములవ్వాలి. దురదృష్టవశాత్తూ ప్రజల తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు తమ రాజకీయ లబ్ధి కోసం అరాచకానికి పాల్పడటం ద్వారా పార్లమెంటును నియంత్రించేందుకు నిరంతరంగా ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను ప్రజలు గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు తప్పక శిక్షిస్తారు' అన్నారు. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని, దానికి అనుగుణంగా నడుచుకోవాలని ప్రతిపక్షాలకు మోదీ సూచించారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా సభలో అంశాలను లేవనెత్తాలన్నారు.

లోకం తీరు



హిందూ-ముస్లింల మధ్య విభజనకు
అధికార దుర్వినియోగం

▸ సంభాల్ ఘటనపై రాహుల్ ఆగ్రహం

▸ నగరంలోకి ఇతరులకు నో ఎంట్రీ



లఖ్‌నవూ, నవంబరు 25: "హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి, విభేదాలను సృష్టించడానికి బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తోంది" అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. సంభాల్‌లో జామా మసీదు సర్వే సందర్భంగా ఆదివారం చోటు చేసుకున్న ఉద్రిక్తతలు, ఐదుగురి మృతిపై ఆయన సోమవారం ఎక్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీ ప్రభుత్వానిది పూర్తిగా పక్షపాత ధోరణి అని విమర్శించారు. "మసీదు సర్వే విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. అన్నివర్గాలతో ఎందుకు చర్చించలేదు? ప్రభుత్వం భారతదేశాన్ని ఐక్యత వైపు తీసుకెళ్లాలి. మతతత్వాన్ని రెచ్చగొట్టకూడదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, సంభాల్‌లో మరణాల సంఖ్య ఐదుకు చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరి శరీరాల్లో దేశవాళీ తుపాకీ బుల్లెట్లు లభ్యమయ్యాయన్నారు. హింసాత్మక ఘటనలకు సంబంధించి సంభాల్ ఎంపీ జియా-ఉర్-రెహ్మాన్ బార్క్, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ మహమూద్ కుమారుడు సోహైల్ ఇక్బాల్‌పైనా కేసులు పెట్టినట్లు చెప్పారు. "మొత్తం ఏడు కేసుల్లో 2,750 మందిని నిందితులుగా చేర్చాం. ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు సహా.. 25 మందిని అరెస్టు చేశాం" అని పేర్కొన్నారు. సంభాల్‌లో శాంతిభద్రతల నియంత్రణకు అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఈ నెల 30 వరకు బయటివారు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలెవరూ సంభాల్‌లోకి అడుగుపెట్టకూడదని నిషేధం విధించారు.

'పీఠ'ముడి

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. 288 స్థానాలకుగాను 132 చోట్ల గెలుపొందడంతో ఈసారి బీజేపీ సీఎం ఉండాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి. ఫడణవీస్‌నే సీఎం చేస్తారని, శిందే, అజిత్ పవార్‌లను డిప్యూటీ సీఎంలుగా చేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఫడణవీస్ బ్రాహ్మణ వర్గానికి చెందిన నేత కావడంతో అధిష్ఠానం ఓబీసీ, లేదా దళిత నేపథ్యం ఉన్న నేత కోసం చూస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికల్లో శివసేన 57 చోట్ల మాత్రమే నెగ్గినా తన నేతృత్వంలో కూటమి ఘన విజయం సాధించడంతో తనను సీఎంగా కొనసాగించాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటం, మరాఠా నేపథ్యం శిందేకు కలిసివచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్లో 41 చోట్ల గెలిచిన ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ప్రస్తుత తరుణంలో ఫడణవీస్‌కు మద్దతీయాలని నిర్ణయించుకున్నారు. అయితే దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే చెరి రెండున్నరేళ్లు సీఎంగా కొనసాగే అవకాశముందనే ప్రచారం కూడా జరుగుతోంది. బీజేపీకి 21, శివసేనకు 12, ఎన్సీపీకి 10 మంత్రిత్వ శాఖలు ఇవ్వాలని నిర్ణయం జరిగినట్లు సమాచారం.

అసెంబ్లీ గడువు తీరిపోయేది నేడే

మహారాష్ట్రలో ప్రస్తుత 14వ అసెంబ్లీకి నేటితో గడువు తీరిపోనుంది. దీంతో నేడు ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోతే రాష్ట్రపతి పాలన విధిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ నెల 23న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రావడంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను ఎన్నికల సంఘం అధికారులు ఈ నెల 24న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అందజేశారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 73వ సెక్షన్ ప్రకారం 15 అసెంబ్లీ ప్రారంభమైనట్లేనని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం ఇక రాష్ట్రపతి పాలన ఉండకపోవచ్చని సమాచారం. ఢిల్లీలో జరుగుతున్న మంతనాలు కొలిక్కి వచ్చి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మరో మూడు, నాలుగు రోజుల సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

పాన్ 2.0.. ఎయిమ్ 2.0

క్యూఆర్ కోడ్‌లతో పాన్ కార్డుల ఆధునికీకరణ.. 2028 దాకా అటల్ ఇన్నోవేషన్ మిషన్ పొడిగింపు

▸ రూ.2,481 కోట్లతో ప్రకృతి వ్యవసాయానికి ఊతం

▸ కీలక నిర్ణయాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం



కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, నవంబరు 25: దేశవ్యాప్తంగా కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించేందుకుగాను.. రూ.2,481 కోట్ల విలువైన జాతీయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)కు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1,435 కోట్లతో చేపట్టనున్న 'పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) 2.0' ప్రాజెక్టుకు కూడా పచ్చజెండా ఊపింది. స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు ప్రారంభించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎయిమ్)ను 2028 మార్చి 31 దాకా పొడిగిస్తూ రూ.2750 కోట్లతో ప్రతిపాదించిన 'ఎయిమ్ 2.0'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' పథకానికి ఆమోదముద్ర వేసింది. క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. మంత్రిమండలి తీసుకున్న పలు కీలక నిర్ణయాల గురించి వివరించారు. పాన్ 2.0 ప్రాజెక్టు కింద ఇప్పటికే జారీచేసిన పాన్‌కార్డులను క్యూఆర్ కోడ్‌తో ఉచితంగా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. పాన్‌ను 'కామన్ బిజినెస్ ఐడెంటిఫయర్'గా చేసేందుకు కేంద్రం ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇక, ఎయిమ్ 2.0తో.. మెరుగైన ఉద్యోగాలు, సృజనాత్మక ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పరిశ్రమ వర్గాల అంచనా. అలాగే, ఈ పథకం కింద 30 ప్రాంతీయ నవకల్పన కేంద్రాలను, 'లాంగ్వేజ్ ఇంక్లూజివ్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇన్నోవేషన్ (లిపి)'లను ఏర్పాటు చేయనున్నారు. 2500 అటల్ టింకరింగ్ ల్యాబులను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన జాతీయ మిషన్ విషయానికి వస్తే.. భూసారాన్ని మెరుగుపరచాల్సిన అవసరం, రసాయనాలు లేని ఆహారం అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ విషన్‌కు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 15 వేల క్లస్టర్లలో 7.5 లక్షల హెక్టార్లలో ఈ మిషన్ కింద రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తారు. రైతులకు ఉపయోగపడే జీవామృతం, బీజామృతం వంటి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు 10 వేల బయో ఇన్‌పుట్ రీసోర్స్ సెంటర్ల (బీఆర్సీల)ను ఏర్పాటు చేస్తారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి 2000 నమూనా సాగు భూములను కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ వర్సిటీలు, రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తారు. ఆసక్తి ఉన్న రైతులకు.. ప్రకృతి వ్యవసాయంలో అనుభవజ్ఞులైన రైతులు, శిక్షకుల ద్వారా అక్కడ శిక్షణ ఇప్పిస్తారు. బీఆర్సీలకు జీవామృతం, బీజామృతం వంటివి అందించడానికి 18.75 లక్షల మందికి ఔత్సాహిక రైతులకు శిక్షణ ఇస్తారు. రైతుల్లో అవగాహన కల్పించేందుకు 30 వేల మంది కృషి సఖులను నియమిస్తారు. ఇక.. 2025, 2026, 2027 సంవత్సరాలకుగాను రూ.6000 కోట్లతో ప్రతిపాదించిన 'ఒకదేశం-ఒకే సబ్‌స్క్రిప్షన్' పథకంలో భాగంగా.. కేంద్రం జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యే పరిశోధన వ్యాసాలను మన దేశంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఉన్నత విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అందుబాటులోకి తెస్తారు. ప్రఖ్యాతిగాంచిన 30 అతి పెద్ద అంతర్జాతీయ జర్నల్ ప్రచురణకర్తలను కేంద్రం ఈ పథకంలో భాగం చేసింది. ఆయా పబ్లిషర్లు ప్రచురించిన 13 వేలకు పైగా ఈ-జర్నళ్లను కేంద్ర ప్రభుత్వ, పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన 6,300కు పైగా ఉన్నత విద్యాసంస్థల్లో అందుబాటులోకి తేనుంది.

పీఠికకు బాసట

సామ్య, లౌకిక వాదాల చేర్పు సరైనదే



▸ రాజ్యాంగ అవతారికను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది

▸ మళ్లీ విచారణ అవసరం లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 25: దేశంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్న తరుణంలో సుప్రీంకోర్టు సోమవారం 'పీఠిక'కు సంబంధించి కీలక తీర్పును వెలువరించింది. 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశాలకు ఆమోదం తెలిపింది. రాజ్యాంగం అవతారికలో 'సామ్యవాదం', 'లౌకికవాదం', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ అంశంపై విచారణ జరపాల్సిన పనిలేదని విస్పష్టంగా తెలిపింది. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, అత్యయిక పరిస్థితి అమల్లో ఉన్న సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో ఈ పదాలను అదనంగా చేర్చారు. దీన్ని సవాలు చేస్తూ తొలిసారిగా 2020లో బలరాం సింగ్ అనే వ్యక్తి న్యాయవాది విష్ణు కుమార్ జైన్ ద్వారా పిటిషన్ వేశారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, న్యాయవాది, బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పును వాయిదా వేసింది. సోమవారం సీజేఐ జస్టిస్ ఖన్నా తీర్పును వెలువరిస్తూ "ఈ విషయమై మరింత లోతుగా విచారణలు, తీర్పులు అవసరం లేదు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారం పీఠికకు కూడా వర్తిస్తుంది" అంటూ స్పష్టత ఇచ్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీ సవరణలు చేసేందుకు అడ్డంకి కాబోదని ధర్మాసనం తెలిపింది. ఆ తేదీ సవరణలు చేసేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారాలను తగ్గించలేదని పేర్కొంది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించగా అనంతరం ఎప్పుడో 1976లో పీఠికను సవరించి 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాలను ఎలా చేర్చుతారంటూ సుబ్రహ్మణ్యస్వామి ప్రశ్నించారు. అలా చేర్చడం ద్వారా మొదటి నుంచే ఈ భావనలు అమల్లో ఉన్నట్లైందని అభ్యంతరం చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పష్టత నిస్తూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తేదీ సవరణలకు అడ్డంకి కాబోదని తెలిపింది. "రాజ్యాంగ సవరణకు 368 అధికరణం ద్వారా పార్లమెంటుకు సంక్రమించిన అధికారం నిర్వివాదమైనది. ఆ అధికారాన్ని ఇప్పుడు సవాలు చేయలేరు" అని పేర్కొంది.

సమానత్వ భావనకు మరో రూపం

పిటిషనర్లు ప్రధానంగా అభ్యంతరం తెలిపిన 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాల చేర్పుపై ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఇది రాజ్యాంగం మౌలిక సూత్రమైన 'సమానత్వం' అన్న భావనను మరో రూపంలో చెప్పడమేనని స్పష్టం చేసింది. పీఠికలో 'లౌకిక వాదం' అన్న పదాన్ని ఎందుకు చేర్చాల్సి వచ్చిందన్న దానిపై జస్టిస్ ఖన్నా వివరణ ఇస్తూ.. "సమానత్వానికి, ప్రజా ప్రయోజనానికి అడ్డంకులు కలిగించేలా మత విశ్వాసాలు ఉంటే అందులో రాజ్యం జోక్యం చేసుకుంటుంది. ఈ స్పష్టత కోసమే పీఠికలో 'సెక్యులర్' అన్న పదాన్ని పొందుపరిచారు" అని వివరించారు. లౌకికవాద భావనను దేశ పరిస్థితులకు అనుగుణంగానే అర్థం చేసుకోవాలన్నారు.

భారతీయ నేపథ్యంలోనే భాష్యం

'సామ్యవాదం' అన్న భావనకు కూడా భారత దేశ నేపథ్యంలోనే భాష్యం చెప్పాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక విధానాలకు అడ్డంకి అని భావించకూడదని తెలిపింది. "రాజ్యాంగంగానీ, పీఠికగానీ ఏదో ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని ఎక్కడా చెప్పలేదు. 'సామ్యవాదం' అంటే 'సంక్షేమ రాజ్యా'నికి కట్టుబడి ఉండడం. సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం. 'సామ్యవాదం' అనే పదం ఆర్థిక, సామాజిక ఉన్నతి కోసం పెట్టుకున్న లక్ష్యాలను ప్రతిబింబించేది. అంతేతప్ప ప్రయివేటు రంగాన్ని, వ్యాపార, వాణిజ్యాలు చేసుకునే హక్కును నియంత్రించేది మాత్రం కాదు" అని వివరణ ఇచ్చింది. అయినా 42వ రాజ్యాంగ సవరణ జరిగి 44 ఏళ్లు గడవగా (పిటిషన్ దాఖలు చేసిన 2020నాటికి) ఇప్పుడు ఈ సమస్యను ఎందుకు లేవనెత్తారంటూ పిటిషనర్ల ఉద్దేశాలను ప్రశ్నించింది. "ఈ రెండు పదాలను చేర్చడం వల్ల ఎన్నికైన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకు గానీ, చట్టాలకుగానీ ఆటంకం కలగలేదు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కులు, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగించలేదు. ఈ పదాలకు ప్రజామోదం లభించింది" అని పేర్కొంది. తగిన చట్టబద్ధమైన కారణాన్ని చూపకుండా, అస్పష్టంగా ఉన్న ఈ పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు ప్రకటించింది.

పరారీలో రామ్‌గోపాల్ వర్మ!

- సోషల్ మీడియాలో పోస్టులపై కేసు
- అరెస్టుకు భయపడి అజ్ఞాతంలోకి



ఒంగోలుక్రైం/బంజారాహిల్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అజ్ఞాతంలోకి వెళ్లారు. సోషల్ మీడియాలో పోస్టుల కేసులో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ఆయన తప్పించుకు తిరుగుతున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా సోమవారం ఆయన ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌కు హాజరుకావాల్సి ఉండగా దుమ్మా కొట్టారు. దీంతో ప్రకాశం జిల్లా పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వర్మను అరెస్టు చేసేందుకు హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లారు. అయితే, అప్పటికే ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వర్మ తరఫు న్యాయవాది పోలీసులతో మాట్లాడుతూ.. ఆర్జీవీ ఇంట్లో లేరని, వర్చువల్‌గా విచారించేందుకు అవకాశం ఉందని, ఆ మాధ్యమంలో ప్రశ్నిస్తే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా, వర్మ కూడా వర్చువల్ విచారణకు అనుమతి ఇవ్వాలని విచారణాధికారిని కోరారు. దీనిపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇంతలో పోలీసులకు మరో సమాచారం అందింది. వర్మ తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్నట్టు తెలిసింది. దీంతో ప్రకాశం జిల్లా పోలీసులు తమిళనాడు పోలీసులతో మాట్లాడారు. మరో పోలీసు బృందాన్ని చెన్నైకి పంపేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, తొలుత తనపై ఉన్న కేసును కొట్టివేయాలని వర్మ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. న్యాయమూర్తి దానిని కొట్టేయడంతో, అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వర్మ మరో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై మంగళవారం హైకోర్టులో విచారణ జరగనుంది.

'మేడిగడ్డ' కుంగడానికి ముందే బుంగలు!

లోపాలపై 4 సార్లు లేఖలు రాశాం.. కాళేశ్వరం కమిషన్‌కు తెలిపిన అధికారులు

- ఏడో బ్లాకు ప్రమాదకరమన్న కమిషన్
- 18 మంది ఇంజనీర్ల క్రాస్ ఎగ్జామినేషన్
- నేడు విచారణకు మరో 15 మంది

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ఏడో బ్లాకు చాలా ప్రమాదకరమని కాళేశ్వరం విచారణ కమిషన్ వ్యాఖ్యానించింది. బ్యారేజీలపై విచారణ సందర్భంగా సోమవారం చీఫ్ ఇంజనీర్(సీఈ)లతో పాటు 18 మంది ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించింది. బ్యారేజీ కుంగడానికి గల కారణాలేంటని డీఈఈ ఎల్.భీమరాజును అడగ్గా.. కారణాలు తెలియవని, విశ్లేషణ జరుగుతోందని గుర్తుచేశారు. మేడిగడ్డలోని ఏడో బ్లాకు కుంగడానికి ముందే బుంగలు ఏర్పడినట్లు గుర్తించామని, వెంటనే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)కి లేఖ రాశామని భీమరాజు తెలిపారు. నాలుగు సార్లు లేఖలు రాసినట్లు నివేదించారు. ఏడో బ్లాకు కుంగడానికి ముందు బుంగలు ఏర్పడడంతో వెంటనే ఈఈకి లేఖ రాశానని, తర్వాత తొలి వరదలకు సీసీ బ్లాకులు చెల్లాచెదురయ్యాక కూడా లేఖ రాశానని, మొత్తం నాలుగు లేఖలు రాసి, అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. నిర్మాణ సంస్థకు లేఖ రాశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. రాయలేదని బదులిచ్చారు. ఈ సందర్భంగా ఏడో బ్లాకు చాలా ప్రమాదకరమని కమిషన్ వ్యాఖ్యానించింది. విచారణకు హాజరైన 18 మంది అధికారులను అఫిడవిట్‌లో



కాళేశ్వరం కమిషన్ విచారణకు వచ్చిన ఇంజనీర్లు

పేర్కొన్న వివరాలన్నీ వాస్తవాలేనా? అని ప్రశ్నించింది. ఒక్క సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) సీఈ ఓరుగంటి మోహన్‌కుమార్ మాత్రం తాను దాఖలు చేసిన అఫిడవిట్‌లో చిన్న పొరపాటు జరిగిందన్నారు. గోదావరి నదిలో ఇంద్రావతి కలిసే చోట నీటి లభ్యత అని రాశానని, అక్కడ గోదావరిలో ప్రాణహిత కలిసే చోటగా మార్పులు చేయాలని నివేదించారు. ఏఈఈ రూపాని విజయ్‌ని అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలన్నీ వాస్తవాలేనా అని అడగ్గా.. అదనంగా మరిన్ని వివరాలు చెప్పబోయారు. స్పందించిన కమిషన్.. 'అడిగిన దానికే జవాబు చెప్పాలి. అడగని వాటికి కాదు' అని మండిపడింది. రూ.2591 కోట్ల వ్యయంతో మేడిగడ్డ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చిందెవరు? అని ప్రశ్నించగా.. నీటిపారుదల శాఖ కార్యదర్శి అని బదులిచ్చారు. మరో ఏఈఈ ఎం.ప్రసాద్‌ను ప్రశ్నిస్తూ.. ప్లేస్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకాలు మీరే చేశారా? ఆ సమయంలో నిర్మాణ సంస్థల ప్రతినిధులు కూడా ఉన్నారా? అని ప్రశ్నించగా.. తానే చేశానని, తన వెంట తోటి సిబ్బంది తప్ప ఎవరూ లేరని చెప్పారు. ఏ రోజు నిర్మాణ వివరాలను ఆ రోజే రిజిస్టర్‌లో నమోదు చేశారా? లేదా? అని ఏఈఈ రవికాంత్‌ను ప్రశ్నించగా.. ఏ రోజు వివరాలు ఆ రోజే నమోదు చేశారని బదులిచ్చారు. బ్యారేజీతో ముడిపడిన డిజైన్లు ఏమైనా సిద్ధం చేశారా? అని సీడీవో ఈఈ ఎం.రామసుబ్బారెడ్డిని ప్రశ్నించగా.. డిజైన్లు తాను ఇవ్వలేదని, బ్యారేజీతో ముడిపడిన పనుల్లో తన పాత్ర లేదని, బ్యారేజీ కుంగిన తర్వాత 3డీ మోడల్ స్టడీస్‌లో తాను పాల్గొన్నానని చెప్పారు. డిజైన్ల తయారీలో మీ పాత్ర ఉందా? అని మాజీ సీఈ టి.శ్రీనివాస్‌ను ప్రశ్నించగా.. తన పాత్ర లేదన్నారు. బ్యారేజీ అనుబంధ పనుల డిజైన్లలోనే తన పాత్ర ఉందని తెలిపారు.

ప్లేస్‌మెంట్ రిజిస్టర్లపై సంతకాలు..

ప్లేస్‌మెంట్ రిజిస్టర్లపై విచారణకు హాజరైన, ఆయా రిజిస్టర్లలో వివరాలు నమోదు చేసిన ఏఈఈ, డీఈఈల సంతకాలు తీసుకున్న కమిషన్.. ఆ రిజిస్టర్లను స్వాధీనం చేసుకుంది. ఎవరు నిర్మాణబాధ్యతలు చూశారో నిర్ధారించుకోవడానికే సంతకాలు తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం 15 మంది ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది. సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించిన అధికారులను ప్రశ్నించనుంది.

గిరిజన న్యాయ విద్యార్థి మృతి

కన్సల్టెన్సీ కార్యాలయంలో

- ఫ్యాన్‌కు విగత జీవిగా వేలాడిన వైనం
- మా అమ్మాయిది హత్యే : తల్లిదండ్రులు
- మలక్‌పేటలో గిరిజన సంఘాల ఆందోళన



మలక్‌పేటలో రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనులు



శ్రావ్య(ఫైల్)

చాదర్‌ఘాట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన న్యాయ విద్యార్థి ఓ కన్సల్టెన్సీ కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. దీంతో గిరిజన సంఘాలు ఆమె మృతి పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో మలక్‌పేట పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం తక్రజ్‌గూడ తాండ నివాసి ఇస్లావత్ శ్రావ్య (20) ఎల్‌బీనగర్‌లోని శ్రుతి గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ మహాత్మాగాంధీ లా కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. పార్ట్‌టైమ్‌గా సలీంనగర్‌లోని ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ లో పనిచేస్తోంది. ఆదివారం కన్సల్టెన్సీ కార్యాలయానికి సెలవు. అయినా కార్యాలయానికి వచ్చిన శ్రావ్య సాయంత్రం అత్యవసరంగా రూ.20 వేలు కావాలని తన సోదరుడైన సాయికిరణ్‌ను ఫోన్‌లో అడిగింది. ఆ వెంటనే సాయి కిరణ్ ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేశాడు. అనంతరం కొద్ది సేపటికే శ్రావ్య మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో సాయికిరణ్ తన సోదరి హాస్టల్ స్నేహితురాలైన శిరీషకు ఫోన్ చేయగా ఆమె మరో స్నేహితురాలైన సోనీ, స్నేహితుడు కార్తీక్‌తో కలిసి శ్రావ్య పని చేసే కార్యాలయానికి వెళ్లారు. అక్కడ న్యాయవాది రవీందర్‌తో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ కిటికీల్లో నుంచి చూసేసరికి శ్రావ్య సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆమెను మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, శ్రావ్యది ఆత్మహత్య కాదని, హత్యే అని ఆమె తండ్రి రమేష్, తల్లి కంసా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్సల్టెన్సీ నిర్వాహకుడైన నవీన్‌ను ఎందుకు అదుపులోకి తీసుకోలేదని పోలీసులను నిలదీశారు. శ్రావ్య అనుమానస్పద మృతిపై గిరిజన సంఘాల ప్రతినిధులు, గిరిజన న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు గిరిజన సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కాగా, శ్రావ్య మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు.

బ్యాంకాక్ నుంచి బ్యాగుల్లో పాములు

- శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల అదుపులో ఇద్దరు మహిళలు



పట్టుబడిన పాములు

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళలు బ్యాంకాక్ నుంచి బ్యాగుల్లో విషపూరిత పాములను తీసుకొస్తూ శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు చిక్కారు. సోమవారం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విమానంలో ఇద్దరు మహిళా ప్రయాణికులు అనుమానాస్పదంగా కనిపించడంతో కస్టమ్స్ అధికారులు వారి బ్యాగులను స్కాన్ చేశారు. ఆ బ్యాగుల్లో రెండు పాములు ఉన్నట్లు గుర్తించి ఆ మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పాములను ఎందుకు తీసుకొచ్చారు..? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పాముల స్మగ్లింగ్‌పై పలు అనుమానాలున్నాయని అధికారులు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన పాములను జూపార్క్‌కు తరలించినట్లు వెల్లడించారు.

వియత్నాం అమ్మాయి.. చండూరు అబ్బాయి

- ప్రేమించిన అబ్బాయి కోసం ప్రభుత్వ ఉద్యోగం వదిలి భారత్‌కు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం



చండూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వివాహం చేసుకున్న నీనా, సందీప్

చండూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వియత్నాం దేశానికి చెందిన అమ్మాయి నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన అబ్బాయి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారిరువురూ సోమవారం చండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకొని తమ పెళ్లిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన సందీప్ హైదరాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం 2017లో వియత్నాంలో బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగంలో చేరారు. 2019 నుంచి ఆ దేశంలోనే సొంతంగా హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వియత్నాంకు చెందిన నీనా అనే యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వారిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. నీనా యూత్ మినిస్ట్రీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు.అక్కడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతర దేశాలకు చెందిన వారిని వివాహం చేసుకుంటే, తాము చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయాలనే నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో నీనా తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశారు. చండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సందీప్, నీనా దండలు మార్చుకుని వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోగా, సబ్ రిజిస్ట్రార్ నూతన వధూవరులకు వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

మలక్‌పేటకు గోషామహల్ స్టేడియం...?

సైదాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని మలక్‌పేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సోమవారం మలక్‌పేట బీ బ్లాక్‌లోని ప్రభుత్వ గృహ సముదాయాలున్న స్థలాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్, సీపీ సీవీ ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్, డిప్యూటీ కలెక్టర్ ముకుందరెడ్డిలు పరిశీలించినట్లు సమాచారం. సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ స్థల వివరాలను డీజీపీ, సీపీలకు వివరించినట్లు తెలుస్తోంది. ఈ వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. కాగా, గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ సవ్యసాచి ఘోష్‌కు విరాళ పత్రాన్ని అందజేస్తున్న దొడ్ల డెయిరీ సీఈవో బీవీకే రెడ్డి

కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలకు దొడ్ల డెయిరీ రూ.4 కోట్ల విరాళం

రాజేంద్రనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధికి దొడ్ల డెయిరీ రూ. 4 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన దొడ్ల డెయిరీ బోర్డు ఆమోద పత్రాన్ని సంస్థ సీఈవో బీవీకే రెడ్డి విశ్వవిద్యాలయం ఉపకులపతి, పశు సంవర్థక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సవ్యసాచి ఘోష్‌కు సోమవారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో అందజేశారు. ఈ విరాళంతో కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల భవనం మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్‌హెచ్ 44 నుంచి కళాశాల వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, కళాశాల నుంచి బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, కళాశాల భవనానికి మరమ్మతులు, రంగులు వెయ్యడం, కళాశాల ప్రాంగణంలో సుందరీకరణ, మినీ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు, ఇతర అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తామని బీవీకే రెడ్డి తెలిపారు. ఈ పనులకు సంబంధించి విశ్వవిద్యాలయం ఆమోదాన్ని ఇవ్వాలని ఉప కులపతి సవ్యసాచి ఘోష్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్రను ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన దొడ్ల డెయిరీ యాజమాన్యం, చైర్మన్ సునీల్‌రెడ్డి, సీఈవో బీవీకే రెడ్డిలను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ వసతుల కల్పనతో రాబోయే కాలంలో కళాశాలలో ఎంటెక్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు.

నకిలీ బంగారంతో రుణాలు!

- ఖమ్మంలోని పలు బ్యాంకుల్లో అంతర్గత విచారణ
- ఒక్క సహకార బ్యాంకులోనే రూ.30 లక్షల మోసం
- గిరిజనుల పేరుతో ఖాతాలు.. తాకట్టు రుణాలు

ఖమ్మం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల్లో నకిలీ బంగారంతో గోల్డ్‌లోన్ తీసుకున్న దందా వెలుగులోకి వచ్చింది. దీంతో.. బ్యాంకర్లు అంతర్గత విచారణ జరుపుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. ఇప్పటి వరకు ఓ సహకార బ్యాంకు పరిధిలోనే రూ.30 లక్షల వరకు నకిలీ బంగారం రుణాల బాగోతం బయటపడినట్లు తెలుస్తోంది. దాంతో డీసీసీబీ రికవరీకి చర్యలను ప్రారంభించింది. వ్యవస్థీకృత ముఠాలు ఇదే నేర్పైలితో పలు బ్యాంకుల్లో గోల్డ్ రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఏపీ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్ నకిలీ బంగారం దందాకు తెరతీసినట్లు తెలుస్తోంది. గిల్టు చేతి కడియాలు, బ్రేస్‌లెట్లు, ఇతర నగలను తయారు చేయించి.. బంగారుపూత దట్టించి.. బ్యాంకుల్లో గోల్డ్‌లోన్ తీసుకుంటున్నట్లు సమాచారం. 15 మంది సభ్యులున్న ఈ ముఠా.. ఖమ్మం పట్టణంలో కొందరు, ఖమ్మం రూరల్ మండలంలో మరికొందరితో కలిసి.. రుణాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ ముఠా తెలివిగా గిరిజనులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి.. వారి పేరిటే రుణం తీసుకుంటోంది. ఏపీజీవీబీ బ్యాంకులో ఈ తరహా మోసం వెలుగులోకి వచ్చిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ ముఠా ఖమ్మంలోని పలు వాణిజ్య బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో కూడా నకిలీ బంగారంతో రూ.కోట్లలో రుణం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే.. బ్యాంకు పేరుప్రతిష్ఠలు దెబ్బతింటాయనే ఆందోళనతో బ్యాంకు మేనేజర్లు, అధికారులు ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది. అయితే.. అంతర్గతంగా విచారణ జరుపుతూ.. రికవరీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలు బ్రాంచ్‌లలో నిందితులు పోలీసు కేసుల భయంతో నగదును చెల్లించినట్లు తెలిసింది. అయితే.. రంగంలోకి దిగిన పోలీసులు.. ఏపీజీవీబీ అధికారుల వద్ద నిందితుల సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఒకట్రెండ్రోజుల్లో సుమోటోగా కేసులు నమోదు చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం. మరో ఐదు సహకార బ్యాంకుల్లోనూ నకిలీ బంగారం కలకలం రేగుతున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకర్ల పాత్రపై అనుమానాలు

నకిలీబంగారం తాకట్టు వ్యవహారంలో బ్యాంకర్ల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంగారం నాణ్యత, స్వచ్ఛత తనిఖీ యంత్రాలు ప్రస్తుతం పాన్‌బ్రోకర్ల వద్ద కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు తనిఖీలు లేకుండానే రుణాలిచ్చారా? కనీసం అప్రైజర్లనైనా నియమించుకుని, తనిఖీ చేయకపోవడానికి కారణాలేమిటి? గుంటూరు ముఠాకు రుణాలివ్వడంలో బ్యాంకర్ల పాత్ర ఉందా? అనేవి ప్రస్తుతానికి సమాధానాల్లేని ప్రశ్నలే..! పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపడితే.. అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జయాపజయాలు

మహారాష్ట్రలో మహాయుతి విజయాన్నే జాతీయ మీడియా కీర్తిస్తున్నదని, జార్ఖండ్‌లో హేమంత్ సొరేన్ ఘనవిజయం దానికి పట్టడం లేదని కాంగ్రెస్ నాయకులకు కోపం. ఎవరే రాష్ట్రాన్ని ఏలుతున్నారో, వారే అక్కడ గెలిచారు తప్ప మహారాష్ట్ర విజయంలో వేరు ఘనత ఏమిటని వారి ప్రశ్న. ఎన్నికలు జరిగిన రెండు రాష్ట్రాల్లో మహారాష్ట్ర అసెంబ్లీ స్థానాల రీత్యా కూడా పెద్దది కనుక దానికి మీడియాలో అధిక గుర్తింపు దక్కినమాట నిజం. దేశ ఆర్థిక రాజధాని ఉన్నందునా, దేశ రాజకీయాలకు వనరులు సమకూర్చగలిగే సమర్థత ఉండటంతోనూ, అనేక వరుస రాజకీయ విన్యాసాలకు, పరిణామాలకు కేంద్రం కావడంతోనూ మహారాష్ట్ర మీద ఎక్కువ దృష్టి ఉండటం సహజం. మీడియా ఇంతగా దృష్టిపెట్టినప్పటికీ మహాయుతి ఘనవిజయాన్ని ఎందుకోగానీ అది ముందుగా పసిగట్టలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికలు జరిగి ఇంకా ఆర్నెల్లు కూడా కాలేదు, అప్పట్లో 48 స్థానాల్లో ముప్పై మూటగట్టి మహావికాస్ అగాడీకి ఇచ్చిన జనం, ఇప్పుడు ఆ కూటమిని ఇంతలా ముంచేస్తారని ఊహించలేకపోయింది. పోటీచేసిన 17 ఎంపీ స్థానాల్లో పదమూడింటిని అప్పట్లో గెలుచుకోగలిగిన కాంగ్రెస్ సహా అగాడీ పార్టీలన్నీ ఈ పరాభవాన్ని లోతుగా సమీక్షించుకోక తప్పదు.

అగాడీకి ఆయుష్షు తీరినట్టేనని, సమీప భవిష్యత్తులో అది కోలుకోదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఏక్‌నాథ్ శిందేలను సృష్టిస్తాం, మిమ్మల్ని కూల్చేస్తాం అని వెన్నుపోట్లకూ, చీలికలకూ ఒక నిలువెత్తు నిదర్శనంగా, ఆయుధంగా విపక్షపాలిత రాష్ట్రాల్లో బీజేపీ నాయకులకు ఉపకరించే ఓ వ్యక్తి ఇంత అద్భుతం చేస్తాడని ఎవరూ అనుకోలేదు. దశాబ్దాలుగా మహారాష్ట్రను ఏలిన రెండు రాజకీయ కుటుంబాలనుంచి చీలివచ్చినవారిని ముందుబెట్టి బీజేపీ నెరపిన ఈ రాజకీయాన్ని ప్రజలు ఒప్పుకుంటారనుకోలేదు. అధికార పక్షంలోనూ, విపక్షంలోనూ ఒక ఎన్సీపీ, ఒక శివసేన ఉన్నప్పుడు ఆయా పార్టీల వ్యవస్థాపకులో, వారి వారసులో ఉన్నవైపు ప్రజలుంటారని అనుకుంటాం తప్ప, వారిని దెబ్బకొట్టివచ్చినవారికి బ్రహ్మరథం పడతారని ఎలా అనుకుంటాం? విశ్లేషకులకు అర్థంకాని చిక్కుప్రశ్నలివి. నేరుగా సేన వర్సెస్ సేన యుద్ధం జరిగిన స్థానాల్లో, ఏక్‌నాథ్ శిందే డెబ్బయ్‌శాతం నెగ్గుకొస్తే, బాల్‌థాకరే పుత్రరత్నం రన్‌రేట్ ఇరవైఐదు కూడా లేదు. ఉద్ధవ్ ఠాక్రే, శరద్‌పవార్ పక్షాన ఉన్న వారిని భయపెట్టి, బెదిరించి బీజేపీ తమవైపు తిప్పుకున్నదనీ, ఈ కూటమికి కండబలం, అర్థబలం తప్ప ప్రజాబలం లేదన్న వాదనలను ఈ ఫలితాలు వమ్ముచేశాయి. వ్యూహం ఫలించింది, నిరీక్షణ ముగిసింది కనుక ఇప్పుడు స్టీరింగ్ వీల్ ముందు ఫడ్నవీస్‌ను కూచోబెట్టి బీజేపీ నేరుగా రాజ్యం చేయాలని ప్రయత్నిస్తోంది. ఇంతకాలం బీజేపీని హద్దుల్లో ఉంచగలుగుతున్న శిందే ఏంచేస్తారో చూడాలి.

పెద్దరాష్ట్రం మహారాష్ట్రలో జరిగిన అవమానం నుంచి కాంగ్రెస్‌ను ఆదివాసుల రాజ్యం కాపాడుకొచ్చింది. ఈ విజయంలో జార్ఖండ్ ముక్తిమోర్చాదే అధికవాటా అయినప్పటికీ, కాంగ్రెస్, ఆర్జేడీ ఇత్యాది ఇండియాబ్లాక్ పార్టీల సమష్టి కృషి కారణంగా బీజేపీని సుదూరంలో నిలువరించడం సాధ్యమైంది. ఎస్టీ స్థానాలే కాదు, ఎస్సీ, జనరల్ స్థానాలను సైతం ఈ కూటమి చక్కగా నెగ్గింది. హేమంత్ సొరేన్ మీద అవినీతి కేసులు, అరెస్టు, జైలు, బెయిలు ఇత్యాదివి ప్రజల మీద వ్యతిరేకంగా పనిచేసినట్టు కనిపిస్తోంది. ఈశాన్య జార్ఖండ్‌లోని సంథాల్ పరగణాస్ పూర్తిగా బంగ్లాదేశీ చొరబాటుదారులతో నిండిపోయిందనీ, అసలు ఆదివాసీలకు ఏదో అన్యాయం జరిగిపోతోందనీ బీజేపీ చేసిన ప్రచారం కూడా ఫలించలేదు. ఆదివాసులకు, ముస్లింలకు మధ్య విభజనరేఖ గీయాలన్న ప్రయత్నాన్ని ఓటర్లు తిప్పికొట్టారు. సంథాల్ పరగణాలలో ఐదేళ్ళక్రితం నాలుగుస్థానాలు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు ఒక్కదానికే పరిమితం కావడం, మొత్తం 28 ఎస్టీ స్థానాల్లో ఒకటి మినహా మిగతావన్నీ జెఎంఎం–కాంగ్రెస్ కూటమికి దక్కడం విశేషం. జార్ఖండ్‌లో బీజేపీని నెగ్గించే బాధ్యత భుజానవేసుకున్న హిమంత బిశ్వశర్మ ఇక్కడ కూడా అసోం నమూనా ప్రయోగించాలని చూశారు. జెఎంఎం–కాంగ్రెస్ కూటమిని ముస్లిం అనుకూల, ఆదివాసీ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించిన వీడియోలు అనేకం ప్రచారంలోకి వచ్చినప్పటికీ, ఆదివాసులు ఆ మాయలో పడకపోవడం, చంపయ్ సొరేన్ వంటివారి మాటలను నమ్మకపోవడం విశేషం. సంక్షేమ పథకాలతో మళ్ళీ ముఖ్యమంత్రి అవుతున్న హేమంత్ సొరేన్ ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు, ఉపాధి అవకాశాలమీద కూడా దృష్టిపెట్టాలి.

'మహా' విపక్షాల భవిష్యత్తు ఏమిటి?

ఈ శతాబ్దం తొలినాళ్ల మాట. మహారాష్ట్రలో బీజేపీ–శివసేన పొత్తుకు ప్రధాన కారకుడు అయిన బీజేపీ నాయకుడు ప్రమోద్ మహాజన్ (ఇప్పుడు కీర్తి శేషుడు)ను, 'కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న భారతీయ జనతా పార్టీ మహారాష్ట్రలో శివసేనకు జూనియర్ భాగస్వామిగా ఉండడానికి ఎందుకు అంగీకరించిందని' ప్రశ్నించాను. ఆయన ఇలా సమాధానమిచ్చారు: 'రాజకీయాలలో ఎవరైనా సరే తమ సమయం వచ్చే దాకా వేచి ఉండాల్సిందే. వాజపేయి ఇప్పుడు దేశ వ్యాప్తంగా అందరి గౌరవాదరాలు పొందుతున్న సమున్నత నేత. అయితే మహారాష్ట్రలో బాలా సాహెబ్ ఠాక్రే నాయకత్వం అవసరం మాకు, ప్రతి ఒక్కరికీ ఉంది. ఏదో ఒక రోజు శివసేన అవసరం మాకు ఉండకపోవచ్చు. ఆ సమయం వచ్చినప్పుడు మేమే అన్నిటినీ నిర్దేశిస్తాం'. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం, శివసేన అధినేత బాలా సాహెబ్ మరణించిన పన్నెండేళ్లకు, ప్రమోద్ మహాజన్ స్వప్నాన్ని బీజేపీ తిరుగులేని రీతిలో సాధించింది: మహారాష్ట్రలో ఇప్పుడు ఎదురే లేని నెంబర్ 1 పార్టీ భారతీయ జనతా పార్టీ. 2024 శాసనసభ ఎన్నికలలో సొంతంగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది ఎట్టకేలకు మిత్రపక్షాలను, ప్రత్యర్థి పార్టీలను తన అభీష్టాల ప్రకారం నిర్దేశించగలిగే, నియంత్రించగలిగే ప్రభావ ప్రాబల్యాల విజేతగా ప్రభవించింది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అయిన మహారాష్ట్రలో ఈ పెనుమార్పు ఎలా సంభవించింది? 1988లో పొత్తు కుదుర్చుకున్న బీజేపీ, శివసేనలు రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో కలసికట్టుగా పోటీ చేసేవి. అయితే 2014లో ఈ మిత్రపక్షాలు మొట్టమొదటిసారి వేటికవే పోటీ చేశాయి. నరేంద్ర మోదీ పలుకుబడితో బీజేపీ 122 సీట్లు గెలుచుకోగా శివసేన 63 స్థానాలను స్వాయత్తం చేసుకున్నది. హిందుత్వ రాజకీయాలలో, ముఖ్యంగా మహారాష్ట్రలో ఏ పార్టీ ప్రధాన శక్తి అన్నది ఆ ఫలితాలతో స్పష్టమయింది. 2019 శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్– ఎన్సీపీ కూటమితో శివసేన కలవడంతో రాష్ట్రంలో కాషాయ కూటమి ఏకైక ప్రతినిధిగా బీజేపీ మిగిలిపోయింది. 2022లో శివసేనను చీల్చడం ద్వారా తన ఒకప్పటి మిత్రపక్షమైన శివసేనను మరింతగా బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. తాజా శాసనసభ ఎన్నికలలో నాలుగింట మూడు వంతుల మెజారిటీతో తిరుగులేని విజేతగా నిలిచిన బీజేపీ మహారాష్ట్ర రాజకీయాలలో గుత్తాధిపత్యం చెలాయించే పరిస్థితి నెలకొన్నది.

మహారాష్ట్రలో తన ఎదుగుదలకు ప్రధాన ప్రతిబంధకం కాంగ్రెస్ కాదని, ప్రాంతీయ పార్టీలే అన్న సత్యం బీజేపీకి మొదటి నుంచీ బాగా తెలుసు. పశ్చిమ మహారాష్ట్రలో అన్ని విధాల ప్రబలంగా ఉన్న సహకార సంఘాలు, వాటి పెత్తందారులపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి నియంత్రణ ఉండగా మరాఠీ అస్మిత (ఆత్మ గౌరవం)కు శివసేన ప్రతీకగా వెలుగొందుతోంది. ముంబైలో భూమి పుత్రుల ఉద్యమంతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివసేన మహారాష్ట్రియన్ హిందూ అస్తిత్వం భావోద్వేగాల ఆధారంగా గ్రామీణ మహారాష్ట్రకు కూడా వ్యాపించి వేళ్లూనుకున్నది. మిత్ర పక్షాలుగా ఉన్న కాలంలో కూడా బీజేపీ, శివసేనలు ఒకే (హిందూ) ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకునేందుకు పోటీపడవలసివచ్చేది. పంజాబ్‌లో మిత్రపక్షమైన అకాలీ దళ్ నుంచి బీజేపీకి ఇటువంటి పోటీ ఉండేది కాదు. బీజేపీ–శివసేన కూటమి పాతిక సంవత్సరాల పాటు ఎత్తు పల్లాలను చూసింది. మహారాష్ట్రలో వేళ్లూనుకోవడానికి శివసేన స్థానిక పలుకుబడి బీజేపీకి ఎంతైనా అవసరమయ్యేది. బీజేపీ మనుగడకు ప్రధాన ఆలంబనగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దశాబ్దాలుగా అగ్రవర్ణ, మరీ ముఖ్యంగా బ్రాహ్మిణ్‌ల నాయకత్వంలోని పార్టీగా పేరు పడింది. శివసేనతో జతకట్టడం ద్వారా సంఘ్ పరివార్ తన ప్రజాదరణను పెంచుకోగలిగింది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని రాజ్యాధికారం ఆసరాతో బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. ఆ పార్టీకి చెందిన ఆర్థికంగా, రాజకీయంగా శక్తిమంతులైన నాయకులు అందరిపైన దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం జరిగింది. మరి 2023లో ఎన్సీపీలో చీలిక సంభవించినప్పుడు పార్టీ ఫిరాయించిన నేతలు అందరూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులను ఎదుర్కొంటున్నవారే కావడంలో ఆశ్చర్యమేముంది? నాయకుల వ్యక్తిగత అధికార లాలస, దర్యాప్తు సంస్థల ఒత్తిడి, భావజాలపరమైన విభేదాల కలగలుపు ఫలితంగా శివసేనలో చీలిక సంభవించింది. కాంగ్రెస్‌తో శివసేన పొత్తు పెట్టుకోవడం ఒక ఆశ్చర్యకర పరిణామం. ఎందుకని? బాబ్రీ మసీదును కూల్చివేసిన ఘనత తమదే అని ఘనంగా చాటుకున్న పార్టీ అసలు రాముడి అస్తిత్వాన్నే అంగీకరించని పార్టీతో కలవడమేమిటి? అని శివసేన కార్యకర్తలు సహజంగానే విస్మయం చెందారు. అయోమయంలో పడ్డారు. తమ నాయకులు తమను మోసగించారని అభిప్రాయపడ్డారు. అధికార లాలస అమితంగా ఉన్న ఏక్‌నాథ్ శిందే బీజేపీ ప్రోత్సాహంతో ఉద్ధవ్ ఠాక్రే పార్టీ భావజాలాన్ని ఉపేక్షించడాన్ని ప్రశ్నించారు. ఎదురు తిరిగారు. బాలాసాహెబ్ వారసత్వానికి తానే నిజమైన యోగ్యుడనని చాటుకున్నారు, నిరూపించుకున్నారు. ఈ పరిణామాల మధ్య ఉద్ధవ్ ఠాక్రే పార్టీని కాపాడుకునేందుకు చాలా కష్టాలు పడ్డారు.



> మహారాష్ట్రలో సాహు–పూలే–అంబేడ్కర్‌ల ప్రగతిశీల సామాజిక వారసత్వం ప్రభావశీలంగా ఉన్నది. వెనుకబడిన కులాల, దళిత వర్గాల ఉద్యమాలు, రాజకీయాలపై వామపక్షాల ప్రభావం బలంగా ఉన్నది. ఈ కారణంగా సంఘ్ పరివార్ మహారాష్ట్ర సమాజం, రాజకీయాలపై పట్టు సాధించుకోలేకపోతోంది. 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆ ప్రగతిశీల వారసత్వం పరిమితులను బహిర్గతం చేసింది. గుజరాత్‌లో వలే మహారాష్ట్రలోనూ ప్రతిపక్షాలు మళ్లీ అధికారానికి రాలేని పరిస్థితి నెలకొంటుందా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న

శివసేనలో చీలిక బీజేపీ తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పించింది. నరేంద్ర మోదీ–అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ, వాజపేయి–అడ్వాణీ ద్వయం పాటించిన సమ్మిళిత సంకీర్ణ ధర్మాలను క్రమంగా త్యజిస్తూ ఒక ప్రాంతీయ పార్టీతో ఏర్పాటు చేసుకున్న కూటమిలో తానే ఆధిపత్య పక్షంగా వ్యవహరించడం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతో రాష్ట్ర స్థాయి భాగస్వామ్యపక్షాలు తాను నిర్దేశించిన విధంగా వ్యవహరించేలా చేయడంలో పూర్తిగా సఫలమవుతోంది. అసోంలో అసోం గణ పరిషత్ ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఒక జూనియర్ భాగస్వామిగా ఉన్నది. గోవాలో ఒకప్పుడు సర్వాధిపత్యంతో వ్యవహరించిన మహారాష్ట్ర వాది గోమంతక్ పార్టీ ఇప్పుడు బీజేపీకి ఒక చిన్న అనుబంధ పార్టీ మాత్రమే? కర్ణాటకలో జనతాదళ్ (ఎస్) బీజేపీ నిర్దేశించినట్లు వ్యవహరించాల్సిందే. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్న బిహార్‌లో సైతం తన సమయం కోసం బీజేపీ ఓర్పుతో వేచివున్నది. ఎన్‌డీఏలోని ఇతర భాగస్వామ్య పక్షాలు చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అనివార్యకారణాల వల్లే కూటమిలో ఉన్నాయి కాని భావజాలపరమైన ఏకీభావంతో కాదనేది అందరికీ తెలిసిన విషయమే.



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

ఇప్పుడు మహారాష్ట్రలో బిగ్‌బాస్ ఎవరు అనేది ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లకు బాగా తెలుసు. మహిళలకు నేరుగా నగదు బదిలీ చేసే లడ్కీ బహీన్ పథకం ఆలంబనతో తనను తాను సామాన్యమానవుని సంక్షేమానికి మొదటి ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రిగా ప్రజాదరణను పెంచుకోవడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఆయనకు ప్రజాదరణ పెరిగిందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ బీజేపీ ప్రాపకం పైనే శిందే ఆధారపడి ఉన్నారన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. అజిత్ పవార్ సైతం తన బాబాయి శరద్ పవార్ నీడ నుంచి బయటపడి సొంతంగా వెలుగొందుతున్నప్పటికీ బీజేపీ ఎప్పుడైనా సరే తనపై కేసులు మోపగలదనే సత్యాన్ని విస్మరించలేరు. ఒక విధంగా మహారాష్ట్ర ప్రాంతీయ పార్టీల నాయకులు అందరూ ఒక జనరల్ ఆదేశాలను పాటించే బెటాలియన్ కమాండర్లు మాత్రమే.

గుజరాత్‌లో మాదిరిగా మహారాష్ట్రలో కూడా ప్రతిపక్షాలు మళ్లీ అధికారానికి రాలేని పరిస్థితి నెలకొంటుందా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. గుజరాత్‌లో బీజేపీ తన తిరుగులేని ప్రాబల్యాన్ని చాల తేలిగ్గా సాధించుకోగలిగింది. ఆ రాష్ట్రంలో బీజేపీని సమర్థంగా ఎదుర్కోగల ప్రతిపక్షమేదీ లేకపోవడమే అందుకు కారణమని చెప్పవచ్చు. మహారాష్ట్రలో సాహు–పూలే–అంబేడ్కర్‌ల ప్రగతిశీల సామాజిక వారసత్వం ప్రభావశీలంగా ఉన్నది. వెనుకబడిన కులాల, దళిత వర్గాల ఉద్యమాలు, రాజకీయాలపై మధ్యేవాద శక్తులు, వామపక్షాల ప్రభావం బలంగా ఉన్నది. ఈ కారణంగా సంఘ్ పరివార్ మహారాష్ట్ర సమాజం, రాజకీయాలపై తన పట్టును సాధించుకోవడంలో అనేక ప్రతిబంధకాలనెదుర్కొంటున్నది. 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆ సుదృఢ ప్రగతిశీల వారసత్వం పరిమితులను బహిర్గతం చేసింది. ధనశక్తి ప్రభావంతో పాటు అవకాశవాద రాజకీయాలు ఆ వారసత్వాన్ని బాగా దెబ్బతీశాయి. శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే ఇరువురూ ఇప్పుడు అనిశ్చిత భవిష్యత్తు నెదుర్కొంటున్నారు. ఇరువురూ తమ తమ పార్టీలపై పట్టు కోల్పోయారు. బీజేపీతో ముఖాముఖి పోటీ చేసిన 75 నియోజకవర్గాలలో కాంగ్రెస్ 62 స్థానాలలో చిత్తుగా ఓడిపోయింది. గత సార్వత్రిక ఎన్నికలలో లభించిన సానుకూలతలన్నిటినీ కాంగ్రెస్ పూర్తిగా కోల్పోయింది. రాబోయే ఐదేళ్ల కాలంలో మహారాష్ట్ర రాజకీయాలపై తన పట్టును ఎటువంటి మినహాయింపులు లేకుండా బిగించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తుంది. గుజరాత్ వలే మహారాష్ట్ర హిందుత్వకు ప్రయోగశాల కాకపోవచ్చు కానీ మరాఠా భూమిలో ఒక కొత్త వ్యవస్థ ఏర్పడుతుందనడంలో సందేహం లేదు. తన శత వార్షికోత్సవాన్ని జరుపుకొనేందుకు సంసిద్ధమవుతున్న (నాగపూర్ ప్రధాన కేంద్రంగా ఉన్న) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు మహారాష్ట్ర సంఘ్ పరివార్ పాలనలోకి రావడం కంటే ఉత్తమ కానుక మరేముంటుంది?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సవరణ బిల్లుతో వక్ఫ్ ఆస్తులకు చిల్లు

ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టబోతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈ అంశంపై ముస్లిం సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలూ తీవ్రంగా అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మొండిగా ముందుకు పోతున్నది.

ఇటీవలి కాలంలో బాగా ప్రచారంలో ఉన్న పదం 'వక్ఫ్'. దీని అర్థం– నిలకడ, ఆపుదల, ధర్మ సొత్తు, ధర్మార్థము అని. షరియత్ పరిభాషలో ఎవరైనా ఒక వ్యక్తి తనకు చెందిన ఆస్తిపై లేక వస్తువుపై తన హక్కును, యాజమాన్యాన్ని పూర్తిగా వదులుకొని దైవానికి దఖలుపరచడాన్ని 'వక్ఫ్' అంటారు. అంటే భూమి, వస్తువు లేక మరి దేన్నయినా వక్ఫ్ చేసిన తరువాత ఇక దానిపై దఖలు పరిచిన వ్యక్తికి గాని, వారసులకు గాని, మరెవరికైనా గాని ఏవిధమైన హక్కూ ఉండదు. అది పూర్తిగా దైవానికే చెందిన ఆస్తి. వక్ఫ్ ప్రధాన ఉద్దేశ్యం దైవాన్ని సంతోషపరచడం, సాటి మానవులపై ప్రేమను, సోదరభావాన్ని వ్యక్తపరచడం.

ప్రవక్త కాలంలో ప్రారంభమైన వక్ఫ్ భావన ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ కొనసాగుతున్నది. భారతదేశాన్ని రమారమి వెయ్యేళ్ళపాటు పాలించిన ముస్లిం రాజులు అసంఖ్యాక మసీదులకు, ఖబ్రస్తాన్‌లకు, దర్గాలకు, విద్యాలయాలకు విలువైన భూములు, ఆస్తులు వక్ఫ్ చేశారు. ఆయా వ్యవస్థలు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సజావుగా నిరాటంకంగా కొనసాగడానికి ఈ ఆస్తులు దోహదపడాలని వాటిని అల్లాహ్ పేర అంకితం చేశారు. కనుక వక్ఫ్ ఆస్తులపై ఎవరికీ ఎటువంటి హక్కూ, అధికారము ఉండదు. వాటినికి కేవలం అర్హత కలిగిన పేద సాదల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. కాని ఈ స్ఫూర్తికి భిన్నంగా ఆంగ్లేయుల కాలంలో వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగం మొదలైంది. అప్పుడు ముస్లింలు దీన్ని అడ్డుకోవడంతో వక్ఫ్ యాక్ట్ 1923 ఉనికిలోకి వచ్చింది. 1945లో పూర్తిస్థాయిలో వక్ఫ్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. అనేక సందర్భాల్లో సవరణలు కూడా చేశారు. ఈ యాక్ట్ ప్రధాన ఉద్దేశ్యం వక్ఫ్ ఆస్తుల్ని సంరక్షించడం, వాటి దుర్వినియోగాన్ని నివారించడం. కాని దురదృష్టవశాత్తూ ఈ యాక్ట్ ఉద్దేశ్యం నెరవేరలేదు. అప్పుడు మళ్ళీ 1985లో మరో కొత్త వక్ఫ్ చట్టం తీసుకువచ్చినా ముస్లింల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. తరువాత 1995లో, 2010లో, 2013లో ఈ చట్టానికి సవరణలు చేశారు. అయినా నిరాశే మిగిలింది. ఇప్పుడు తాజాగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై కన్నేసి చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది.



> బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. ప్రతిపాదిత చట్టం ప్రకారం ముస్లిమేతరులు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి అర్హులు కానప్పుడు వారు బోర్డు ఎక్జిక్యూటివ్‌లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్నదానికి సమాధానం లేదు.

ఎలాగైనా వక్ఫ్ ఆస్తుల్ని ముస్లింల దగ్గరి నుంచి లాగేసుకుని, ఇప్పటికే తమ అస్మదీయుల కబ్జాల్లో ఉన్న వేలకోట్ల ఆస్తుల్ని క్రమబద్ధీకరించుకోవాలన్నది మోదీ–షా అండ్ కో దుష్టపన్నాగం. అందుకే ఈ కొత్త బిల్లులో సుమారు నలభై సవరణలు ప్రతిపాదిస్తూ ముస్లింల సంక్షేమం కోసమే ఈ బిల్లు తెస్తున్నామని ఎప్పటిలాగే కపట ప్రేమ ఒలకబోస్తున్నారు. బిల్లును గనక నిశితంగా పరిశీలిస్తే మోదీ ప్రభుత్వ దురుద్దేశం స్పష్టంగా అర్థమవుతుంది.

సరాసరి ముస్లింల ధర్మంలో, వారి వ్యక్తిగత విషయాల్లో వేలుపెట్టడం, ధర్మపరంగా వారికున్నటువంటి ప్రత్యేకతను దెబ్బతీయడం ఈ సవరణల లక్ష్యంగా కనబడుతోంది. బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. ప్రతిపాదిత చట్టం ప్రకారం ముస్లిమేతరులు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి అర్హులు కానప్పుడు వారు బోర్డు ఎక్జిక్యూటివ్‌లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్నదానికి సమాధానం లేదు. అంటే చట్ట సవరణ ద్వారా సంఘీయులను బోర్డులోకి పంపి వక్ఫ్ ఆస్తుల్ని క్రమక్రమంగా కాజేయడం అసలు ఉద్దేశ్యం. ఈ సవరణల్లో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే– ఏ ఉద్దేశ్యం కోసం ముస్లింలు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేశారో, అది కాకుండా ప్రభుత్వం తన ఇష్టం వచ్చిన పద్దుల్లో వెచ్చిస్తుందట. ఇది వక్ఫ్ మూల సూత్రానికే వ్యతిరేకం. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే, ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని ఐదేళ్ళుగా ఆచరిస్తున్నారో వారే వక్ఫ్ చేయడానికి అర్హులట. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి ఐదేళ్ళు పూర్తికానివారు తమ ఆస్తుల్ని దానం చేస్తామంటే ఈ కొత్త చట్టం ఒప్పుకోదు. ఇది కూడా వక్ఫ్ సూత్రానికి, స్ఫూర్తికి వ్యతిరేకమే. ఎందుకంటే ఇస్లాం ప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ చేయడానికి అర్హులే. కాని ఇదేమి చట్టమో ముస్లిం అయి ఉండి కూడా వక్ఫ్ చేస్తానంటే ఈ చట్టం ఒప్పుకోవడంలేదు. నిజానికిది ఒక ముస్లింను తన ధర్మపరమైన ఆరాధన చేయవద్దని అడ్డుకోవడమే. భారత రాజ్యాంగంలోని 25వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తీ స్వేచ్ఛగా నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును కలిగి ఉన్నాడు. ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి ఒక్కరూ తమ మతం శాఖలను, ధార్మిక కార్యకలాపాల కోసం సంస్థలను స్థాపించుకొని, వాటిని నిర్వహించుకొనే హక్కునూ కలిగి ఉన్నారు. రాజ్యాంగ ప్రసాదితమైన ఈ హక్కును కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు. అలాగే ఈ సవరణ బిల్లులో మరో దుర్మార్గం– వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏదైనా వివాదం తలెత్తితే నిర్ణయాధికారం జిల్లా కలెక్టర్లకు దఖలుపరచడం. ప్రస్తుతమైతే వివాద పరిష్కారానికి హైకోర్టు న్యాయమూర్తి నియమించిన వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. దీన్ని కాదని కలెక్టర్లకు నిర్ణయాధికారం కట్టబెడితే వాళ్ళు పాలకులకే వత్తాసు పలికే అవకాశాలు ఎక్కువ. మసీదు, మదర్సా, దర్గా, ఈద్గా తదితరాల విషయంలో ఏ చిన్న సమస్య తలెత్తినా దాన్ని ప్రభుత్వ ఆస్తిగా కలెక్టర్లతో రాయించేసుకోవడం ప్రభుత్వాధినేతలకు పెద్ద లెక్క కాదు. ఈ విధంగా కూడా కేంద్ర సర్కారు ముస్లింల ఆస్తుల్ని కొల్లగొట్టాలని చూస్తోంది. మరో కుట్ర ఏమిటంటే, కొత్త బిల్లు ప్రకారం వక్ఫ్ భూమిని ఆక్రమించుకుని పన్నెండేళ్లుగా అనుభవిస్తున్న వ్యక్తులు ఈ సవరణల పుణ్యమా అని ఆ భూమికి యజమానులుగా మారిపోతారు. కాబట్టి వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించడమంటే, నిస్సందేహంగా ముస్లింల విలువైన ఆస్తుల్ని తేరగా కొల్లగొట్టడమే. దాతృత్వం అనే భావనను నిర్వీర్యం చేసి ఆక్రమణదారులను, కబ్జాకోరులను ఆస్తులకు యజమానులుగా మార్చాలనుకుంటున్న ఈ దుర్మార్గపు బిల్లును ప్రతిపక్షాలే గాక, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కూడా వ్యతిరేకించి బిల్లు ఆమోదం పొందకుండా చూడాలి.

• యండి. ఉస్మాన్‌ఖాన్
జర్నలిస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ | editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

మన నడతను బట్టే రాజ్యాంగం మంచిచెడ్డలు!

1949లో ఇదే రోజు రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా ప్రతీ ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించుకోవడమే కాకుండా ఆ స్ఫూర్తితో దేశం ఏడు దశాబ్దాలుగా శక్తివంతంగా, పటిష్ఠమైన ముందడుగు వేయడం నాటి ప్రపంచ మేధావులెవరూ ఊహించలేనిది. ఇది రాజ్యాంగ నిర్మాతల గొప్పదనం. ఆ ప్రతి గొప్పతనం.

రాజ్యాంగానికి కేంద్ర బిందువు– వ్యక్తి, పౌరుడు. ప్రతీ పౌరుడూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆలంబనగా ఎదగాలని, ఆత్మగౌరవంతో జీవిస్తూ తామే పాలకులుగా దేశ సమగ్రత, ఔన్నత్యం సాధించాలన్నది మార్గదర్శనం. ఈ స్ఫూర్తి, అందులోని నైతికత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వాలకు పూర్తిగా అర్థం కావాలి. దాన్ని చైతన్యంతో ఆవాహన చేసుకున్నప్పుడే దేశం ప్రగతి సాధించగలదు. లేదంటే ఫలితం ఉండదు. అందుకనే అంబేడ్కర్ చెప్తారు, "రాజ్యాంగం ఎంత మంచిదైనా, చెడ్డవారి చేతిలో ఉంటే చెడ్డది అవుతుంది, అది చెడ్డదైనా మంచివారి చేతిలో ఉంటే మంచి చేస్తుంది" అని.

ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక అసమానతలు పెరుగుతూ వస్తున్నాయి. చాలా తక్కువ మంది చేతిలో సంపద కేంద్రీకృతమై, అధిక శాతం ప్రజలకు పేదరికమే దిక్కవుతున్నది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తికీ తలసరి ఆదాయానికీ పొంతన లేకుండా పోతున్నది. ఈ విధానాన్ని సరిదిద్ది అందరూ ఆర్థికంగా ఎదిగేలా చూడడమే రాజ్యాంగ స్ఫూర్తి. ప్రభుత్వపు విధి.

అలాగే ఒక్కో అధికరణ ఎందుకు ఉన్నది, దాన్ని ఎందుకు సవరణ చెయ్యాలి, ఎంత త్వరగా అది అమలు చేయాలి అన్నది కూడా ముఖ్యమే. ఉదాహరణకు స్థానిక సంస్థల్ని బలోపేతం చేయడానికి 73వ సవరణను పార్లమెంటు 1992లో చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్వయంపాలన దిశగా అడుగులు వేస్తూ అక్కడి ఆదివాసీలకు వనరులపై, వృద్ధిపై నిర్ణయాధికారం పెంచడానికి పీసా చట్టం వచ్చింది. అది 1996లో పార్లమెంటులో, 1998లో ఆంధ్రప్రదేశ్‌లో ఆమోదం పొందింది. అయితే అమలు చెయ్యడానికి నియమాల రూపకల్పన 2011 వరకూ జరగలేదు. అంటే ఒక మంచి చట్టం రూపొందడానికి, అది అమల్లోకి రావడానికి మధ్య 19 ఏళ్లు పట్టాయన్న మాట. ఒక తరం గడిచిపోయినట్టే. అందుకనే రాజ్యాంగం ఒక పుస్తకంగా ఉండడం వేరు, అది పాటించే నిష్ఠ ఉండడం వేరు. అలా పాటింపబడాలంటే అందుకు ప్రజా చైతన్యం అవసరం.

– డి.వి.జి. శంకరరావు

ప్రజాస్వామ్య భారతానికి అండ మన రాజ్యాంగం

"రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం మాత్రమే కాదు, ఇది జీవన వాహనం. దాని ఆత్మ నిత్యం యుగస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది" అన్న అంబేడ్కర్ మాటలు చెరగని సత్యాలు. మన రాజ్యాంగ నిర్మాతలు వ్యక్తి ఆధారిత వికాసాన్ని ఆశిస్తూ దేశానికి ఆచరణీయ పాలనా నమూనాను రూపొందించారు. గత ఏడున్నర దశాబ్దాలుగా దేశానికి దిక్సూచిగా పనిచేస్తున్న రాజ్యాంగ అమలును పరిశీలిస్తే దీని నిర్మాతల దార్శనికత దేశ ప్రజలకు తెలుస్తుంది.

12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలనలోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన మన రాజ్యాంగం పురాతన భారతీయ సంప్రదాయాల మీద నిర్మితమైనది. నాలుగు వేల సంవత్సరాల చరిత్రలో ఈ దేశ ప్రజల అనుభవాలు రాజ్యాంగంలో నిక్షేపితమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక రాజ్యాంగాలు చాలా విఫలమయ్యాయి. కాని భారత రాజ్యాంగం అలా కాకుండా నిలిచి వెలుగుతున్నది.

ప్రతి భారతీయ పౌరుడూ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వేచ్ఛగా తన భావాలను, అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారంటే అది భారత రాజ్యాంగం సాధించిన గొప్ప విజయమనే చెప్పాలి. అధికరణ 19(1)ఎ భారతీయ పౌరుల్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెర్సస్ రాజ్ నారాయణ్‌కి సంబంధించిన కేసులో ప్రతి భారతీయ పౌరుడూ సమాచారాన్ని స్వీకరించడంతో పాటు వ్యాప్తి చేసే హక్కును కలిగివున్నాడని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. భిన్నత్వంలో ఏకత్వం, లౌకికవాదం, మత సహనం, అందరికీ సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల కోసం ప్రత్యేక చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలు భారత రాజ్యాంగం ప్రసాదించింది. రాజ్యాంగ రచనలో కార్యదక్షత వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని ఆకాంక్షించారు. సమ ప్రజాస్వామ్య పద్ధతుల్ని రాజ్యాంగ పరిషత్తు తీసుకొచ్చింది. వ్యత్యాసం లేని ప్రజాస్వామ్యాన్ని తీర్మానించింది. పరిపూర్ణ ప్రజాస్వామ్యానికి రాజ్యంగ రచయితలు పునాదులు వేశారు.

ప్రజల ఆర్థిక, సాంఘిక జీవితంలో విప్లవాత్మక మార్పులను రక్తపాతం లేకుండా తీసుకొచ్చే ప్రక్రియే ప్రజాస్వామ్యం అని ఈ సందర్భంలోనే డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఇటువంటి రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాలు రక్తమాంసాల పాత్ర పోషిస్తాయని వివరించారు. కులం ద్వారా వచ్చిన వెనుకబాటుతనంతో ఉత్పత్తి కులాలు అణచివేతకు గురయ్యాయని, వీటిని అధిగమించాలంటే ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థే దివ్యౌషధమనీ ఆయన అన్నారు. ఎటువంటి వాదప్రతివాదాలూ లేకుండానే పరిషత్ దీనిని ఆమోదించింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాల ప్రజల మధ్య ఐక్యతను సాధించేందుకు వివిధ సంక్షేమ విధానాలు రూపొందాయి. సహృదయ భావజాలాన్ని పెంపొందించే నిర్ణయాలు కూడా జరిగాయి. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షునిగా డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రజాస్వామ్య మూలాలు భారతీయుల వారసత్వ సంపద అన్నారు. జె.ఎస్.మిల్, హెరాల్డ్ లాస్కీ, మెకావర్ చెప్పిన పాశ్చాత్య ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదని అంబేడ్కర్ పేర్కొన్నారు. భారతదేశ సామాజిక చట్రం అందుకు భిన్నంగా ఉందన్నారు.

> 12 భాగాలు, 395 అధికరణలు, దేశకాలానుగుణంగా కొత్త విషయాల్ని జోడించిన 106 సవరణలతో కూడిన రాజ్యాంగం సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లేందుకు ప్రధాన భూమికను వహిస్తోంది. స్వాతంత్ర్యోద్యమ ఫలితంగా సాధించిన స్వయం పాలన లోంచి, స్వేచ్ఛావాయువుల్లోంచి ప్రజలే మన రాజ్యాంగాన్ని రాసుకున్నారు.



వివిధ కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ప్రాంతాలుగా, భాషలుగా, సంస్కృతులుగా విభజన చెందిన ఈ సమాజం, 'ఏకతా' భావనకు చేరుకోవడానికి అవసరమైన మానసిక పరివర్తనను పెంపొందించే రాజకీయవ్యవస్థ అవసరాన్ని రాజ్యాంగ పరిషత్ తెరమీదికి తీసుకొచ్చింది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులకు అవకాశం వుండాలని సభ్యులు కోరుకున్నారు. ఇది సమాజ ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఉండాలి. రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు నిర్లక్ష్యానికి గురికాకూడదు. దీనిని విస్మరించి పాలకులు స్వప్రయోజనాల కోసమే పనిచేస్తే, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కుంటుబడుతుంది. ఇక్కడే ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడతాయి. అందుకే రచనాసంఘం ప్రజాస్వామ్యమంటే కేవలం ప్రభుత్వ ఏర్పాటు ఒకటే కాదని వివరణ ఇచ్చింది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగినప్పుడే ఓటుహక్కు విలువ తెలుస్తుందని రాజ్యాంగ పరిషత్తు భావించింది. రాజకీయ పార్టీల లక్ష్యాలు, వారి కార్యాచరణను ప్రజలు అంచనా వేయగలగాలనేది వారి ఉద్దేశం. అప్పుడే పారదర్శకంగా ఓటుహక్కు వినియోగించుకోగలుగుతారన్నారు. రాజ్యం – కులం – మత వ్యవస్థల ఉనికి, స్వరూపస్వభావాలు మనిషిని ఏ రకంగా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకున్నప్పుడే సంపూర్ణ ప్రజాస్వామ్యం మనగలుగుతుందని రచనా సంఘం పేర్కొంది. అందుకే "ఒకవ్యక్తి – ఒకే ఓటు, ఒక ఓటు – ఒకే విలువ" అనే సూత్రానికి అవిశ్రాంతంగా కృషి జరిగింది. ఇది ఆచరణలోకి వచ్చే వరకు డాక్టర్ అంబేడ్కర్ చాలా కృషి చేశారు.

రచనా సంఘం మూడు రకాల ప్రజాస్వామ్యం గురించి చర్చించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సిద్ధాంత ప్రాతిపదికగా కలిగిన జీవనవిధానం సామాజిక ప్రజాస్వామ్యం. ప్రజల మధ్య ధనిక, పేద వ్యత్యాసాలు తగ్గిపోయి సామాజిక సహజీవనానికి బాటలు వేసేది ఆర్థిక ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ ఆర్థిక విధానం కొన్ని సందర్భాల్లో ప్రజాస్వామ్య లక్ష్యాలకు అడ్డంకిగా నిలుస్తుందన్నారు. ఈ విధానంలో వ్యక్తి స్వేచ్ఛ, ఇతర హక్కులకు సైతం రక్షణ కొరవడుతుంది. అందుకే శ్రేయోరాజ్యాన్ని ప్రతిపాదించారు. రాజ్యాంగంలో సంక్షేమ రాజ్యస్థాపనకు తగిన ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగం ద్వారా బలహీనవర్గాలు జీవనోపాధి పొందే విధంగా వీటిని రూపొందించారు. సామాజిక వనరుల మీద యాజమాన్య నియంత్రణ ప్రజలకే వుండాలని పరిషత్ ఆకాంక్షించింది. సంపద, ఉత్పత్తికారకాలు ఏ కొద్దిమంది చేతుల్లోనో కేంద్రీకృతం కాకూడదని, బలహీనవర్గాల విద్య, ఉపాధి ఆర్థిక విషయాలను రాజ్యమే పరిరక్షించాలని ఆశించారు. ఆదేశిక సూత్రాల అమలు ద్వారా ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని, ఇటువంటి కార్యాచరణ సాధ్యం కావాలంటే ప్రభుత్వమే ఈ బాధ్యత వహించాలనేది రచనా సంఘం తరుపున అంబేడ్కర్ సూచించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పనితీరు బాగుంటేనే అది వర్ధిల్లుతుంది. దీనికి ప్రధానంగా రెండు విషయాలు మూలస్తంభాలుగా నిలవాలి. ఒకటి సమర్థవంతమైన పాత్ర పోషించగల ప్రతిపక్షం, రెండు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోగల పరిస్థితులు. ఇవి ఉన్నప్పుడే అణగారిన ప్రజానీకం విముక్తి సుసాధ్యమవుతుంది.

ప్రజాస్వామ్యం అంతరించిపోతే ప్రజల ఆకాంక్షలు నీరుగారిపోతాయన్నది రచనా సంఘం హెచ్చరిక. రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన పాలనతోనే రాజ్యాంగం మనగలుగుతుంది. ఈ సందర్భంలోనే దేశీయ రాజనీతి సిద్ధాంతకర్తలు నాడు రాజ్యాంగాన్ని కొనియాడారు. సమైక్య జీవన వేదంగా ఈ ముసాయిదా సాక్షాత్కరిస్తుందన్నారు. అంఖండ భారతాన్ని నిర్మించి పటిష్టపరిచిన రాజ్యాంగం ఆమోదం పొందిన రోజుని ఉత్సవంగా జరుపుకుందాం.

▪ డా. జీకేడీ ప్రసాద్

(నేడు భారత రాజ్యాంగ అమృతోత్సవం)



గిరిజన బిడ్డలకు అండగా..
అందరూ కదలాలి..



మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై మధుసూదనాచారి, ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు



మానుకోట మహాధర్నా కార్యక్రమానికి హాజరైన జనం

- ఎక్కడ అన్యాయం జరిగితే బీఆర్ఎస్ అక్కడ ఉంటుంది
- కాంగ్రెస్‌కు భయపడేది లేదు.. ఆ పార్టీని కూకటివేళ్లతో పెకిలిస్తాం
- మానుకోట నుంచే మొదటి అడుగు పడింది
- మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబాబాద్ / మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిబిడ్డలకు అండగా అందరూ కదలాలని, రాష్ట్రంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ అక్కడ ఉంటుందని, అందుకు మానుకోట నుంచే మొదటి అడుగు పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. సీఎం సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని లగచర్లలో గిరిజనులపై అక్రమ కేసులు, అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి చేపట్టిన మహాధర్నా మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. ఈ ధర్నాకు హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ గతంలో గిరిజనులు చేసిన డిమాండ్ మేరకు కేసీఆర్ ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లు 10 శాతానికి పెంచారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారని, పోడు భూములకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. అయినా కొన్ని మాయమాటల కారణంగా మోసపోయామని, రేవంత్‌రెడ్డి గిరిజన భూములు గుంజుకుంటున్నారని, అలాంటి వారిని ఒక్క మానుకోటలోనే కాదు.. ఊరూరా ఉరికించి కొట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. మానుకోటలో కదం తొక్కి తమకు శక్తినిచ్చిన అందరినీ జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని, బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితియే కాదని, బంజారా రాష్ట్ర సమితి కూడా అని పేర్కొన్నా రు. బంజారాలకు ఏ కష్టం వచ్చినా... అండగా ఉంటామంటూ కేటీఆర్ వారికి భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టేందుకు మానుకోట నుంచే మొదటి అడుగు పడిందని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రమంతా తిరిగి కాంగ్రెస్ పార్టీని, సీఎంను కూకటి వేళ్లతో పెకిలిస్తామన్నారు. 14ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో కీలకమైన మలుపునకు నాంది పలికిందని, మళ్లీ అదే మానుకోట కొత్త నియంతకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమైందన్నారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి ప్రధాని మోదీ లాంటి వ్యక్తినే నల్లచట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని, రైతుల పోరంటే అదేనని, అలాంటి రైతులతో రేవంత్‌రెడ్డి పెట్టుకున్నారని, సన్నకారు.. బక్కచిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ సీఎం రేవంత్‌రెడ్డికి తప్పకుండా

మిగతా 8వ పేజీలో...

గులాబీ స్కెచ్ సక్సెస్!

- మానుకోట మహాధర్నాకు భారీగా తరలొచ్చిన శ్రేణులు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి రాక
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- ప్రసంగంలో మానుకోట ప్రాధాన్యాన్ని గుర్తుచేసిన కేటీఆర్

8

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అభ్యర్థించే ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల వరంగల్ నగరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి సభ సక్సెస్‌కు కారణమైన సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నట్టు చెప్పారు. సమగ్ర సర్వేకు సంబంధించిన సమాచార నమోదుకు ఆపరేటర్లను అందుబాటులో ఉండేలా చూడాలని ఆదనపు కమిషనర్ జోనాను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 88 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో బొమ్మన డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం పాల్గొన్నారు.

ఇంజనీరింగ్-21, హెల్త్, శానిటేషన్ - 12, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 9, టౌన్‌ప్లానింగ్ - 42, తాగునీటి సరఫరా - 3, హార్టీకల్చర్- 1 ఇలా మొత్తం 88 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

- గ్రేటర్ వరంగల్ గవిచర్లకు వెళ్లే మార్గంలోని మొదటి గల్లీలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం రోడ్డును పగులగొట్టి పనులు పూర్తయినా గుంతను పడ్చడం లేదని కాలనీకి చెందిన ప్రజలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ కీర్తినగర్‌లో నెల రోజులుగా మునిసిపాలిటీ నుంచి వచ్చే నల్లా నీరు రెండు రోజులకు ఒక మారు వస్తుంది. కనీసం పది నిమిషాలు కూడా నీరు రావడం లేదని అది కూడా మురుగు నీరు వస్తున్నామని స్థానిక ప్రజలు కమిషనర్‌కు తెలిపారు.
- నగరంలోని 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో సుమారు వంద ఇళ్ల నుంచి వెలువడే మంచి మురుగు నీరు రోడ్లమీదకు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో కాల్వలు నిర్మించక పోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ కిషన్‌పురలోని ఓ స్వీట్‌హౌస్ నుంచి వెలువడే వేస్టేజీని తమ ఇంటి ముందు వదిలేస్తున్నారని, గతంలో స్వీట్ షాపు యజమానులకు ఎన్ని సార్లు చెప్పినా వినిపించుకోవడం లేదని కముదిన్‌సింగ్ అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఉపకారమేది?

- పెండింగ్‌లో 23 వేల దరఖాస్తులు
- రెండేళ్లుగా రాని నిధులు
- చదువులు కొనసాగించడంలో ఆటంకాలు



హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అల్పసంఖ్యాక వర్గాల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా విద్య ద్వారా వారి ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. సంక్షేమ పథకాల సంగతి అటుంచితే కనీసం మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలను కూడా ఇవ్వడం లేదు. దీంతో మూడేళ్లుగా విద్యార్థులు చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు మైనారిటీలకు స్కాలర్‌షిప్స్ పథకం అమల్లో ఉందా? లేదా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవలసిందిగా చేసిన ప్రకటనలతో ఆశగా దరఖాస్తులు చేసుకున్న మైనారిటీ విద్యార్థులకు ఏళ్ల తరబడి ఎదురుచూపు తప్పా నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థుల నిరాశకు గురవుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అసలే మైనారిటీ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉంటాయి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. అయినా తమ పిల్లలను చదివించి వారిని ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులు తపిస్తూ ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కొద్ది పాటి ఉపకారవేతనాలు ఎంతో కొంత తోడ్పాటుగా ఉండకపోతాయా అని ఆశించినా ఫలితం లేకుండా పోతోంది.

ఉమ్మడి జిల్లాలో 4.49లక్షల మంది మైనారిటీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4.49 లక్షల మంది మైనారిటీలున్నారు ముస్లిం, క్రిస్టియన్, జైన, బౌద్ధ, సిక్కు, జోరాష్ట్రియన్ వర్గాలకు చెందిన వారు మైనారిటీల కిందకు వస్తారు. ఉమ్మడి జిల్లాలో ముస్లిం, క్రిష్టియన్ వర్గాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో వీరు ఎక్కువగా ఉన్నారు. మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు మొదట్లో ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్పుల ద్వారా కాస్తంతైనా ఆర్థిక సాయం అందేది. 2021-22 సంవత్సరం తర్వాత నుంచి అసలు స్కాలర్‌షిప్పులు రావడమే ఆగిపోయింది.

మొండిచేయి..

కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిది తరగతుల మైనారిటీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ను రద్దు చేసింది. దీనిపై ప్రతిపక్షాలు గతంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. కాగా 9,10 తరగతి విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా చట్టం ప్రకారం ఉచిత నిర్బంధ విద్యను అందిస్తున్నప్పుడు స్కాలర్‌షిప్‌లు అవసరం లేదన్నది ప్రభుత్వ వాదన. దీంతో 1 నుంచి 8వ తరగతి మైనారిటీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఎలాగో అందకుండా పోయాయి. కనీసం 9,10, ఇంటర్, డీగ్రీ, పీజీ విద్యార్థులకైన ప్రీ, పోస్టు, మెరిట్ కం మీన్స్ ఉపకారవేతనాలనైనా అందించకపోవడంతో విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్..

ఈ పథకం ద్వారా 9, 10తరగతి చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులు. తల్లి దండ్రుల లేదా సంరక్షకుల వార్షికాదాయం రూ.లక్ష మించరాదు. ఈ స్కారల్‌షిప్ కింద ఏడాదికి రూ.5వేలు మంజూరు అవుతాయి. 2021-22 సంవత్సరంలో 33,876మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా

మిగతా 6వ పేజీలో...

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర మానవాభివృద్ధి వనరుల సంస్థ అధికారులు సోమవారం జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిసెంబరు 3వరకు పర్యటన

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన మంగళవారం ప్రారంభమై డిసెంబరు 3 వరకు కొనసాగనుంది. బసంత్‌నాథ్ సైన్, పంకజ్ కుమార్ ఝా, సీమ అగర్వాల్, రమేష్ దేశ్వాల్, రంజిత్ కుమార్ సింగ్, అంకిత వర్షిణి, సుధీర్ యాదవ్, అనామిక గుప్తలతో కూడిన 8 మంది సభ్యులు ధర్మసాగర్, తాటికాయల, పెద్దపెండ్యాల, ఆత్మకూరు, కామారం, పెంచికలపేట గ్రామాలను సందర్శించనున్నారు.

వీటితో పాటు పరకాల మునిసిపాలిటీని సందర్శించి క్షేత్రస్థాయిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల తీరుతెన్నులను పరిశీలిస్తారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు, కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాల బలోపేతానికి చేపడుతున్న చర్యలు, జాతీయ భద్రత మిషన్ ద్వారా అమలు అవుతున్న వైద్య సేవలను పరిశీలిస్తారు.

పదేళ్లలో మీరిచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు?

11 నెలల్లో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కమలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీలు పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. కమలాపూర్ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తౌటం ఝాన్సీ రాణి రవీందర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే వైస్ చైర్మన్‌గా దేశిని ఐలయ్యగౌడ్, పాలక వర్గ సభ్యులుగా ఓర్సు తిరుపతి, ఆకినపల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి వంటకాల అనిల్‌రెడ్డి, సముద్రాల కృష్ణ, శ్రీనివాస్, నిగ్గుల లింగయ్య, ఎండి యాకూబ్ అలీ, జనగాని శివకృష్ణగౌడ్, గట్టు శ్రీధర్‌గౌడ్, కెత్తే విజేందర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారపడకుండా రికార్డు స్థాయిలో ధాన్యం పండించుకోవడం జరిగిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు. రుణ మాఫీ కాని రైతులకు రుణ మాఫీ చేస్తామన్నారు. రెండు లక్షలకు పైన రుణాలు ఉన్న వారు మిగితావి చెల్లించుకుంటే రెండు లక్షలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

రైతుల సమస్యలు ఏమి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందిని హుజురాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. హుజురాబాద్ నియోజక వర్గ పరిధిలోని రైతులకు అండగా ఉంటానని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన నేరుగా తనను కలువాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రైతులకు అండగా ఉండకుండా దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బంక సరళ, డీఎంఈవో అనురాధ, టీపీసీసీ సభ్యులు అశోక్‌రెడ్డి, తౌవుటం రవిందర్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- తేడాలు వస్తే చర్యలు తీసుకుంటాం
- అధికారులతో సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రతీ రోజు నాణ్యమైన, మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులతో పాటు వివిధ రెసిడెన్షియల్ సంస్థల అధికారులు, నిత్యావసరాలను సరఫరా చేసే సప్లయర్‌లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జిల్లాలోని వెనుకబడిన తరగతులు, సాంఘీక, సంక్షేమ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు అందించే భోజనం అమలు తీరు, ఫుడ్‌సేఫ్టీపై రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులతో పాటు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న సరఫరాదారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థలకు వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాలు ఏ విధంగా, ఎలాంటి ఆహార పదార్థాల సరఫరా, విద్యార్థులకు అందిస్తున్న విధానం గురించి సంబంధిత రెసిడెన్షియల్ గురుకులాల అధికారులను, ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న సరఫరాదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యత పరంగా బాగా లేనట్లయితే తిరిగి పంపించాలని, కూరగాయలు తాజాగా ఉండేటట్లు చూసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. విద్యార్థులకు అందించే భోజన విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, భోజన విషయంలో ఎలాంటి తేడాలు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆయా విద్యాసంస్థలకు సరఫరా చేసే వెజ్, నాన్‌వెజ్ నాణ్యత ప్రమాణాలతో ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకున్నా, సరైన ఆహార, వస్తు పదార్థాలను అందించకున్నా సంబంధిత సరఫరాదారులకు ముందుగా నోటీసులు ఇవ్వాలని, వారి పని తీరు బాగా లేకుంటే చర్యలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అధికారులు నిరంతరం తనిఖీ చేయాలి

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ఇతర విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే భోజనాన్ని ఇటీవల జిల్లా అధికారులు పరిశీలించిన నేపథ్యంలో వారు పరిశీలించిన వివరాలను కలెక్టర్ ప్రావీణ్యకు వివరించారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారంగా ఏ విధంగా అందించవచ్చు అనే అంశాలపై కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వంట చేసే ప్రదేశం, ఆహార పదార్థాల నిల్వ, వంట పాత్రల పరిశుభ్రత, భోజనం అందించే విధానం, తాగునీరు, తదితర అంశాలను వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు నిరంతరం తనిఖీ, పరిశీలన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వైవి గణేష్, ఆర్డీవోలు, డీఈవో, జడ్పీ సీఈవోతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ విద్యా సంస్థల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వంటల పోటీల్లో హనుమకొండకు ప్రథమ స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నిర్వహించిన వంటల పోటీల్లో హనుమకొండ జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. సోమవారం హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హనుమకొండ మండలానికి ప్రథమ స్థానం, ధర్మసాగర్ మండలానికి ద్వితీయ స్థానం, ఎల్కతుర్తి మండలానికి తృతీయ స్థానం దక్కింది. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా బి. సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ అనూష, జీవీ. రామారావు, ఎఫ్ఏవో మధుసూదన్, డీసీఈబీ సెక్రెటరీ, ఎంఈవో డాక్టర్ బి. రాంధన్, ఎంఈవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ శైలజ, సెక్షన్ ఇంచార్జి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంలు, ఈసీఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్‌ఆర్డీ ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా యథావిధిగా రెగ్యూలర్ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నేత, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు వరంగల్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ ఏఎన్ఎంలు 24 సంవత్సరాల నుంచి రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేసినా ప్రభుత్వం నేటికి రెగ్యులర్ చేయకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సంఘాల నాయకులు జే.సుధాకర్, సుజాత, సరోజ, చంద్రకళ, ప్రభావతి, సాంబలక్ష్మీ, మంజుల, పుష్పలత, విజయ పాల్గొన్నారు.

చీరలు కట్టుకుని దివ్యాంగుల వినూత్న నిరసన

బస్సుల్లో తమకు కేటాయించిన సీట్లలో మహిళలు కూర్చోవడంపై నిరసన



చీరలు కట్టుకుని బస్టాండ్‌లో దివ్యాంగుల నిరసన

వర్ధన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో తమకు కేటాయించిన సీట్లలో తమను కూర్చోనివ్వడం లేదని దివ్యాంగులకు చీరలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల దివ్యాంగులకు కేటాయించిన సీట్లను వారే ఆక్రమించుకుని ప్రశ్నిస్తే తమపైనే దూషణలు, దాడులకు దిగడాన్ని నిరసిస్తూ దివ్యాంగులైన పురుషులు చీరలుకట్టుకుని నిరసన తెలిపారు. సోమవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులు, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య, బాబు, మండల అధ్యక్షుడు జెట్టబోయిన శ్రీనివాస్, గుడిపల్లి సుమతి, ఇస్లావత్ బాలకృష్ణ చీరలు కట్టుకుని ఆర్టీసీ బస్సు ఎక్కి ఆధార్‌కార్డులు చూపించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం వల్ల బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో ఇతరులు కూర్చుంటున్నారని ప్రతీ బస్సులో అదనంగా మరో రెండుసీట్లు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు.

ఖోఖో పోటీల్లో వరంగల్ జట్టుకు కాంస్య పతకం

శంభునిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఓరుగల్లు క్రీడాకారులు రాణించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో ఆదిలాబాద్, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి జట్లు నిలిచాయి. మెదక్ జట్టుపై వరంగల్ జట్టు 9-16 పాయింట్ల తేడాతో గెలుపొంది తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. కోచ్‌గా వ్యవహరించిన ఫిజికల్ డైరెక్టర్ నారాయణ కీలక పాత్ర పోషించారు.

ముడుపులిస్తేనే చెక్కులు పాస్ చేస్తాం!

బల్దియాలో అకౌంట్స్ విభాగం అధికారుల తీరే వేరు
లక్షకు రూ. 5 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్
లబోదిబోమంటున్న చోటా కాంట్రాక్టర్లు



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. అప్పో సప్పో చేసి పనులు పూర్తి చేయడం ఒక ఎత్తైతే బిల్లులు చేజిక్కించుకోవడం మరో ఎత్తవుతుందని వాపోతున్నారు. కొందరు కాంట్రాక్టర్లు రూ.3 వడ్డీకి అప్పు తెచ్చి నిజాయితీగా చేసిన పనులకు కూడా చివరికి అధికారులకు పర్సంటేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఇలా రెండు రెం డు, మూడు సంవత్సరాలుగా బిల్లులు రాలేదని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా విడుదలైన బడ్జెట్ నుం చైనా బిల్లులు వస్తాయని ఆశపడితే బల్దియా అధికారులు చివరికి లంచం కావాలని డి మాండ్ చేస్తూ కొర్రీలు పెడుతుండటంతో మనోవేదన చెందుతున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో బడ్జెట్ ఘనం ఇచ్చింది తృణం శీర్షికన కథనం ప్రచురితం కాగా.. స్పందించిన ప్రభుత్వం త్రైమాసిక నిధుల కింద వరంగల్ నగర పాలక సంస్థకు చేసిన పనులకు గాను బిల్లులు చెల్లించేందుకు రూ.187.42కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో చిన్నా, పెద్ద కాంట్రాక్టర్లు సంతోషపడ్డారు. కానీ అంతలోనే వారి ఆశలు ఆవిరైపోయాయి. రూ.5లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించాలనే ఆంక్షలు విధించారు. బల్దియా అకౌంట్ సెక్షన్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి డబ్బులు ఇస్తేనే గానీ బిల్లులు చెల్లించమని ససేమిరా అంటున్నట్టు కాంట్రాక్టర్లు ఆరోపించారు. ఒక లక్షకు రూ.5 వేలు ఇవ్వాలని ఇ చ్చే లంచంలో వాటాలుగా పంచాలని కాం ట్రాక్టర్లతో నిస్సిగ్గుగా చెప్పినట్టు తెలిపారు.

చెక్కులు సిద్ధమైనా ఇవ్వడంలో జాప్యం

రెండేళ్ల ముందు నుంచి ఇప్పటి వరకు వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలతో పాటు ఇతర అభివృద్ధి పనులు టెండరు ప్రకారం కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు. ఇప్పటి వరకు రూ.10లక్షలలోపు అభివృద్ధి పనులు చేసిన వారికి రూ.50కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉం ది. ఇటీవల బడ్జెట్ విడుదల కావడంతో కాంట్రాక్టర్లు అకౌంట్స్ విభాగం అధికారులను కలిసి గోడు వెలిబుచ్చారు. వారం రోజు క్రితమే చెక్కులు సిద్ధమయ్యాయని కమిషనర్ సంతకం చేయడం లేదని సదరు మహిళా అధికారి చెప్పి చేతులు దులుపుకొన్నారని తెలిపారు.ఎంతకూ చెక్కులు ఇవ్వక పోవడంతో ఇద్దరు సీనియర్ కాంట్రాక్టర్లు రంగంలోకి దిగి చెక్కులు పాస్ కావాలంటే రూ.1లక్షకు రూ.5 వేలు లంచం ఇవ్వాలని, మధ్యవర్తులుగా చెబుతున్నామని చిన్న కాంట్రాక్టర్లతో చెప్పినట్టు తెలిపారు. ఇక విసిగిపోయిన తాము ఏసీబీని ఆశ్రయించాలనుకుంటున్నామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 156 మంది ఫిర్యాదుదారులు ఆవేదన చెప్పు కుని సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్యను వేడుకున్నారు. ఫిర్యాదు దారుల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారును పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన సమస్యలపై కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను అధికారులు సీరియ స్‌గా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో జి ల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జి ల్లా రెవెన్యూ అధి కారి వై.వి గణేష్ పాల్గొన్నారు.

● కడిపికొండ రైల్వే బ్రిడ్జి రోడ్‌లో భూమి కోల్పోయిన రైతులకు డబ్బులు మంజూరు అయ్యా యని, అయినా ప్రభుత్వాలు 20 ఏళ్ల నుంచి ఇవ్వడం రైతులు ఫిర్యాదు చేశారు.

● జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయ కులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.



బాధితుల నుంచి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

● రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే సంబంధిత అధికారులకు సర్క్యూలర్ జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి డీబీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి పెట్టండి

అధికారులకు వరంగల్ కలెక్టర్ సత్య శారద ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. ఇంతకుమందు వచ్చిన వినతులు మళ్లీ రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 107 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 43, కలెక్టరేట్ 10, డీఆర్‌డీవో 12, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 9, డీఎంహెచ్‌ఓ 6, జిల్లా విద్యాశాఖ 3, జిల్లా సంక్షేమ శాఖ 1, ఇరిగేషన్ 5, వ్యవసాయశాఖ 4, జడ్పీ సీఈవో 2, జీడబ్ల్యూఎంసీ 6, రీజినల్ కో ఆర్డినేటర్ 2, జిల్లా ఉపాధి కల్పన శాఖ 3, సివిల్ సప్లయ్ 2, పంచాయతీ శాఖ 2, ఎస్సీ కార్పొరేషన్ 4, దేవాదాయశాఖ 1, లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు 1 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, వర్ధన్న పేట

వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామం నుంచి డీసీ తండాకు వెళ్లే రోడ్డును ల్యాబర్తి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్‌రావు ఆక్రమించాడు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. డీసీ తండా మీదుగా రాయపర్తి గ్రామానికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా రోడ్డును ఆక్రమించిన ప్రభాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలి.

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు సహకరించాలి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విషయంలో రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ సత్యశారద కోరారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం నాణ్యత పరిశీలించిన తర్వాత దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, పౌరసరఫరాల జి ల్లా మేనేజర్ బి.సంధ్యారాణి, డీసీవో నీరజ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్‌కు చెందిన ఎనమిది మంది అధికారులు సోమవారం జిల్లాను సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అధ్యయనంతోపాటు చారిత్రక, సాంస్కృతిక పర్యాటక ప్రాశస్త్యం కలిగిన వరంగల్ నగరం, నర్సంపేట ఇకో టూరిజంను వారు పరిశీలించారు. అనంతరం వారు కలెక్టర్ సత్యశారదతో సమావేశమయ్యారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ తదితర శాఖలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు.

ప్రొఫెసర్ సాయిబాబా అమరత్వం తీరని లోటు

సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

వరంగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రొఫెసర్ సాయిబాబా అమరత్వం ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ పీడిత ప్రజలు, సామాజిక సముదాయలు, పీడిత జాతులు ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడే ఒక గొప్ప నాయకుడిని కోల్పోయాయన్నారు. ఆయన జీవితంలో 1990 నుంచి ప్రజాస్వామిక, విప్లవ, ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం తపించారని తెలిపారు. 90శాతం వికలాంగత ఉన్నా వ్యక్తిగత, ప్రజా ఉద్యమ జీవితంలో అది ఆటంకం కాలేదన్నారు. ఆయన మహోన్నత ఆశయాలు, పీడిత ప్రజల పట్ల, వారి అపార శక్తి పట్ల సాయిబాబాకు గల అచంచల విశ్వాసమే ఎన్ని నిర్బంధాలనైనా ఎదుర్కొనేలా చేసిందని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాలు, ఆదివాసీ ప్రజలు, ప్రజాసంఘాలు, వారికి నాయకత్వం వహించే మావోయిస్టు పార్టీపై నిర్మూలన యుద్ధం కొనసాగిస్తున్న స్థితిలో సాయిబాబా అమరత్వం తీరని లోటన్నారు. ఆయన చూపిన సాహసం, దృఢసంకల్పం, ప్రజల పట్ల అంకిత భావం, త్యాగనిరతి భవిష్యత్తులో ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రేరణనందిస్తాయని అన్నారు. సాయిబాబా ఆదర్శాల స్ఫూర్తితో ఉజ్వలబాటలో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాల్సిందిగా దేశంలోని నిజమైన విప్లవ, ప్రజాస్వామిక, లౌకిక, దేశభక్తయుత శక్తులకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిస్తుందని అభయ్ ఆ ప్రకటనలో తెలిపారు.

పీఎల్‌జీ వారోత్సవాలను విజయవంతం చేయండి:సీపీఐ (మావోయిస్టు)

డిసెంబరు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ (మావోయిస్టు) సెంట్రల్ మిలటరీ కమిషన్‌తో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. జనవరి నుంచి కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ దాడిని ప్రతిఘటించాలని, అసువులు బాసిన అమరుల త్యాగాలను ఎత్తిపట్టండని పిలుపునిచ్చారు. పీఎల్‌జీఏ యూనిట్లు ఉన్న చోట గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

గుప్తనిధుల నిందితుల అరెస్టు

హనుమకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల తవ్వకాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న 8 మంది ముఠా సభ్యులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి, రెండు కార్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సోమవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వెల్లడించారు. పద్మాక్షి కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు కార్లలో గుప్తనిధులు తవ్వకాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారని ఆదివారం పక్కా సమాచారం రాగా హనుమకొండ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కార్లలో ఉన్న 8 మందిని అదుపులోకి తీసుకొని విచారించగా భూపాలపల్లి జిల్లాలోని ఘనపూర్ సమీపంలోని ఓ పొలం లో గుప్తనిధుల తవ్వకాలకు వెళ్తున్నామని ఒప్పుకోవడం జరిగింది. న్యూశాయంపేట సర్కిల్‌లోని హనుమాన్‌టెంపుల్ పూజరి కత్రోజ్ అరవింద్ అలియాస్ అఘోరస్వామి గీసుకొండ మండలం గంగాదేవి పల్లికి చెందిన ముప్పారపు రవి, నర్సంపేటకు చెందిన వేముల శ్రీనువాస్, దాసరిపల్లికి చెందిన గొల్లెన సురేశ్, మహబూబాబాద్‌కు చెందిన బయ్య శివరాజన్, ఫాతిమానగర్ హనుమకొండ ప్రభాకర్, రఘునాథపల్లి మండలం మేకల గుట్టకు చెందిన ముక్క భాస్కర్, బోడుప్పల్ పీఎన్‌టీ కాలనీకి చెందిన బస్వరాజు రమేశ్‌లు ముఠాగా ఏర్పడి గతంలో న్యూశాయంపేట డబుల్ బెడ్ రూమ్ ఏరియా, మందారిపేట గుట్టలు, ధర్మసాగర్ దేవునూర్ వెళ్లే దారిలోని ఓ పొలంలో, హనుమకొండ పద్మాక్షీకాలనీలో ఓ పాత ఇంట్లో మెటల్ డిటెక్టర్, లోకేటర్‌తో చెక్‌చేసి తవ్వగా ఏలాంటి గుప్త నిధులు దొరకలేదని విచారణలో వెల్లడైందన్నారు. నిందితుల నుంచి కార్లతో పాటు సెల్‌ఫోన్‌లు, తవ్వకాలకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీఐ సతీష్, ఎస్సైలు ప్రశాంత్, అశోక్, పరుశురాములు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న కార్లు, సామగ్రితో ఏసీపీ, హనుమకొండ పోలీసులు

'ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలి'

కేయూ క్యాంపస్, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్ వైజ్ డిగ్రీ. పీజీ, న్యాయశాస్త్రంతో పాటు ఇతర వృత్తి విద్యకోర్సుల్లో ఒక్కోసబ్జెక్టు తప్పిన విద్యార్థులకు వెంటనే ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట పీడీఎస్‌యూ నేతృత్వంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని తన చాంబర్‌లో పీడీఎస్‌యూ ప్రతినిధి బృంద బాధ్యులు కలిసి పరీక్షలు వెంటనే నిర్వహించాలని వినతి పత్రాన్ని అందచేశారు.

రేపు పింగిళి కళాశాలలో మెగా జాబ్ మేళా

వడ్డెపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ (టీకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 27న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 14 కంటే ఎక్కువ ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు పాల్గొని జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హతలు కలిగి ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా కోసం రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ మెంటర్ మహ్మద్ రఫీ ఫోన్ నంబర్ : 98856 85383 లో సంప్రదించాలని ఆయన కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, నవంబరు 25 : అనారోగ్యంతో ఓ వ్యక్తి రైలు కిందపడి పడి ఆత్మహత్యకు పాల్గొన్నాడు. కాజీపేట రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేట మండలం కడిపికొండకు చెందిన ఎండీ రఫీ (56) సైకిల్‌షాపులో పనిచేస్తుంటాడు. ఇతడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం అయోధ్యపురం రైల్వే గేట్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న సినీనటి కవిత



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించిన సినీ నటి కవిత

వరంగల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కార్తీక సోమవారం విశేష పూజలు, అభిషేకాలు, దీపోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ సినీ నటి కవిత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్తీక చివరి సోమవారం కావడంతో పంచలింగాలలో తేజోలింగమైన శ్రీభద్రేశ్వర స్వామికి ఉదయం నుంచి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. ఈవో శేషు భారతి భక్తులతో కలిసి భద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దీపోత్సవంలో పాల్గొన్న మహిళలకు మట్టి ప్రమిదలు, వొత్తులు, నూనెతోపాటు మహిళలకు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. వారిని ఈవో శేషుభారతి అభినందించారు.

పత్తికి మద్దతు ధర అమలు చేయాలి

ఖిలావరంగల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం పత్తికి మద్దతు ధర అమలు చేయాలని పత్తి రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏసీరెడ్డినగర్‌లో పత్తి రైతుల రాష్ట్ర సదస్సును పుచ్చకాయల కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పత్తిసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందన్నారు. 2024-25 సంవత్సరంలో 43.76 లక్షల ఎకరాల్లో సాగుచేయగా, 2023-24లో 44.52 లక్షల ఎకరాల్లో సాగైందన్నారు. అంతకుముందు 55 లక్షల ఎకరాల్లో సాగైందన్నారు. అంటే ప్రస్తుతం 11.24 లక్షల ఎకరాల మేర విస్తీర్ణం పడిపోయిందన్నారు. పత్తిసాగు ఖర్చు ఒకవైపు పెరుగుతుండగా, రెండోవైపు ఆదాయం తగ్గుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పత్తిరైతుల ఆదాయాన్ని పెంచేవిధంగా మార్గాలను అన్వేషించాలని, దాంతో పాటు పత్తికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని అన్నారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, బొంతు రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదినేని రమేష్, రాష్ట్ర నాయకులు మార్తినేని పాపారావు, భూక్యా చందు నాయక్, చల్ల నరసింహారెడ్డి, కడియాల వీరాచారి, కొంగర నరసింహస్వామి, గొర్రె సంజీవరెడ్డి, కోబల్, రైతులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మతి తప్పి..

రాయితో తల బాదుకున్న యువకుడు
ఆస్పత్రిలో చేర్పించిన ట్రాఫిక్ పోలీసులు

మట్టెవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు రాయితో నుదుటిపై బాదుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు సమీప ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దామెరచర్లకు యువకుడు వరంగల్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో ఎంజీఎం ప్రాంతంలోని రాజరాజేశ్వర గుడి సమీపంలో రాయితో నుదిటిపై కొట్టుకోవడంతో రక్తస్రావమైంది. ఇది గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు నాగయ్య, రమే శ్ వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని మట్టెవాడ పోలీసులు తెలిపారు. అయితే వివాహితుడైన సదరు వ్యక్తి మరో యువతితో ప్రేమలో పడడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఢిల్లీ సమావేశానికి మేయర్‌కు ఆహ్వానం

నేడు 16వ ఆర్థిక సంఘం భేటీ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న 16వ ఆర్థిక సంఘం సమావేశానికి వరంగల్ మేయర్ గుండు సుధారాణికి ఆహ్వానం అందింది. మంగళవారం జరిగే ఆర్థిక సంఘం సమావేశానికి హాజరు కావాలని సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరనున్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్ 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగ రాల కేటగిరి జాబితాలో మేయర్‌కు ఈ అవకాశం లభించగా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనుల పురోగతిపై మేయర్ వివరిస్తారు. అంతేకాకుండా వరంగల్ నగరం అభివృద్ధికి కావలసిన నిధుల విడుదలపై నివేదిక సమర్పిస్తారు. మేయర్‌కు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు బల్దియా సిబ్బంది, కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపకారమేదీ?

(5వ పేజీ తరువాయి)

24,708 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.83.92లక్షలు మంజూరయ్యాయి. 2022-23సంవత్సరంలో 22,728మంది దరఖాస్తు చేసుకోగా ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. 2023-24 సంవత్సరానికి అసలు స్కాలర్‌షిప్‌లకు సంబంధించి నోటిఫికేషనే జారీ కాలేదు.

పోస్టు మెట్రిక్ ఇలా..

ఈ పథకం ద్వారా ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వార్షికాదాయం రూ.2లక్షలు మించకూడదు. 2021-22 సంవత్సరంలో 1560 మంది దరఖాస్తులు చేసుకోగా 138 మంది ఎంపికయ్యారు. వీరికి రూ. 1.06 కోట్లు విడుదలయ్యాయి. 2022-23 సంవత్సరంలో 276 మంది దరఖాస్తులు చేసుకోగా నిధులు విడుదల కాలేదు. 2023-24 సంవత్సరంలో నోటిఫికేషనే విడుదల కాలేదు.

మెరిట్ కం మీన్స్ ఉపకారవేతనాలు..

ఈ పథకం అమలు మరీ దారుణంగా మారింది. అసలు ఈ పథకం అమలులో ఉందా లేదా అన్న సందేహం తలెత్తుతోంది. మెరిట్‌కం మీన్స్ స్కాలర్ షిప్పులు పథకం కింద డిగ్రీ, పీజీ చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. తల్లిదండ్రులు, లేదా సంరక్షకుల వార్షికాదాయ పరిమితి రూ.2 లక్షలు మించరాదు. గత మూడేళ్ల నుంచి విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్పులు అందడం లేదు. విచిత్రమేమింటే 2021-22 సంవత్సరంలో ఈ స్కాలర్ షిప్పుల కోసం విద్యార్థులు పెట్టుకున్న దరఖాస్తుల డాటానే ఆన్‌లైన్‌లో తొలగించారు. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి స్కాలర్‌షిప్పుల మంజూరు ప్రకటనే రాలేదు.

● **అవినీతి ఉద్యోగిపై విచారణ జరిపించాలి**

వరంగల్ మెడికల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఉద్యోగిపై విచారణ జరిపించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను బహుజన సమాజ్ పార్టీ నాయకులు సోమవారం కోరారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రికి కొత్తగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా వచ్చిన ఎండి.ఇస్మాయిల్ గతంలో రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో విధులు నిర్వహించారు. ఆ సమయంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని అనేక ఫిర్యాదు ఆయనపై ఉన్నాయని ఆరోపించారు. ఏమి లేని స్థితి నుంచి కోట్లాది రూపాయల స్థలాలు, పెద్ద బంగ్లాలు ఎక్కడి నుంచి వచ్చాయని అన్నారు. ప్రస్తుతం ఎంజీఎంలో పని చేస్తున్న ఆయన అన్ని రకాల సిబ్బందిని రూల్స్ ప్రమోషన్ల పేరుతో బెదిరిస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. పేదలకు ఉచితంగా పంపిణీ చేసే మందుల సరాఫరా కాంట్రాక్టర్లను కూడా బెదిరిస్తూ వారి వద్ద నుంచి కమీషన్ల రూపంలో భారీగా ముడుపులు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. డైట్ టెండర్లలో కూడా కాంట్రాక్టర్‌వద్ద లక్షల్లో డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అవినీతి అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

● **వర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం చేయాలి**

కేయూ క్యాంపస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న పార్టుటైం అధ్యాపకులను కన్సాలిటెడ్ పే, ఎంపీఎస్, అకాడమిక్ కన్సల్టెట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట పార్టుటైం ఆల్ యూనివర్సిటీ పార్టుటైం టీచర్స్ అసోసియేషన్ (టీజీ అప్టా) అధ్యక్షుడు సొల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ దూరవిద్య కేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్‌నిజాం సెమినార్ హాల్‌లో నూతనంగా టీజీ అప్టా రాష్ట్ర కార్యవర్గ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమ సమస్యల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా టీజీ అప్టాను ఏర్పాటు చేసినట్లు కిరణ్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇస్తామన్న కన్సాలిడేటెడ్ పేమెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది పార్టుటైం అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని పేర్కొన్నారు. కాగా సోమవారం టీజీ అప్టా నూతన కార్యవర్గం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు.

● **బీసీటీఏ వరంగల్ జిల్లా కమిటీ ఎన్నిక**

ఖిలావరంగల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సోమవారం బహుజన తరగతి ఉపాధ్యాయ అసోసియేషన్ (బీసీటీఏ) వివిధ జిల్లాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో వరంగల్ ఇన్‌చార్జిగా తుమ్మ తిరుపతి, జిల్లా అధ్యక్షుడిగా కాసుల శైలేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక కృష్ణ, కోశాధికారిగా అలుగునూరి సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకృష్ణుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో దిట్ట పూల రవీందర్ అని అన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

● **మహిళలు స్వయం కృషితో ఎదగాలి**

వడ్డెపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం కృషితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని కేయూ ఈసీ మెంబర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె. అనితారెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చంద్రమౌళిగౌడ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయడానికి చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు ప్రశాంతి, అరుణ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● **పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా**

కాజీపేట జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ. 9 వేలు చెల్లించాలని, వినిమం సూచి ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం చెల్లించాలని తదితర డిమాండ్లతో సోమవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో ఉప ప్రాంతీయ భవిష్య నిధి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలోని పెన్షన్ విభాగాధిపతికి సమర్పించారు. నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి తూపురాణి సీతారాం, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి యాదగిరి, రెండు జిల్లాల ప్రధాన కార్యదర్శులు సముద్రాల లక్ష్మీనారాయణ, నారాయణగిరి వీరన్న, ఈపీఎస్ పెన్షనర్ల కన్వీనర్ ఉప్పు సమ్మయ్య, పెన్షనర్లు పాల్గొన్నారు.

● **కత్తిగట్టు బాధితులకు న్యాయం చేయాలి**

హసన్‌పర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కత్తిగట్టు బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ చల్ల ప్రసాద్‌కు బాధిత కుటుంబాల సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. భీమారం గ్రామానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి భీమారం శివారు కత్తిగట్టు ప్రాంతంలోని సర్వే నంబర్ 340, 354, 340-66లో గల 70 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని అర్హులైన పేదలందరికి ఒక్కో కుటుంబానికి 15 గుంటల చొప్పున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పట్టా పాస్ పుస్తకాలు, శాశ్వత యాజమాన్య పత్రాలు కలిగి ఉన్నట్లు తెలిపారు. పహానీల్లో వీరి పేర్లు ఉన్నప్పటికి అట్టి భూమిపై హక్కులు కల్పించాలని తహసీల్దార్‌ను కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా భూమిని అనుభవిస్తున్న నిరుపేదలకు హక్కులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను కలిసిన వారిలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి ఇల్లందుల శోభన్‌బాబు, జయశంకర్ భూపాపల్లి జిల్లా కార్యదర్శి సిరిపెల్లి రాజయ్య, తదితరులున్నారు.

● **చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు: మేయర్**

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణ తరలింపులో విధిగా పనులు జరగాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం వరంగల్ పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను శానిటేషన్ అధికారులతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. మేయర్ మాట్లాడుతూ.. చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు మరమ్మతుకు వస్తే త్వరగా రిపేరు చేసి పంపించాలన్నారు. 66 డివిజన్‌ల పరిధిలో 84392 స్ట్రీట్ లైట్లు ఉండగా 5052 లైట్లు మరమ్మతు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ మహేందర్, డీఈ సారంగం, ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీవో కార్యవర్గం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీవో కార్యవర్గం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీఓ) జిల్లా కార్యవర్గం సోమవారం కలెక్టర్‌లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీవో నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీజీవో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్ టీజీఓ నాయకులు ఉన్నారు.



వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



మెట్టుగుట్టపై స్వయంభూ శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



చెన్నారెడ్డికాలనీ పంచముఖ నాగవీరేంద్రస్వామి దేవాలయంలో అలంకరణ చేస్తున్న అర్చకులు

శివాలయాల్లో విశేష పూజలు

కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో తరలివచ్చిన భక్తులు

వరంగల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం బ్రహ్మీ ముహుర్తం నుంచే అభిషేకాలు ప్రారంభమై రాత్రి దీపోత్సవాలతో ముగిశాయి. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయం, ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, శ్రీసచ్చిదానందేశ్వర సదాశివుడు, వాసవీ మాత ఆలయంలోని శివాలయం, గురుధామంలోని శివాలయం, అయ్యప్ప దేవాలయంలోని శివాలయం, రామన్నపేటలోని రామలింగేశ్వరాలయం, పోతన రోడ్డులోని కుంటిభద్రయ్య దేవాలయం, దుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయం, కోటి లింగాల దేవాలయం, రంగంపేట శివాలయం, గీతా భవన్ శివాలయం, ఓసిటీ శివాలయం, కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం, గిర్మాజీపేటలోని శివాలయం, కరీమాబాద్‌లోని బొమ్మల గుడి శివాలయం, పెరుకవాడలోని శివాలయం, శివనగర్‌లోని పద్మశాలీ పరపతి సంఘం భక్త మార్కండేయ శివాలయంలో వైభవంగా అభిషేకాలు జరిగాయి. సాయంత్రం దీపోత్సవాలను ఆకాశ దీపాలను వెలిగించారు. భక్తులు ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

● **మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో..**

మడికొండ: కార్తీక మాసోత్సవాలలో భాగంగా పరమ శివుడికి ప్రీతిపాత్రమైన కార్తీక సోమవారం భక్తులు పెద్ద యెత్తున మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్దయెత్తున భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి అన్న పూజ చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషుభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ఓం నమశ్శివాయ గురూజి పెద్ది ప్రభాకర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజు, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

● **వరంగల్ కోటలో..**

ఖిలావరంగల్: కార్తీకమాసం చివరి సోమవారం నగరంలోని శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యకోటలోని శ్రీ స్వయంభూశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు శివలింగం గణపతి పూజ, తులసి పూజ, శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శివకల్యాణం జరిపించారు. శివనగర్ రామాలయం, చెన్నారెడ్డికాలనీ పంచముఖ నాగేంద్ర స్వామి దేవాలయంలో శివలింగాలకు అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 37,38 డివిజన్‌ల కార్పొరేటర్‌లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, భక్తులు ముడిదే రఘు, అచ్చ వినోద్‌కుమార్, అచ్చ హేమ, శ్రీపతి వాణి, కొత్తపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ వరంగల్ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్, ప్రధానకార్యదర్శిగా సుధాకర్ రావుతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

హయగ్రీవాచారి జయంతి



హయగ్రీవాచారి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

హనుమకొండ చౌరస్తా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ దిగ్గజం మాజీ మంత్రి దివంగత హయగ్రీవాచారి 108వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని హయగ్రీవాచారి విగ్రహం వద్ద ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథిగా హాజరై హయగ్రీవాచారి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మడికొండ విద్యార్థుల ప్రతిభ

మడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాజీపేటలో జరిగిన 9వ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మడికొండకు చెందిన సెయింట్ మాథ్యూస్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులు విశ్వతేజ, ప్రియాంక, మనిత, వివాన్, ఆదిత్య, రిషిక్ లను, వారికి శిక్షణ ఇచ్చిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ నల్ల రామక్రిష్ణ ను కరస్పాండెంట్ షెరిల్ జాయ్, ప్రిన్సిపల్ సునిల్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీల్ ప్రతాప్‌రెడ్డి

● **ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్**

విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించాలి



హనుమకొండ ఏకశిల పార్కు ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్‌పీ నాయకులు



వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

బాలసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు విద్యా, వైద్యం మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. హనుమకొండ ఏకశిల పార్కు ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ మాట్లాడుతూ.. గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ఈబీసీ ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, అర్హత కలిగిన వారికి ఎకరం భూమి, అర్హులందరికి 200గజాల స్థలంలో ఇంటి నిర్మాణం, యువతకు ఉపాధి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏకశిల పార్కు ముందు ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిద్దెపాక రవీందర్, సలీంపాషా, షైదం రవి, చుక్క రత్నాకర్, కోగిల రూప, నరేష్, పూరెళ్ల విష్ణు, బి. ఠాగూర్ నాథ్ పాల్గొన్నారు.

● వరంగల్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఐదు పథకాలను ఉచితంగా అందజేస్తే చాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికి ఉచిత విద్య వైద్యం, ఉపాధి, ఒక ఎకరం సాగుభూమి, నాలుగు గదుల ఇల్లు అందజేయాలన్నారు. ఈ ఐదు పథకాలు ఉచితంగా అందజేస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. పార్టీ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్యశారదకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేకల సుమన్, నాయకులు రొడ్డా మురళీకృష్ణ, సంగాల శివకృష్ణ, సిలువేరు రవి, అలువాల శ్రీనివాస్, ఠాగూర్ మహారాజ్, మంతెన బాబురావు, బరిగెల సురేశ్, మాదాసి ప్రవీణ్, రణధీర్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి వార్షికోత్సవాలు

రెండో రోజు వైభవంగా కుంకుమ పూజ



ఖిలావరంగల్ బొడ్రాయిని దర్శించుకున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలావరంగల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : ఖిలావరంగల్‌లో బొడ్రాయి వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం మహిళలు పురోహితుడు పాలకుర్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహాలక్ష్మి పూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో మహిళలు బొడ్రాయిపై పసుపు కుంకుమలు కలిపిన నీళ్ళు పోసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో 37, 38 డివిజన్ కార్పొరేటర్‌లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, బొడ్రాయి కమిటీ ప్రధాన కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి గజ్జేల శ్యామ్, కార్య వర్గ సభ్యులు పాల్గొన్నారు.

● **బొడ్రాయిని దర్శించుకున్న ప్రదీప్‌రావు**

వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బొడ్రాయిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుప్పాల రాజేందర్, ఇనుముల అరుణ్, నగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రుబియాకు బంగారు పతకం



రూబియాను అభినందిస్తున్న మైనారిటీ గురుకుల కళాశాల సిబ్బంది

శంభునిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జింఖానా మైదానంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో వరంగల్ విద్యార్థిని రుబియా బంగారు పతకం సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-19 కేటగిరీలో 59 కేజీల విభాగంలో రూబియా ప్రతిభ కనబరిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. శంభునిపేట మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ (సీఈసీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుబియా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో రుమియాను ప్రిన్సిపాల్ తాళ్ళ నీలిమాదేవి, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

● **కరాటేలో విన్నిత, సంజయ్‌సచిన్‌కు గోల్డ్ మెడల్స్**



విజేతలను సత్కరిస్తున్న కార్పొరేటర్ గుండు చందన

శంభునిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వరంగల్ రంగశాయిపేటకు చెందిన తండ విన్నిత, తాటికొండ సంజయ్‌సచిన్ బంగారు పతకాలు సాధించారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రంగశాయిపేటలోని పరమేశ్వర కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు విన్నిత బాలికల అండర్ 13 గ్రూప్ బ్లాక్ బెల్ట్ విభాగంలో, బాలుర గ్రీన్ బెల్ట్ విభాగంలో తాటికొండ సంజయ్‌సచిన్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ సోమవారం వారిని ఘనంగా సత్కరించి కోచ్‌లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మాస్టర్ తూముల పరమేశ్వర్, చీకటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కేయూ క్యాంపస్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి యూనివర్సిటీ న్యాయ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 26న మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి విద్యార్థులకు ఉపన్యాసం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి చింతల అన్వేష్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో..

కేయూ రాజనీశాస్త్ర విభాగం నేతృత్వంలో నవంబరు 26న కేయూ సెనెట్ హాల్‌లో ఉదయం 10 గంటలకు అస్పిరేషన్ ప్రామిసెస్ అండ్ పొలిటికల్ ప్రొర్మానెన్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ సింపోజియంకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డీన్‌లు హాజరై మాట్లాడుతారని సంకినేని వెంకట్ వెల్లడించారు.

ఏబీవీపీ నిరసన

హసన్‌పర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేనేజ్‌మెంట్, కండోనేషన్ ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే తగ్గించకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును పురస్కరించుకొని సోమవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ 10వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కాలేజీ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి, కళాశాల ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్, కేర్ టేకర్ వహీదా పర్వీన్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ రాజు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

● **ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సన్మానం**

కేయూ క్యాంపస్: ఈ నెల 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జల్గాం లో గల కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు హాజరై శిక్షణను పూర్తి చేసుకున్న కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు సన్మానించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్రశంస పత్రాలను అందచేశారు. మహారాష్ట్ర ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు హాజరైన కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లలో కొన్నేటి నాగరాజు, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెలకొండపల్లి), టి. రామచరణ్(వాగ్దేవి డిగ్రీ కళాశాల, కిషన్‌పుర), జి. వెంకన్న,(యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), బానోత్ దివ్య, టి అంజలి, (వర్సిటీ మహిళ ఇంజరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్)ఉన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

● **బంగారం, నగదు స్వాధీనం**



మీడియాతో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బాలసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు చైన్ స్నాచర్లను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అల్వేర్ జిల్లా కేర్లీ మండలం కృష్ణ కాలనీకి చెందిన రోహిత్‌కుమార్(19), అతడితోపాటు మరో మైనర్ జల్సాలకు అలవాటు పడ్డారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో అద్దె రూములో నివాసం ఏర్పరుచుకొని వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. గత సెప్టెంబరు 11న హనుమకొండలోని అదాలత్ సెంటర్ నుంచి అనుమాండ్ల సమ్మక్క ఓ అపార్ట్‌మెంట్ ఎదుట నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి సమ్మక్క మెడలోని బంగారు పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదైంది. సోమవారం అదాలత్ జంక్షన్ వద్ద పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వీరిని పట్టుకుని విచారించారు. వీరు గతంలో సుబేదారి పోలీసు స్టేషన్‌పరిధిలో ఒకటి, కేయూ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు, మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి, స్టేషన్ ఘన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి చైన్ స్నాచింగ్ చేసినట్లు ఒప్పుకోవడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 10 గ్రాముల బంగారం, రూ. 80 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సుబేదారి సీఐ పి. సత్యనారాయణ రెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్య వైశ్య కమిటీల ప్రమాణ స్వీకారం

హసన్‌పర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భీమారం ఎంటీఆర్ గార్డెన్స్‌లో సోమవారం హనుమకొండ జిల్లా ఆర్య వైశ్య జిల్లా మహాసభ నూతన కార్యవర్గ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ అధ్యక్షతన జరిగిన మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడు తోట సురేష్, ప్రధాన కార్యదర్శి దొడ్డ మోహన్‌రావు, కోశాధికారి శ్రీరాం రవీందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు పడకంటి జ్యోతి, ప్రధాన కార్యదర్శి దొడ్డ దేవి, కోశాధికారి అయిత పద్మజ, యువజన విభాగం అధ్యక్షుడు అడ్డగూటి సతీష్, ప్రధాన కార్యదర్శి సూర్యదేవర శ్రావణ్‌కుమార్, కోశాధికారి యాంసాని వెంకటేష్‌తో పాటు వివిధ విభాగాల రాష్ట్ర నాయకులు రేణికుంట్ల గణేష్‌గుప్తా, ఇరుకుల్ల రామక్రిష్ణ, అగిరి వెంకటేష్, ఉప్పుల శారద ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

పాంచాలరాయను.. పట్టించుకోరేమయా ?

శిథిలావస్థలో కాకతీయుల నాటి వైష్ణవాలయం

చరిత్ర

శ్రీకృష్ణుడిని పాంచాలరాయుడిగా పూజించే ఏకైక క్షేత్రం

అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు


పాంచాలరాయ స్వామి వి గ్రహం


ఆలయ ఆవరణలోని రాటణ స్తంభం

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ శిల్ప కళా వైభవానికి ప్రతీకగా.. కాకతీయుల నాటి అతి ముఖ్యమైన దేవాలయంగా శ్రీ పాంచాలరాయ స్వామి (కృష్ణ) దేవాలయానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఓరుగల్లులో జైన, శైవ దేవాలయాలెన్నో ఉన్నా.. శ్రీ కృష్ణుడిని పాంచాలరాయుడిగా పూజించే ప్రత్యేకత కలిగిన ఆలయం ఇదొక్కటే. ఇలాంటి దేవాలయం దేశంలో మరెక్కడా లేదని చెబుతుంటారు. పాంచాలరాయ స్వామి అంటే శ్రీ కృష్ణుడు. పాంచాలి (ద్రౌపది) మాన సంరక్షణ గావించిన స్వామి పాంచాలరాయ స్వామి. వరంగల్ నగరానికి తూర్పు దిశగా 10 కి.మీ దూరంలోని గీసుకొండ మండలం శాయంపేట హవేలి గ్రామంలో కాకతీయులు నిర్మించిన పురాతన ఆలయమైన పాంచాలరాయ ఆలయం.. నాటి తురుష్కుల దండయాత్రలతో ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో క్రీశ. 1503లో షితాబుఖాను (సీతాపతి రాజు) దీనిని పునర్నిర్మించినట్టు ఆయన వేసిన ఓ శాసనం చెబుతోంది. కృష్ణ దేవాలయాలు చాలా చోట్ల చాలా పేర్లతో కనిపి స్తాయి కానీ పాంచాలరాయుడనే పేరుతో ఆలయాలున్న ఆధారా లు మాత్రం కనిపించవు. రాతి స్తంభాల ముఖద్వారం, దానిపై ఒక చిన్న గోపురం నిర్మితమై ఉండగా.. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం, కాకతీయుల శైలిలో మహాగణపతి విగ్రహం ఉన్నా యి. ధ్వజ స్తంభం పక్కన భక్తాంజనేయ స్వామి, గరుత్మంతుని విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆలయం లోపలికి వెళ్లగానే రంగమంటపం, దాని మధ్య భాగంలో నున్నని గుండ్రని వేదిక, పై భాగంలో రాతి చక్రం, మం డప నిర్మాణానికి ఉపయోగించిన రాతి స్తంభాలు, వాటిని నిలిపిన తీరు కాకతీయు నిర్మాణ శైలికి అద్దం పడతాయి. గర్భాలయం ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న పూర్ణకుంభాలు, ద్వారంపై భాగంలో ఉండే గజలక్ష్మి విగ్రహం సాధారణంగా మనకు కాకతీ య ఆలయాల్లో కనిపించే విశేషాలే.


గుడికి వాయువ్యంలో బావి ఉండగా ఆ బావి ముందర 15 అడుగుల ఎత్తున రాటణ స్తంభం రాతి వేదికలో బిగించి ఉంది. ఈ రాటణం ఆ బావిలోంచి సమీపంలోని పొలాలకు నీందించే యంత్రమని, దాని ద్వారా నీరు పొందినందుకు ప్రతిఫలంగా రైతులు సుంకం చెల్లించేవారని తెలుస్తోంది.

విగ్రహం వెనుక జడచుట్ట..

గర్భాలయంలో మూలవిరాట్టుకు పైభాగంలో ఒక అందమైన రాతి పద్మం చెక్కి ఉంటుంది. స్వామి విగ్రహానికి వెనుక భాగంలో జడలాంటి గుండ్రని చుట్ట కనిపిస్తుంది. కాళ్లకు పట్టీలు, మట్టెలు కూడా కనిపిస్తాయి. ఈ అలంకరణను బట్టి స్వామి సగం స్త్రీ రూపంలో, మరో సగం పురుషుని రూపంలో ఉన్న విశిష్టమైన మూల విరాట్‌గా భావిస్తున్నారు. ఈ విధంగా విగ్రహాల వెనుక భాగంలో జడనలంకరించడం వరంగల్ పురాతత్వశాఖ వారి మ్యూజియంలోని గణపతి విగ్రహంలోనూ ఉంటుంది. ప్రధాన ఆలయానికి పక్కనున్న మండపంలో అండాళ్ అమ్మవారి విగ్రహం పన్నీద్దరు ఆళ్వారుల విగ్రహాలు ఉన్నాయి.

పట్టింపు లేక..

కాకతీయుల నాటి అత్యంత అరుదైన, అద్భుతమైన ఈ ఆలయాన్ని పట్టించుకునేవారే లేరు. విశాలమైన ఆవరణ కలిగిన ఈ ఆలయంలో ప్రాంగణంలోని మండపం కొంత మేరకు కూలి పోయింది. స్తంభాలు, శిల్పాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ప్రాచీన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఏ మాత్రం చొరవ చూపడం లేదు. వాస్తవానికి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర పురావస్తు శాఖదే. ఇకనైనా పాలకులు ఈ ఆలయ అభివృ ద్ధిపై దృష్టి పెడితే ఓరుగల్లులో మరో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఆలయ ముఖద్వారం


పాంచాలరాయ స్వామి ఆలయం వెనుక భాగం

సుందర రూపం.. మూలవిరాట్

ఈ ఆలయంలోని పాంచాలరాయ స్వామి విగ్రహం ఒక అద్భుత కళాఖండం. మూర్తిలో స్త్రీలాలిత్యం కనిపిస్తుంది. శంఖు, చక్ర, గదా, పద్మాలతో లక్ష్మీసమేతుడై చతుర్భుజుడైన పాంచాలరాయ స్వామి విగ్రహం కాకతీయ శిల్పాలలోనే ఒక అపురూప సుందరరూపమని చెబుతారు. ఈ విగ్రహానికి పైభాగంలో రాతితో చెక్కిన మకర తోరణాలున్నాయి. మకర తోరణాలను మొసళ్ల బొమ్మలతో అలంకరించి వాటినోళ్ల నుండి వెలువడిన లతలు ప్రధాన విగ్రహాన్ని అలంకరించినట్టు చిత్రించడం కాకతీయ శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక. ఇలాంటి మకర తోరణాలు మనకు హనుమకొండ వేయిస్తంభాల గుడి, రామప్ప గుడి మొదలైన చోట్ల కనిపిస్తాయి. కాకతీయుల కిరీట శిల్పాన్ని పోలిన కిరీటమే స్వామివారిని అలంకరించి ఉంటాయి. పాంచాలరాయ స్వామి విగ్రహం చుట్టూ దశావతార విగ్రహాలు చెక్కి ఉండడం మరోవిశేషం.


రుద్రేశ్వర స్వామి కి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్ర శర్మ

రుద్రేశ్వరుడికి లక్ష బిల్వార్చన

108 శంఖాల అలంకరణలో సిద్ధేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వర స్వామివారికి లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 300 మంది దంపతులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం తాటిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు కార్తీక సమారాధన జరి పారు. మహిళలు ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. దీప దానాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, అర్చకులు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్ ఈ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇక హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో సిద్ధేశ్వరుడిని 108 శంఖాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సిద్దేషని రవి కుమార్, సురేష్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శంఖాలతో సిద్దేశ్వరుడికి అలంకరణ

సిద్దేశ్వరాలయం కబ్జాపై చర్యలకు రంగం సిద్ధం

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) పద్మాక్షి దేవాలయం భూమిని ఆక్రమించిన ప్రైవేటు కాలేజీ యాజమాన్యంపై ఎట్టకేలకు ట్రిబ్యునల్‌లో కేసు నమోదైంది. సోమవారం లోకాయుక్త కోర్టులో హనుమకొండ పద్మాక్షి, సిద్దేశ్వర, రంగనాయక, వీరపిచ్చమాంబ, వరంగల్‌లోని వేణుగోపాల స్వామి దేవాలయాల భూముల కబ్జాపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదుపై లోకాయుక్త సోమవారం విచారణ జరిపింది. ఈ విచారణకు చక్రపాణి, రాజుతో పాటు దేవాదాయ శాఖ పక్షాన సిద్దేశ్వరాలయం ఈవో ప్రసాద్ హాజరయ్యారు. నాలుగు సంవత్సరాల క్రితం దాఖలు చేసిన ఈ ఫిర్యాదుపై లోకాయుక్త జస్టిస్ సివి రాములు విచారణలో భాగంగా జారీ చేసిన ఆదేశాల మేరకు 5 దేవాలయాలకు చెందిన 20.39 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందని దేవాదాయ శాఖ నివేదికను సమర్పించింది.

మొత్తం 69 కబ్జా దారుల్లో ఒకరైన ప్రైవేటు కాలేజీ యాజ మాన్యం సిద్దేశ్వరాయానికి చెందిన 9 గుంటలు ఆక్రమించినట్టు రెండు సంవత్సరాల క్రితం అధికారులు లోకాయుక్తకు తెలిపారు. సోమవారం విచారణలో సిద్దేశ్వరాలయం భూమి కబ్జాకు సంబంధించి కాలేజీ యాజమాన్యంపై ట్రిబ్యునల్‌లో కేసు వేసినట్టు ఈవో ప్రసాద్ లోకాయుక్తకు తెలిపారు. అలాగే రంగనాయకస్వామి ఆలయ భూములను ఆక్రమించిన 13 మంది కబ్జాదారులపై కూడా కేసులు దాఖలు చేసినట్టు చెప్పారు. తదుపరి విచారణ వచ్చే నెల 13కు వాయిదా పడింది.

గిరి బిడ్డలకు అండగా..
అందరూ కదలాలి

(5వ పేజీ తరువాయి)

బుద్ధి చెప్పే సమయం వస్తుందన్నారు. తాము గిరిజన రైతుల కోసం బయలుదేరి మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన ఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకని డీజీపీ ప్రశ్నించారని, కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళిత, గిరిజనులు, బీసీలు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి పాలన ఏడాది పూర్తవుతోందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రైతుబంధు ఎగొట్టారని, పింఛన్ పెంచలేదని, బోనస్ బోగస్ అయ్యిందని, ఆడబిడ్డలకు మహాలక్ష్మి స్కీం రాలేదని ఆరోపించారు. తాను మహబూబాబాద్ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడుతామని అంటుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు తాము భయపడేది లేదని, ఆ పార్టీని కూకటివేళ్లతో పెకిలిస్తామన్నారు. మానుకోటలో ధర్నాకు అనుమతివ్వకుంటే హైకోర్టుకు పోయి తెచ్చుకున్నామని, వెయ్యి మంది అనుకుంటే 25వేల మంది వచ్చారని, ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉందో ఈ మహాధర్నా చూస్తే అర్థమవుతుందన్నారు.

ఇతర నేతలు ఏమన్నారంటే..

శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ నాడు తెలంగాణ ఉద్యమానికి... నేడు లగచర్ల గిరిజనులకు మద్దతుగా మానుకోట గడ్డ నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను ప్రజలకు వివరించేందుకు ధర్నా చేపట్టామన్నారు. బీఆర్ఎస్‌కు 25 సంవత్సరాల చరిత్ర ఉందని అందులో 14 సంవత్సరాలు ఉద్యమ నేపథ్యమేనన్నది గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకు చుక్కలు చూపిస్తుందన్నారు. ఇక కాంగ్రెస్ ఆటలు సాగవని ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాల బాట పట్టిందని పేర్కొన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగుపెట్టిన చోటల్లా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని ఎద్దేవా చేశారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గిరిజనుల ఆశాజ్యోతి మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. లగచర్ల గిరిజనులకు అండగా బీఆర్ఎస్ నిలబడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అహంకార, నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ వాలడం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే సీఎం ఎజెండా అని ఆరోపించారు. ఆయనకు ఉద్యమగడ్డ మానుకోట నుంచే కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేదల భూమిని రక్షించేందుకు.. తెలంగాణ బిడ్డల భవిష్యత్ కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి 'మా తండాలో మా రాజ్యం' అనే నినాదాన్ని అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ... గిరిజనుల ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి వారి భూములను లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. ధర్నాను అడ్డుకుంటామని చెప్పిన వారికి మహాధర్నా విజయవంతం కావడం చెంపపెట్టు లాంటిదన్నారు. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రజలు ఓట్లేసి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే వారి భూములే లాక్కుంటున్నారని, గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, అంగోతు బింధు, గుడిపూడి నవీన్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మర్రి రంగారావు, బానోత్ రవికుమార్, గాంధీనాయక్, అయూబ్‌పాషా, జెరిపోతుల వెంకన్న, చిట్యాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ స్కెచ్ సక్సెస్ !

- మానుకోట మహాధర్నాకు తరలొచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి రాక
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

మహబూబాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంజారాల్లో తమకున్న పట్టును సడలనీయకుండా.. లగచర్ల అంశాన్ని అస్త్రంగా మలుచుకుని బీఆర్ఎస్ మానుకోట వేదికగా వేసిన స్కెచ్ సక్సెస్ అయ్యింది. వాస్తవానికి 22న బీఆర్ఎస్ నేతలు మహాధర్నాకు సిద్ధమయ్యారు. కానీ తొలుత కేటీఆర్ ధర్నాకు అనుమతిస్తామంటూ దాటవేత ధోరణి కొనసాగించి ఆఖరి నిమిషంలో చేతులెత్తేసిన పోలీసుల తీరుతో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా హైకోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకోగలిగింది. అంతటితో ఆగకుండా వెయ్యి మందితో మహాధర్నా అని ప్రచారం చేసుకుంటూ వచ్చిన గులాబీ దళం.. రహస్యంగా భారీగా జన సమీకరణకు పావులు కదిపింది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మానుకోట ధర్నాచౌక్ తహసీల్ సెంటర్‌లో నిరసన ధర్నాకు మహబూబాబాద్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని పలు మండలాల నుంచి గులాబీ శ్రేణులు తరలివచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం నుంచి కూడా ముఖ్యులు రావడంతో బీఆర్ఎస్‌లో జోష్ కనిపించింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్సీలు ఒక్కతాటిపైకి వచ్చి కేటీఆర్ మహాధర్నా ద్వారా గులాబీ బలం తగ్గలేదని నిరూపించారు. ఇప్పటికే కేటీఆర్ ధర్నాకు అనుమతి విషయంలో రచ్చ జరిగిన నేపథ్యంలో ఏ మాత్రం తొందరపడినా బీఆర్ఎస్‌కే ప్లస్ పాయింట్ అవుతుందని భావించిన కాంగ్రెస్ మౌనం వహిస్తోంది. ఈ పరిణామాలను అనువుగా మలచుకున్న బీఆర్ఎస్ మహాధర్నాను సక్సెస్ చేసుకుంది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీలు, ముఖ్యనేతలు ఎవరికి వారే జనం తరలింపులో తమవంతు కృషి చేయడం, దీనికి తోడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ గుర్తింపు కోసం, బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు గ్రామాల్లో తమ బలం చాటుకునేందుకు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం కల్పించడం కలిసొచ్చింది.

అయితే ఉద యం 10.30 గంటల వరకు పలుచగా కనిపించిన వేదిక అరగంటలోనే నిండిపోయింది. మహబూబాబాద్ చుట్టుపక్కల నుంచి కార్యకర్తలు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మహాధర్నా జరిగిన తీరుపై నిఘా పెట్టారు. పలు మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఆంక్షలు విధించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్డుమార్గంలో మరిపెడ మీదుగా మధ్యాహ్నం 12.05 గంటలకు మహబూబాబాద్‌లోని వేదిక వద్దకు చేరుకున్నారు. ఒకరిద్దరి ముఖ్యుల ప్రసంగాల తర్వాత 12.36 గంటలకు ప్రసంగం ప్రారంభించిన కేటీఆర్ సరిగ్గా 15 నిమిషాలు మాట్లాడారు. ఆది నుంచి ఆఖరి వరకు అడుగడుగునా పద్నాలుగేళ్ల కిందట మానుకోటలో సమైక్యవాదులను రాళ్లతో తరిమిన సంఘటనను ప్రస్తావిస్తూ ఈ గడ్డ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. తెలంగాణ ఉద్యమంలో నాడు మానుకోట ఘటన కీలక మలుపు తిప్పిందని కేటీఆర్ ప్రస్తావించినప్పుడు సభికుల నుంచి హర్షాద్వానాలు మిన్నంటాయి.


మానుకోట మహాధర్నాలో గిరిజన మహిళతో ముచ్చటిస్తున్న కేటీఆర్

భావి సీఎం కేటీఆర్ అంటూ నినాదాలు

కేటీఆర్ తన ప్రసంగంలో లగచర్లలో గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించేందుకు మానుకోట వస్తుంటే అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నించారని.. ఒక్క లగచర్ల ఘటనే కాదు.. రాష్ట్రంలో దళిత, గిరిజన, బీసీలపై ఎక్కడ చిన్న సంఘటన జరిగినా బీఆర్ఎస్ అక్కడికి వెళ్తుందని, అవసమైతే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో గులాబీ గళం వినిపిస్తామని, ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆసయంలో బీఆర్ఎస్ శ్రేణులు చప్పట్లతో ధర్నా ప్రాంగణాన్ని మారుమోగించారు. కొందరు నాయకులు, కార్యకర్తలు 'భావి సీఎం కేటీఆర్..' అంటూ నినాదాలతో హోరెత్తించారు. మొత్తానికి 15 నిమిషాల కేటీఆర్ ప్రసంగం ఆద్యంతం ఇటు గులాబీ శ్రేణులను ఉత్తేజపరుస్తూనే అటూ సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పాలనను ఎండగడుతూ కొనసాగింది. ఈ మహాధర్నా విజయవంతంతో కాంగ్రెస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు అంతర్మథనంలో పడిపోయారని సమాచారం. ఎక్కడ తప్పు జరిగింది.. ఇక ముందు అనుసరించాల్సిన వ్యూహాలేంటి? స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా ప్రజలు బీఆర్ఎస్ వైపు మళ్లకుండా తాము ఎలాంటి చర్యలు తీసుకోవాలి లాంటి విషయాలపై తర్జన.. భర్జన పడుతున్నట్టు చర్చ జరుగుతోంది. మొత్తానికి లగచర్ల ఘటనపై కేటీఆర్ నిర్వహించిన ధర్నా బీఆర్ఎస్‌కు కలిసొచ్చిందని, ఇదే జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల వరకు కొనసాగించేందుకు ఆ పార్టీ నేతలు కార్యాచరణకు సిద్ధమవడం విశేషం.

రైతుబంధు వస్తోందా ?

అమనగల్ రైతులతో కేటీఆర్ మాటామంతి

మహబూబాబాద్ అగ్రికల్చర్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలంలోని అమనగల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొంతసేపు రైతులతో ముచ్చటించారు. సోమవారం మహాధర్నా ముగించుకుని మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో ఆయన అమనగల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆగారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి రైతులతో పక్కనే ఉన్న పొలం గట్టుపై కూర్చుని మాట్లాడారు. రైతుబంధు వచ్చిందా? వడ్ల కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి? బోనస్ ఇస్తున్నారా?' అని ప్రశ్నించారు. దాంతో అక్కడి రైతులు రైతుబంధు ఇప్పటి వరకు పడలేదని, కొంత మందికి రుణమాఫీ కాలేదని, బతుకమ్మ చీరలు కూడా అందలేదని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు వద్దిరాజు కిషన్, తదితరులున్నారు.


రైతులతో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూక్యాంపస్, నవంబరు 25 : (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని నవంబరు 26 నుంచి జరుగాల్సిన డిగ్రీ 1,3, 5వ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేశారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో జరుగాల్సిన సబ్జెక్టులను పరీక్షల టైం టేబుల్‌లో పేర్కొన్న పరీక్షలన్ని ముగిసన తర్వాత తేదీల్లో నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణా.దికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్యలు సోమవారం వెల్లడిం చారు. గతంలో ప్రకటించిన ప్రకారం నవంబరు 29వ తేదీ నుంచి జరిగే పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

ప్రైవేట్ కళాశాల సమ్మె ఎఫెక్ట్

రాష్ట్రవ్యాప్తంగా గత రెండేళ్ల నుంచి ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం లేదు. దీంతో రెండు దఫాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నేతృత్వంలో ఫీజుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రైవేట్ కళాశాలలు సమ్మెకు దిగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ మేరకు రెండు దఫాలుగా అక్టోబరు 14 నుంచి 18 వరకు చేసిన సమ్మెతో పాటు నవంబరు 19 నుంచి 24 వరకు చేసిన సమ్మెను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విరమించాయి. ప్రైవేట్ కళాశాలలు తమ డిమాండ్‌ల సాధన కోసం సమ్మెకు దిగడంతో విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజుల వసూలు చేపట్టలేదు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అప్లికేషన్ ఫీజులను చెల్లించలేదు. దీంతో కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రైవేట్ కళాశాల విద్యార్థులతో పాటు కొన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాల్ టికెట్లను వర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు.

దీంతో విద్యార్థులు ఆందోళనకు గురైయారు. అసలు పరీక్షలు నిర్వహిస్తారా లేదా మా పరిస్థితి ఎంటి అంటూ ఆందోళనకు గురైయ్యారు. చివరకు ప్రైవేట్ కళాశాలలు సమ్మె విరమించి ఫీజుల చెల్లింపు కొలిక్కి రావడంతో పరీక్షల తాత్కాలికంగా మూడు రోజులు పాటు రీషెడ్యూల్ చేసి మిగతా పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు ప్రకటించారు.



కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయం

- నవంబరు 26న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు జరుగాల్సిన డిగ్రీ మొదటి సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వే జెస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్ని డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజెస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్ని డిసెంబరు 28కు వాయిదా వేశారు.

రీ షెడ్యూల్ పరీక్షల వివరాలు ఇవే..

- నవంబరు 26న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజెస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్ని డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 28న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజెస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్ని డిసెంబరు 30కి వాయిదా వేశారు. వీటితో పాటు బీసీఏ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు.

40, 45 ఏళ్లు దాటిన వాళ్ల ముఖంలో వృద్ధాప్య ఛాయలు నుదురు, కనుబొమలు, కళ్లు, బుగ్గలు, ముక్కు, పెదవులు, గడ్డం, దవడ.. ఇలా ముఖంలోని అన్ని అవయవాల్లో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ఈ వృద్ధాప్య ఛాయలు వ్యక్తులను బట్టి భిన్నంగా ఉంటాయి. కొందర్లో నుదుటి మీద పెద్ద పెద్ద గీతలు ఏర్పడతాయి. భృకుటి దగ్గర నిలువు ముడతలు ఏర్పడి, ముఖం కోపంగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఇంకొందర్లో ముక్కు లావవుతుంది. ఇంకొందర్లో పెదవులు పలుచబడిపోతాయి. దవడలు వెడల్పవుతాయి. ఇలాంటి ఛాయలను వీలైనంత సహజంగా సరిదిద్ది, 5 నుంచి 10 ఏళ్ల తక్కువ వయస్కుల్లా కనిపించే కాస్మోటిక్ సర్జరీలు ఇవే!

సౌందర్య చికిత్సలు

అందం ఇలా సొంతం

అందానికి మెరుగులు దిద్దుకునేటప్పుడు, ఫలితం సాధ్యమైనంత సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే అవి కృత్రిమ అందాలనే విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. మరీముఖ్యంగా నడి వయసులో సౌందర్య చికిత్సలను ఆశ్రయించేటప్పుడు, పైపై చికిత్సలను ఆశ్రయించి, ఫలితంతో రాజీపడిపోవడమా లేదంటే సర్జరీలతో సహజసిద్ధమైన ఫలితాన్ని పొందడమా అనే విషయంలో స్పష్టత కలిగి ఉండాలంటున్నారు వైద్యులు.



నుదురు నునుపుగా

నుదుటి మీద లోతైన, స్పష్టమైన గీతలు ఏర్పడినప్పుడు, భృకుటి ముడిపడి, ఉబ్బెత్తు ముడతలు ఏర్పడినప్పుడు 'సర్జికల్ ఫోర్‌హెడ్ లిఫ్ట్' చికిత్సను ఆశ్రయించవచ్చు.

దిద్దుబాటు ఇలా: నుదుటి దగ్గరున్న వెంట్రుకల అడుగుకు చేరుకుని, లోపలి చర్మాన్ని పైకి లాగి బిగిస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో 10 నుంచి 15 ఏళ్ల పాటు ఫలితం నిలిచి ఉంటుంది. బొటాక్స్, ఫిల్లర్స్‌తో 6 నెలల నుంచి ఏడాది పాటు ఫలితం కనిపిస్తుంది.

బుగ్గలు జారితే

వయసు పైబడినప్పుడు బుగ్గల్లోని కొవ్వు కిందకు జారుతుంది. దాంతో ఆ ప్రదేశంలో ముడతలు ఏర్పడి, చర్మం కూడా జారిపోతుంది. దీనికి 'ఫేస్ లిఫ్ట్'ను ఎంచుకోవాలి.

దిద్దుబాటు ఇలా: చర్మం అడుగుకు చేరుకుని జారిన కొవ్వు పొరను మునుపటి స్థానంలో అమర్చే సర్జరీ చేయవలసి ఉంటుంది. ఇలా బుగ్గలను బిగుతుగా మార్చడంతో పాటు అవసరమైతే వదులుగా ఉన్న అదనపు చర్మాన్ని కూడా తొలగిస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. ఫిల్లర్స్ ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

ఆకట్టుకునే పెదవులు

పెదవుల పైన గీతలు, ముడతలు ఏర్పడడంతో పాటు పెదవులు లావుగా ఉండడం, లేదా పలుచబడిపోవడం కూడా జరుగుతుంది. వీటికి వేర్వేరు చికిత్సలుంటాయి.

దిద్దుబాటు ఇలా: నవ్వినప్పుడు మాత్రమే ఏర్పడే గీతలను బొటాక్స్‌తో సరిదిద్దవచ్చు. పలుచబడితే ఫిల్లర్స్‌తో నింపుకోవచ్చు. కానీ లోతైన ముడతలు ఏర్పడినప్పుడు సర్జరీ అవసరమవుతుంది. నవ్వినప్పుడు చిగుళ్లు కనిపిస్తుంటే, బొటాక్స్‌తో పైపెదవి కండరాన్ని బలహీనపరుస్తారు. ఫలితంగా నవ్వినప్పుడు పైపెదవి మరీ పైకి వెళ్లిపోకుండా ఉంటుంది.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. సమస్య స్వల్పంగా ఉన్నప్పుడు బొటాక్స్, ఫిల్లర్స్‌తో సరిదిద్దుకోవచ్చు. దీంతో ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

45 ఏళ్ల మహిళ ముఖాన్ని పాతికేళ్ల యువతి ముఖంలా సరిదిద్దడం ఎంతటి సమర్థమైన సర్జన్‌కు అయినా సాధ్యపడదు. ఐదు నుంచి పదేళ్లకు ముందు ఎలా ఉన్నారో ఆ రూపాన్ని తీసుకురాగలిగే వెసులుబాటు మాత్రమే ఉంటుంది. కాస్మటిక్ సర్జరీలతో ప్రకృతి విరుద్ధ ఫలితాన్ని సాధించడం అసాధ్యం. ఈ చికిత్సలతో అందాన్ని మెరుగు పరుచుకోవడం మాత్రమే సాధ్యపడుతుంది.

పైబడే వయసుతో చర్మం బిగుతు సడలి, జారిపోతుంది. ముడతలు, మచ్చలు కూడా ఏర్పడతాయి. వీటిని కప్పిపుచ్చుకోవడం కోసం, చర్మ చికిత్సలను ఆశ్రయించడం నేడు పరిపాటై పోయింది. అయితే ఎంచుకునే చికిత్సలు సమస్య తీవ్రతకు, పైబడిన వయసుకూ తగినవై ఉండాలి. సన్నని గీతలు, ముడతలు, మచ్చలు లాంటి స్వల్ప లోపాలను సరిదిద్దడం కోసం బొటాక్స్, ఫిల్లర్స్, లేజర్స్, కెమికల్ పీల్స్ లాంటివి అందుబాటులో ఉన్నాయి. అయితే వాటితో ఫలితం మెరుగ్గా ఉందనే ఉద్దేశంతో వయసు పైబడుతున్నా, అవే చికిత్సలను ఆశ్రయించడం సరికాదు. అలా చేస్తే, ముఖం ఉబ్బి, కృత్రిమ యవ్వనాన్ని తలపిస్తుంది. సర్జరీ అవసరం ఉన్న చోట తేలికపాటి చికిత్సలను ఎంచుకుంటే ఇదే జరుగుతూ ఉంటుంది. బదులుగా సమర్థమైన వైద్యుల సహాయంతో సరైన సర్జరీని ఎంచుకోగలిగితే, ఫలితం సహజసిద్ధంగా ఉంటుంది.

చుబుకం చక్కగా...

చుబుకాన్ని ఫిల్లర్స్‌తో పదునుగా మార్చుకోవచ్చు. చుబుకం చిన్నదిగా ఉన్నా, కింది దవడ ముందుకు ఉన్నా సర్జరీ అవసరమవుతుంది.

దిద్దుబాటు ఇలా: సిలికాన్ ఇంప్లాంట్స్ సహాయంతో చుబుకానికి చక్కని రూపాన్ని తీసుకురావచ్చు.

కోలుకునే సమయం: ఉదయం సర్జరీ చేయించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోవచ్చు. ఎంతో అరుదుగా 2 నుంచి 3 శాతం మందికి ఈ సర్జరీ విఫలమవుతూ ఉంటుంది.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది.

డాక్టర్ వెంకటేష్ బాబు
ప్లాస్టిక్ రికన్‌స్ట్రక్టివ్ అండ్ ఈస్థటిక్ సర్జన్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైదరాబాద్.



విల్లు లాంటి కనుబొమలు

కొందరికి కనురెప్పలు విపరీతంగా జారిపోయి, కళ్లకు అడ్డుపడుతూ ఉంటాయి. ఇంకొందరి కనుబొమల దగ్గర మీద విపరీతంగా ముడతలు ఏర్పడతాయి. ఈ రెండు సమస్యలకూ సర్జరీని ఆశ్రయించవచ్చు.

దిద్దుబాటు ఇలా: కనుబొమల అడుగు కణజాలపు పొరను పైకి లాగి బిగించడం జరుగుతుంది. కోత కనిపించని ఈ సర్జరీతో 15 నుంచి 20 ఏళ్ల క్రితం కనుబొమలు ఏ స్థానంలో ఉండేవో, ఆ స్థానంలోకి చేర్చడం జరుగుతుంది.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 10 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. సమస్య స్వల్పంగా ఉన్నప్పుడు ఫిల్లర్స్‌తో సరిదిద్దుకోవచ్చు. దీంతో ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

జారిపడే కనురెప్పలు

పైకనురెప్పల మీద ముడతలు ఏర్పడి కిందకు జారిపడిపోయినప్పుడు, 'బ్లెఫరోప్లాస్టీ'తో సరిదిద్దవచ్చు. కింది కనురెప్ప దిగువన ఏర్పడే ఉబ్బు, గుంతలకు వేర్వేరు చికిత్సలుంటాయి.

దిద్దుబాటు ఇలా: కనురెప్పల మీద ముడతల రూపంలో ఉండే అదనపు చర్మాన్ని, కొవ్వునూ తొలగించి, చర్మాన్ని పైకి లాగి కుట్టేస్తారు. కంటి దిగువన గుంతలను ఫిల్లర్స్‌తో చక్కదిద్దవచ్చు. కళ్ల కింద ఉబ్బు ఉన్నప్పుడు అదనపు కొవ్వును తొలగించడం, లేదా సరైన స్థానంలో అమర్చడం చేస్తారు.

కోలుకునే సమయం: మూడు రోజుల్లో కోలుకుంటారు. 7 నుంచి 14 రోజుల పాటు వాపు ఉండొచ్చు.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. ఫిల్లర్స్‌తో సరిదిద్దినప్పుడు, ఫలితం 6 నెలల పాటు ఉంటుంది.

కోటేరు ముక్కు కోసం...

ముక్కు కిందకు వంగిపోవడం, ముక్కు మొన పదునుగా లేకుండా గుండ్రంగా ఉండడం, ముక్కుపుటాలు లావుగా ఉండడం, వంకరగా ఉండడం లాంటి ఇబ్బందులను రైనోప్లాస్టీతో సరిదిద్దుకోవచ్చు.

దిద్దుబాటు ఇలా: ముక్కు దూలాన్ని కత్తిరించి, సరైన ఆకారంలో మలచడం, వేరే ప్రదేశం నుంచి ఎముకను సేకరించి ముక్కును పదునుగా మార్చడం

కోలుకునే సమయం: మృదులాస్థిని మాత్రమే సరిదిద్ది ముక్కును సరి చేసినప్పుడు, వారం నుంచి పది రోజుల్లో పూర్తిగా కోలుకుంటారు. ఎముక ప్రమేయం ఉన్నప్పుడు 15 నుంచి 20 రోజులు పట్టొచ్చు. ఈ రెండు సందర్భాల్లో మూడు రోజుల్లోనే కోలుకున్నా, వారం పాటు వాపు కొనసాగుతుంది.

ఫలితం: రెనోప్లాస్టీతో శాశ్వత ఫలితం దక్కుతుంది. స్వల్ప దిద్దుబాట్ల కోసం ఎంచుకునే థ్రెడ్ లిఫ్ట్, ఫిల్లర్స్ ఫలితం ఏడాది పాటే ఉంటుంది.

దవడ వెడల్పుగా ఉంటే...

కొందరికి దవడ కండరాలు పెద్దవిగా ఉంటాయి. ఇంకొందరి దవడ నిర్మాణంలో లోపాలుంటాయి. వీటిని వేర్వేరు చికిత్సలతో సరిచేసుకోవచ్చు.

దిద్దుబాటు ఇలా: కింది దవడ మరీ వెనకకూ లేదా ముందుకూ ఉన్నప్పుడు ఎముకను కత్తిరించి సరిదిద్దవలసి ఉంటుంది. దవడ కండరాలు వెడల్పుగా ఉండడం వల్ల దవడలు వెడల్పుగా కనిపిస్తున్నప్పుడు, ఆరు నెలలకోసారి ఒక ఇంజక్షన్ చొప్పున, 3 నుంచి నాలుగు బొటాక్స్ ఇంజక్షన్లతో దవడ కండరం కుంచించుకుపోయేలా చేసి దవడకు చక్కని ఆకృతి తీసుకురావచ్చు.

కోలుకునే సమయం: కోలుకునే సమయం సర్జరీ తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. ఇంప్లాంట్ అమర్చినప్పుడు 2, 3 రోజుల్లో కోలుకోవచ్చు. ఎముక ప్రమేయం ఉంటే 2 నుంచి 3 వారాల సమయం పడుతుంది.

ఫలితం: సర్జరీతో ఫలితం 10 నుంచి 15 ఏళ్ల పాటు ఉంటుంది. బొటాక్స్‌తో దవడల్లో శాశ్వతమైన మార్పు సాధ్యపడుతుంది.

అధ్యయనం

అధిక బరువుకు అదే కారణం

ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గకపోవడానికి కారణం మన కొవ్వు కణాల్లో ఉంటుంది. కొవ్వు కణాలు ఒబేసిటీకి సంబంధించిన జ్ఞాపకాన్ని కలిగి ఉంటాయని ఒక తాజా అధ్యయనంలో వెల్లడైంది.

బరువు తగ్గడం ఒక ఎత్తైతే, తగ్గిన బరువును కొనసాగించడం మరొక ఎత్తు. అధిక బరువు అదుపు ఎందుకింత సమస్యగా మారుతుందో కనిపెట్టడం కోసం పరిశోధకులు అధ్యయనాలు చేపట్టారు. కొవ్వు కణాలు జ్ఞాపకశక్తిని కలిగి ఉంటాయనీ, కష్టపడి బరువు తగ్గినా, మళ్లీ బరువును పెంచేస్తూ ఉంటాయనీ. ఫలితంగా తగ్గిన బరువును కొనసాగించడం కష్టంగా మారుతుందనీ ఆ అధ్యయనంలో పరిశోధకులు కనిపెట్టారు. అలాగే అధిక బరువు, జన్యువుల పనితీరు మీద ప్రభావం చూపించే రసాయన మార్కర్లలో మార్పులకు కారణమవుతుంది. ఈ మార్పుల వల్ల కొవ్వు కణాల పనితీరు క్రమం తప్పుతుంది. దాంతో కష్టపడి బరువు తగ్గినా, మునుపటి బరువుకు చేరుకునేలా కొవ్వు కణాలు స్పందిస్తాయి. అధిక బరువును కలిగి ఉన్న వ్యక్తులు, సాధారణ వ్యక్తుల నుంచి సేకరించిన కొవ్వు కణజాలాన్ని అధ్యయనం చేసినప్పుడు, ఆ రెండు కోవలకు చెందిన వ్యక్తుల్లో జన్యు కార్యకలాపాలు భిన్నంగా ఉన్నట్టు పరిశోధకులు కనిపెట్టారు. అధిక బరువు కలిగిన వాళ్లలో, ఇన్‌ఫ్లమేషన్ సంబంధిత జన్యువులు మరింత చురుగ్గా ఉన్నట్టు తేలింది. ఫలితంగా తేలికగా బరువు పెరగడం, పెరిగిన బరువును కోల్పోవడం కష్టతరం కావడం, కష్టపడి కోల్పోయిన బరువు తిరిగి పెరిగిపోవడం లాంటి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ కోవకు చెందిన వ్యక్తులు తగ్గిన బరువును కొనసాగించడం కోసం క్రమం తప్పక వ్యాయామం, ఆహార నియమాలు పాటించక తప్పదని పరిశోధకులు



ఆయుర్వేదం

పాదాలకు మర్దన మంచిదే!

నిద్రకు ముందు నూనెతో పాదాలకు మర్దన చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందే వీలుంది. అవేంటంటే...

నూనెతో పాదాలకు మర్దన చేయడాన్ని ఆయుర్వేదంలో 'పాద అభ్యంగనం' అంటారు. ఇలా పాదాలను మర్దించడం వల్ల శక్తి ప్రవాహం ఊపందుకుని, శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాలు సంతులనమవుతాయి. పాద అభ్యంగనంతో ప్రయోజనాలు ఇవే...



- పాద మర్దన కోసం నువ్వుల నూనె, ఆవ నూనె, కొబ్బరి నూనె, బాదం నూనెలను వాడుకోవచ్చు
- శరీర శక్తిని సంతులనం చేసే ప్రదేశాలు ప్రేరేపితమవుతాయి. ఫలితంగా శరీరం సేద తీరుతుంది
- ఒత్తిడి, కంటి నిండా నిద్ర పడుతుంది
- నాడీ వ్యవస్థ నెమ్మదిస్తుంది. రక్త ప్రసరణ మెరుగై వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది
- పగుళ్లు వదిలిపోయి, పాదాలు కోమలంగా మారతాయి
- రోజంతా శరీర బరువును మోస్తూ అలసిన పాదాల్లోని కండరాలు సేద తీరతాయి
- బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా ఉంటాయి
- నువ్వులు, లేదా కొబ్బరి నూనెలతో మర్దన చేయడం వల్ల కీళ్లనొప్పి తగ్గుతుంది.

పిసిఒడికి అడ్డుకట్ట పిండ దశ నుంచే..

టీనేజీ మొదలు పెళ్లీడు వయసు వరకూ యువతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పిసిఒడి (పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్). అంతర్గతంగా ఆరోగ్యాన్ని హరిస్తూ, దీర్ఘకాల రుగ్మతలకు దారి తీసే ఈ సమస్యకు అడ్డుకట్ట వేయడం సులభమే అంటున్నారు వైద్యులు.



వ్యాయామం లేకపోవడం, కొవ్వులతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వృత్తి, విద్యాపరమైన ఒత్తిళ్లు, పర్యావరణ ప్రభావాలు ఇవన్నీ కలగలిసి, పిసిఒడి సమస్యను విపరీతంగా పెంచేస్తున్నాయి. గతంలో ఈ సమస్య 5% అమ్మాయిల్లో ఉంటే, ఇప్పుడు 20 నుంచి 30% అమ్మాయిల్లో ఈ సమస్య కనిపిస్తోంది. అలాగని ఈ సమస్యకు మూలాలు గతి తప్పిన మన జీవనశైలిలోనే ఉన్నాయనుకుంటే పొరపాటు. గర్భంలో పిండదశలో ఉన్నప్పుడు మొదలు, పుట్టిన తర్వాత పెరిగే క్రమంలో జరిగే పొరపాట్లు, అలవాట్లలో కూడా పిసిఒడి మూలాలు దాగి ఉంటాయి.

గర్భంలోనే బీజాలు

గర్భిణులు తనతో పాటు గర్భంలో పెరిగే బిడ్డతో కలిపి ఇద్దరికి సరిపడా ఆహారం తినాలనే నమ్మకం సర్వత్రా స్థిరపడిపోయింది. దాంతో గర్భిణులు నచ్చిన ఆహార పదార్థాలను పరిమితం లేకుండా తినేస్తూ ఉంటారు. అవి తీపి పదార్థాలు కావచ్చు, జంక్ ఫుడ్ కావచ్చు, నూనెలో వేయించిన పదార్థాలు కావచ్చు. కానీ నిజానికి ఇలాంటి ఆహార స్వేచ్ఛ వల్ల గర్భిణితో పాటు కడుపులో పెరిగే బిడ్డ బరువులు పెరిగిపోతాయి. ఫలితంగా పుట్టబోయే ఆడపిల్ల భవిష్యత్తులో పిసిఒడి బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. నాలుగు కిలోల బరువుతో బిడ్డ పుడితే తల్లులు పొంగిపోతూ ఉంటారు. కానీ పుట్టినప్పుడు నాలుగు కిలోల మేరకు బరువున్న పిల్లల్లో భవిష్యత్తులో పిసిఒడితో పాటు మధుమేహం, అధిక రక్తపోటు మొదలైన జీవనశైలి సంబంధిత రుగ్మతల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే గర్భిణి సమతులాహారం తీసుకుంటూ, కొవ్వు పదార్థాలకు, చక్కెర, జంక్ ఫుడ్‌కూ దూరంగా ఉండాలి.

బాల్యంలో తీపి వద్దు

పిల్లలు తీపికి త్వరగా ఆకర్షితులవుతారు. తల్లి దగ్గర పాలు తగ్గిపోయినప్పుడు పోత పాలు పట్టిస్తూ ఉంటాం. ఆ పాలను తాగడానికి బిడ్డ అయిష్టత ప్రదర్శించినప్పుడు, వాటిలో కాస్త చక్కెర కలిపి పట్టించేస్తూ ఉంటారు. ఇలా పసి వయసులోనే చక్కెర రుచిని అలవాటు చేయడం సరి కాదు. పిల్లలకు చాక్లెట్లు, కేకులు, శీతల పానీయాలను అలవాటు చేయకూడదు. తీపి కోసం పండ్లు ఇవ్వొచ్చు. పండ్ల రసాలకు బదులుగా కొబ్బరి నీళ్లు అలవాటు చేయాలి. పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లు తినడం అలవాటు చేయాలి.

ఈ లక్షణాలు గమనించాలి

- శరీరంలో పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ పెరగడం
- శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరగడం
- మధుమేహం సూచనలు కనిపించడం (మెడ వెనక నలుపు)
- నెలసరిలో అవకతవకలు
- మానసిక కుంగుబాటు, ఆందోళన

అధిక బరువు, పిసిఒడి

అధిక బరువు, పిసిఒడిలకు అవినాభావ సంబంధం ఉంటుంది. పిసిఒడి మూలంగా బరువు పెరిగిపోవడం, అధిక బరువు మూలంగా పిసిఒడి బారిన పడడం సర్వసాధారణం. కాబట్టి బరువును అదుపులో పెట్టుకోవడంతో పాటు పెరిగిన బరువును ఆరోగ్యకరమైన అలవాట్లతో తగ్గించుకోగలిగితే పిసిఒడి ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. పిసిఒడి సమస్యను ప్రారంభంలో గుర్తించడం కోసం మొదటి నెలసరి కనిపించినప్పటి నుంచి ఆడపిల్లల ఆరోగ్యం మీద ఓ కన్నేసి ఉంచాలి. మొదటి మూడేళ్ల వరకూ నెలసరి అస్తవ్యస్తంగా ఉండడం సహజమే! ఆ తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగినా, శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతున్నా, మొటిమలు ఎక్కువగా వేధిస్తున్నా పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలి.

చికిత్స ఇలా...

ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడమే పిసిఒడి ప్రధాన చికిత్స. ఈ మార్పులు లేని పిసిఒడి చికిత్స ఫలితాన్నివ్వదు. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం గంట పాటు వ్యాయామం చేయడం, జంక్ ఫుడ్ మానేయడం తప్పనిసరి. ఒకవేళ పిసిఒడి వల్ల శరీరంలో టెస్టోస్టిరాన్ విపరీతంగా పెరిగిపోయినా, శరీరం మీద వెంట్రుకలు ఎక్కువగా పెరిగిపోతున్నా, పిసిఒడి, గర్భధారణకు అడ్డంకిగా మారేంత తీవ్ర దశకు చేరుకున్నా, అదనంగా మందులు వాడుకోవలసి ఉంటుంది. నెలసరి వస్తోంది కాబట్టి పిసిఒడిని పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు అనే భావనలో ఉండిపోయే వాళ్లూ ఉన్నారు. కానీ ఈ సమస్యతో గర్భం దాల్చినప్పుడు మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. వీటితో గర్భాన్ని కొనసాగించడం ఇబ్బందికరంగా మారుతుంది. నెలసరి అవకతవకలను దీర్ఘకాలం పాటు నిర్లక్ష్యం చేయడం వల్ల ఆ ప్రభావం గుండె మీద పడుతుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ నిరంతరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ పరిస్థితి అంతర్గత అవయవాలన్నిటికీ హానికరమే!



డాక్టర్ ఎ. మహిత రెడ్డి
అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్,
అపోలో క్రేడిల్, హైదరాబాద్.

పోషక నిలయాలు

పండ్లలో మాంసకృత్తులు

శాకాహారులకు మాంసకృత్తుల కొరత కొంత ఎక్కువే! అయితే ఆ లోటును భర్తీ చేసే పండ్లు కూడా కొన్ని ఉన్నాయి. అవేంటంటే....



- **జామ:** కప్పు జామ ముక్కల్లో 4.2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. జామలో విటమిన్ సి, పీచు కూడా ఎక్కువే కాబట్టి, జామ పండు క్రమం తప్పకుండా తింటూ ఉండాలి.
- **అవకాడో:** కప్పు అవకాడో ముక్కల్లో 3 గ్రాముల మాంసకృత్తులుంటాయి. గుండె, మెదడుకు అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా దీన్లో ఉంటాయి.
- **బ్లాక్‌బెర్రీ:** కప్పు బెర్రీల్లో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. అదనంగా యాంటీఆక్సిడెంట్లు, పీచు విటమిన్లు కలిగి ఉండే బ్లాక్‌బెర్రీ తరచూ తింటూ ఉండాలి.
- **అప్రికాట్:** ఒక పండులో 0.5 గ్రాముల మాంసకృత్తులుంటాయి. పావు కప్పు ఎండు అప్రికాట్స్‌లో ఎక్కువ మోతాదులో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి.
- **కివి:** కప్పు కివి ముక్కల్లో 2 గ్రాముల మాంసకృత్తులుంటాయి. విటమిన్ సితో పాటు సహజసిద్ధ ఎంజైమ్స్‌ను కూడా కలిగి ఉండే కివి తినడం వల్ల జీర్ణశక్తి మెరుగు పడుతుంది.
- **అరటిపండు:** ఒక అరటిపండులో 1.3 గ్రాముల మాంసకృత్తులుంటాయి. పొటాషియం సమృద్ధిగా కలిగి ఉండే అరటిపండు తక్షణ శక్తినిస్తుంది.
- **పనస:** కప్పు పనస తొనల్లో 3 గ్రాముల మాంసకృత్తులుంటాయి.

అవగాహన

నిద్రకు ముందు చక్కెర వద్దు

భోజనం తర్వాత తీపి తినే అలవాటుంటే, రాత్రి భోజనం సమయంలో ఆ అలవాటుకు స్వస్తి పలకాలి. రాత్రి తినే తీపితో కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలుంటాయి. అవేంటో తెలుసుకుందాం!



- తీపి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచుతుంది. దాంతో రాత్రి వేళ తరచూ నిద్రాభంగం కలుగుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే రాత్రి తీపి తినడం మానేయాలి
- రాత్రి వేళ తీపి మానేస్తే, మరుసటి ఉదయం శరీరం మరింత చురుకుదనం పొందుతుంది
- రాత్రి వేళ తీపి తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మీద అదనపు భారం పడుతుంది. కణ మరమ్మతుతో పాటు, విషాలను శరీరం నుంచి వెళ్లగొట్టే అవకాశాన్ని శరీరానికి కల్పించాలంటే నిద్రకు ముందు తీపి తినడం మానుకోవాలి
- అదనపు క్యాలరీలు తగ్గి బరువు పెరిగే ముప్పు తప్పుతుంది
- చక్కెర హార్మోన్ల మీద ఎక్కువ. తీపి మానేస్తే, హార్మోన్ల అసమతౌల్యం సమస్య తొలగిపోతుంది.

లేహ్‌లో అమర రాజా ఇన్‌ఫ్రా గ్రీన్ హైడ్రోజన్ స్టేషన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఇన్‌ఫ్రా మరో ఘనత సాధించింది. లద్దాఖ్‌లోని అత్యంత శీతల ప్రాంతం 'లేహ్' వద్ద ఎన్‌టీపీసీ కోసం హరిత ఉదజని (గ్రీన్ హైడ్రోజన్) ఫ్యూయల్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసింది. లేహ్‌లో ఇదే తొలి హరిత ఉదజని ఫ్యూయల్ స్టేషన్ అని అమర రాజా ఇన్‌ఫ్రా తెలిపింది. సముద్ర మట్టానికి 3,400 ఎత్తున మైనస్ 25-30 డిగ్రీల శీతల వాతావరణాన్ని తట్టుకుని రెండేళ్లలో ఈ ఫ్యూయల్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసినట్టు పేర్కొంది. రోజుకు 80 కిలోల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌లో ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్‌ను ఎన్‌టీపీసీ రోజూ ఐదు బస్సులకు సరఫరా చేస్తుంది.

భారత్‌లో రూ.84,310 కోట్ల విలువైన

ఐఫోన్ల అసెంబ్లింగ్

న్యూఢిల్లీ: భారత్‌లో అసెంబ్లింగ్ చేసే యాపిల్ ఐఫోన్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరు మధ్య కాలంలో మన దేశంలో ఫ్యాక్టరీ గేటు ధర ప్రకారం 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.84,310 కోట్లు) విలువైన ఐఫోన్ల అసెంబ్లింగ్ జరిగింది. అమ్మకాలు, పంపిణీ, మార్కెటింగ్, లాభాలు, లాజిస్టిక్ ఖర్చులు కూడా కలిపితే ఈ ఐఫోన్ల విలువ 1,500 కోట్ల డాలర్ల వరకు ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇందులో 700 కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్.. భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రస్తుతం నెలకు 200 కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లు మన దేశంలో అసెంబ్లింగ్ అవుతున్నాయి.

మహానందమయం

993 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

మళ్లీ 80,000 ఎగువకు సూచీ

24,000పైకి నిఫ్టీ.. 315 పాయింట్లు అప్

2 రోజుల్లో రూ.14.20 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వ మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంతో స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడంతో సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మళ్లీ 80,000 ఎగువకు చేరింది. నిఫ్టీ 24,000 మైలురాయిని దాటేసింది. సెన్సెక్స్ ఒక దశలో 1,355.97 పాయింట్ల (1.71 శాతం) వృద్ధితో 80,473.08 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 992.74 పాయింట్ల (1.25 శాతం) లాభంతో 80,109.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 314.65 పాయింట్లు (1.32 శాతం) బలపడి 24,221.90 వద్ద ముగిసింది. ప్రామాణిక సూచీలు భారీగా లాభపడటం వరుసగా ఇది రెండో రోజు. గత శుక్రవారం సెన్సెక్స్ 1,961 పాయింట్లు, నిఫ్టీ 557 పాయింట్లు పెరిగాయి. గడిచిన రెండు సెషన్లలో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14.20 లక్షల కోట్లు పెరిగి రూ.439.58 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 రాణించాయి. బీఎస్ఈలో 4,214 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,675 లాభపడ్డాయి. 1,389 కంపెనీల షేర్లు నష్టపోగా.. 150 యథాతథంగా ముగిశాయి. 206 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠానికి ఎగబాకగా.. 415 అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

5 అదానీ షేర్లు డౌన్

మార్కెట్ జోరు మీదున్నప్పటికీ అదానీ గ్రూప్‌లోని 5 కంపెనీల షేర్లు నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ మరో 8.05 శాతం క్షీణించగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 3.78 శాతం, అదానీ పవర్ 3.02 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.43 శాతం, ఎన్‌డీటీవీ 2.07 శాతం నష్టపోయాయి. కాగా, అదానీ పోర్ట్స్ 2.55 శాతం, ఏసీసీ 2.54 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.26 శాతం, అదానీ విల్మర్ 1.81 శాతం, అంబుజా సిమెంట్స్ 0.88 శాతం పెరిగాయి.

విదేశీ ఇన్వెస్టర్ల రీఎంట్రీ

ఒక్కరోజే రూ.9,948 కోట్ల నికర కొనుగోళ్లు

వరుసగా 38 ట్రేడింగ్ సెషన్ల పాటు భారత స్టాక్ మార్కెట్లో భారీగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మళ్లీ కొనుగోళ్లు మొదలుపెట్టారు. ఎన్ఎస్ఈ ప్రాథమిక సమాచారం ప్రకారం... సోమవారం ఎఫ్ఐఐలు మన ఈక్విటీ మార్కెట్లో రూ.9,948 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. కాగా, 13 సెషన్లుగా భారీగా కొనుగోళ్లు జరిపిన దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) మాత్రం లాభాలు స్వీకరించారు. డీఐఐలు నికరంగా రూ.6,908 కోట్ల షేర్లను విక్రయించారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్ఐఐలు మన మార్కెట్ నుంచి నికరంగా రూ.2.84 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అక్టోబరు ఆరంభం నుంచి గత వారం చివరి వరకు (7 వారాల్లో) ఎఫ్ఐఐలు రూ.1.55 లక్షల కోట్ల అమ్మకాలు జరిపారు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు డీఐఐలు నికరంగా రూ.5.56 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు.

మరింత కఠినంగా సూక్ష్మ రుణాలు

జనవరి 1 నుంచే అమలు

ముంబై: సూక్ష్మ రుణ పరపతి సంస్థలు (ఎంఎఫ్ఐ) అల్పాదాయ వర్గాలకు ఇచ్చే సూక్ష్మ రుణాల నిబంధనలు మరింత కఠినం కానున్నాయి. దీనికి సంబంధించి ఈ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే మైక్రోఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్స్ నెట్‌వర్క్ (ఎంఎఫ్ఐఎన్) సోమవారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచే ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ రుణ సంస్థల ఆగడాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనేక సార్లు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఎంఎఫ్ఐఎన్ ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఇక ఏ వ్యక్తీ, మూడు కంటే ఎక్కువ సూక్ష్మ రుణ సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు వీల్లేదు. రుణ పరిమితి కూడా రూ.2 లక్షలు మించరాదని ఎంఎఫ్ఐఎన్ స్పష్టం చేసింది. ఒక వ్యక్తి చెల్లించాల్సిన సూక్ష్మ రుణ బకాయిలు 60 రోజుల్లోగా వసూలు కాకపోతే ఆ ఖాతాను ఇక మొండి బకాయి (ఎన్‌పీఏ)గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈ గడువు 90 రోజులుగా ఉంది. ఎన్‌పీఏగా మారిన రుణ ఖాతాదారులకు ఇక ఏ సూక్ష్మ రుణ సంస్థా కొత్త అప్పులు ఇవ్వవని కూడా ఎంఎఫ్ఐఎన్ స్పష్టం చేసింది.

మారుతి సుజుకీ 30 లక్షల కార్ల ఎగుమతులు

2031 నాటికి మరో 7.5 లక్షల కార్ల ఎగుమతి

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఎగుమతులపై మరింత దృష్టి పెడుతోంది. గత ఆర్థిక సంవత్సరం ఎంఎస్ఐ 2.83 లక్షల కార్లను ఎగుమతి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్-అక్టోబరు మధ్య కాలంలో 1,81,444 కార్లను ఎగుమతి చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువని కంపెనీ ఎండీ, సీఈఓ హిసాషి టకెయుచీ తెలిపారు. 2031 నాటికి తమ వార్షిక ఎగుమతులు 7.5 లక్షల యూనిట్లకు చేరతాయని తెలిపారు. కాగా 1986 నుంచి ఇప్పటి వరకు 100కుపైగా దేశాలకు 30 లక్షల కార్లను ఎగుమతి చేసినట్టు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం భారత్ నుంచి ఎగుమతవుతున్న కార్లలో 40 శాతం వాటా తమదేనన్నారు. మేకిన్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా తాము ఈ ఎగుమతులను చేపట్టినట్లు హిసాషి తెలిపారు.

2030 నాటికి సీకేడీ కార్ల ఎగుమతులు రెండింతలు

కియ ఇండియా టార్గెట్



పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): భారత్ నుంచి కంప్లీట్లీ నాక్డ్ డౌన్ (సీకేడీ) కార్ల ఎగుమతులను 2030 నాటికి రెండింతలు పెంచుకోవాలని కియ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా పశ్చిమాసియా, ఆఫ్రికా మార్కెట్లపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించింది. కాగా 2020లో ఆంధ్రప్రదేశ్, అనంతపురం ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు లక్ష సీకేడీ యూనిట్లను ఎగుమతి చేసినట్లు కియ ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ జున్సు చో తెలిపారు. లక్ష యూనిట్లను ఎగుమతి చేసిన సందర్భంగా సోమవారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలోని కియ ప్లాంట్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీకేడీ యూనిట్ల ఎగుమతుల్లో కియ ఇండియా వాటా 50 శాతంగా ఉందని జున్సు తెలిపారు. ఈ ఏడాది ఉజ్బెకిస్తాన్, ఈక్వెడార్, వియత్నాం మార్కెట్లకు 38,000 సీకేడీ యూనిట్లను ఎగుమతి చేయాలని భావిస్తోందన్నారు.

లంచం ఆరోపణల కేసు తేలేవరకు

అదానీలో కొత్త పెట్టుబడులు పెట్టం..

స్పష్టం చేసిన టోటల్‌ఎనర్జీస్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన లంచం ఆరోపణల కేసు తేలేవరకు అదానీ గ్రూప్ కంపెనీల్లో కొత్త పెట్టుబడులు పెట్టబోమని ఫ్రాన్స్ ఇంధన దిగ్గజం టోటల్‌ఎనర్జీస్ సోమవారం స్పష్టం చేసింది. ఈ ఆరోపణల గురించి తమకు ముందుగా అవగాహన లేదన్నది. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన అతి పెద్ద విదేశీ ఇన్వెస్టర్లలో టోటల్‌ఎనర్జీస్ ఒకటి. సిటీ గ్యాస్ సరఫరా కంపెనీ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్‌తో పాటు పునరుత్పాదక ఇంధన సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో టోటల్‌ఎనర్జీస్ గతంలోనే వాటాలు కొనుగోలు చేసింది.

అదానీ కంపెనీల్లో పెట్టుబడులు కొనసాగిస్తాం: జీక్యూజీ

ప్రవాస భారతీయ ఇన్వెస్టర్ రాజీవ్ జైన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్.. అదానీ గ్రూప్ కంపెనీల భవిష్యత్‌పై తనకున్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించింది. అదానీ కంపెనీ షేర్లలో తమ పెట్టుబడులను విక్రయించబోమని సోమవారం విడుదల చేసిన ఐదు పేజీల ప్రకటనలో స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ వివాదం అనంతర కాలంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటాలు కొనుగోలు చేసింది.

వ్యాపార వృద్ధికి విదేశీ రుణాల అవసరం లేదు: అదానీ

ఆర్థికంగా బలంగానే ఉన్నామని, విదేశాల నుంచి రుణాలు సేకరించాల్సిన అవసరం లేకుండానే వ్యాపార వృద్ధిని కదం తొక్కించగలమని అదానీ గ్రూప్ ధీమా వ్యక్తం చేసింది. రుణాలు తిరిగి చెల్లించడంతో పాటు వ్యాపార వృద్ధికి సరిపడా నగదు నిల్వలున్నాయని, కంపెనీలు మెరుగైన లాభాలను ఆర్జిస్తున్నాయంటూ ఇన్వెస్టర్ ప్రజెంటేషన్‌లో గ్రూప్ పేర్కొంది. అమెరికాలో గ్రూప్ చైర్మన్‌పై నేరాభియోగాలు నమోదైనప్పటికీ కంపెనీ వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా సాగుతున్నాయంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,550 ▼	72,000 ▼	1,00,500 ▼
ముంబై	77,081 ▼	70,606 ▼	89,445 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	595
వరంగల్	587	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	103
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	82
కర్నూలు	107	నెల్లూరు	82
విశాఖపట్నం	120	అనంతపురం	82
గోదావరి	103		

● **లీ హెల్త్ నుంచి వి-ఫెరిన్**

హైదరాబాద్‌కు చెందిన లీ హెల్త్ డొమైన్.. మహిళల్లో వచ్చే జననేంద్రియ ఇన్ఫెక్షన్ల చికిత్సకు 'వి-ఫెరిన్' పేరుతో ప్రొబయోటిక్ సప్లిమెంట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. లాక్టోఫెర్రిన్ పెప్టైడ్, క్రాన్‌బెర్రీ పండ్లతో ప్రీ-ప్రొబయోటిక్స్ లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ మిశ్రమాలతో ఈ క్యాప్సూల్స్‌ను రూపొందించినట్లు తెలిపింది.

ఫైబర్ టెక్‌లో లక్షకు పైగా కొలువులు: టీమ్‌లీజ్

ముంబై: ఫైబర్ కేబుల్ రంగంలోనూ పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో ఎంత లేదన్నా లక్షకు పైగా కొత్త కొలువులు ఏర్పడతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా. ఇప్పటికే ఈ రంగంలో ఐదు లక్షల మంది పని చేస్తున్నారు. దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న బ్రాడ్‌బ్యాండ్, 5జీ నెట్‌వర్క్‌ల విస్తరణ ఇందుకు దోహదం చేస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ అధికారి (సీఎస్ఓ) పీ సుబ్బురతినం తెలిపారు. ప్రస్తుతం 4,861 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.4.09 లక్షల కోట్లు) ఉన్న దేశీయ టెలికాం పరిశ్రమ 2029 నాటికి 7,616 కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందని కూడా టీమ్‌లీజ్ అంచనా వేసింది. కంపెనీలు, ప్రభుత్వం ఫైబర్ మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి పెట్టడంతో ఫైబర్ టెక్నీషియన్లకూ డిమాండ్ పెరిగింది.

7.1 శాతం పెరగనున్న ఉద్యోగులు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో అర్ధ భాగం కొలువుల మార్కెట్‌కు బాగానే కలిసి రానుంది. 2024 అక్టోబరు- 2025 మార్చి మధ్య కాలంలో నియామకాలు 7.1 శాతం పెరగనున్నాయి. లాజిస్టిక్స్, ఈ-కామర్స్, తయారీ రంగాల్లో ఈ ఆరు నెలల్లో నియామకాలు జోరందుకుంటాయని టీమ్‌లీజ్ తెలిపింది.

నవ్య | చిత్రజ్యోతి

వేసవికి వస్తున్న 'కన్నప్ప'



డాక్టర్ మోహన్‌బాబు భారీ వ్యయంతో నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం రిలీజ్ డేట్ ప్రకటించారు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల చేయనున్నారు. ఉజ్జయినీ మహాకాళేశ్వర్ దేవాలయాన్ని సందర్శించిన 'కన్నప్ప' టీమ్ అక్కడే విడుదల తేదీ వెల్లడించింది. ఈ సినిమా విడుదల లోపు పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శిస్తామని విష్ణు ఇంతకుముందే వెల్లడించారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'కన్నప్ప' చిత్రంలోని మేజర్ పార్ట్‌ను న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇచ్చే విధంగా తయారవుతున్న ఈ సినిమాలో మహాదేవ శాస్త్రిగా మోహన్‌బాబు ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు.

ఎనిమిది గంటల పెళ్లి



నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల డిసెంబరు 4న ఒక ఇంటివారవుతున్న సంగతి తెలిసిందే. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న వీరి వివాహం పూర్తిగా బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం దాదాపు ఎనిమిది గంటల పాటు జరగనుందట. శోభిత తల్లితండ్రుల కోరిక మేరకే ఈ పద్ధతిలో వీరి పెళ్లి జరుగుతోందని తెలిసింది. డిసెంబరు 4న రాత్రి 8:13 నిమిషాలకు పెళ్లి ముహూర్తాన్ని నిశ్చయించారని తెలుస్తోంది. నయనతార, విఘ్నేశ్ శివన్‌ల మాదిరిగానే వీరి పెళ్లి స్ట్రీమింగ్ హక్కులనూ ఓ ఓటీటీ సంస్థకు ఇస్తున్నారట. కాగా, ఇటీవలే జరిగిన నాగచైతన్య పుట్టినరోజు వేడుకల్లో శోభిత పాల్గొన్న ఫొటోలను సుశాంత్ షేర్ చేశారు.

సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్



'సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా ఉంది. కంటెంట్ కూడా ఆసక్తికరంగా ఉంది. ఇటువంటి చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్న దర్శకనిర్మాత వడ్లపట్ల మోహన్‌ను అభినందిస్తున్నా' అని అన్నారు. ఇండియన్ మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్(ఐఎంపీపీఏ) వైస్ ప్రెసిడెంట్ అతుల్. దర్శకనిర్మాత వడ్లపట్ల మోహన్ తెరకెక్కించిన 'ఎంఫోర్ఎం' చిత్రం హిందీ ట్రైలర్‌ను గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ఇఫ్ఫి కళా అకాడమీ వేదికపై అతుల్ రిలీజ్ చేశారు. చిత్ర హీరోయిన్ జో శర్మ మాట్లాడుతూ 'సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ కొత్తగా, చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది' అని అన్నారు. దర్శక నిర్మాత వడ్లపట్ల మోహన్ మాట్లాడుతూ 'మోటివ్ ఫర్ మర్డర్ తెలిసినప్పుడు మైండ్ బ్లో అవుతుంది. అనూహ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాను. త్వరలో ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం' అని అన్నారు.

ఆ కామెంట్స్ చాలా ఇబ్బంది పెట్టాయి



అటు వెబ్ సిరీస్‌లు.. ఇటు సినిమాలతో దూసుకుపోతున్నారు బాలీవుడ్ నటి అనన్యా పాండే. 'లైగర్' చిత్రంతో తెలుగువారికి సుపరిచితమైన అనన్య.. ఇటీవల ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో 'వియ్ ద విమెన్' ఫెస్టివల్ ఏడవ ఎడిషన్‌లో మాట్లాడారు. అందులో బర్ఖా 'మీకు ఎదురైన అత్యంత ఘోరమైన ట్రోలింగ్ ఏంటి' అని అడిగారు. అనన్య బదులిస్తూ 'ట్రోలింగ్ సమస్య నాకెన్నోసార్లు ఎదురైంది. కెరీర్ ఆరంభంలో ఎన్నో అవమానాలు ఎదురయ్యాయి. సోషల్ మీడియాలో నా పేరుతో ఓ వ్యక్తి ఫేక్ అకౌంట్ తయారు చేసి అందులో నా గురించి లేనిపోనివి రాసేవాడు. అవి చూసిన నేను .. ఈ కాలంలో ఇవన్నీ ఎవరు నమ్ముతారులే అనుకునేదాన్ని, అయితే వాటిని అందరూ గమనిస్తుంటారని తర్వాతే అర్థమైంది. ఒక చిన్న విషయం.. అది అబద్ధమో.. నిజమో తెలిసేలోపు సోషల్ మీడియాలో వైరల్ అయిపోతుంటుంది. అంతేకాకుండా కెరీర్ తొలినాళ్లలో తరచూ నాపై నెగెటివ్ కామెంట్స్ వచ్చేవి. వాటిని మొదట్లో పట్టించుకోకపోయినా కొంతకాలం తర్వాత గుర్తొచ్చి ఇబ్బంది పెట్టేవి. తట్టుకోలేక థెరపీ కూడా తీసుకున్నా. దాంతో నేను బెటర్‌గా ఫీల్ అయ్యేదాన్ని. నా స్కూలింగ్ డేస్‌లో కూడా నన్ను బాడీ షేమింగ్ చేసేవారు' అని చెప్పారు.

డిటెక్టివ్‌గా వెన్నెల కిశోర్



వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటించిన క్రైమ్, కామెడీ థ్రిల్లర్ చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. ఇప్పటికే చిత్రబృందం రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. డిసెంబరు 25న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పోస్టర్‌లో వెన్నెల కిశోర్ షార్ప్ డిటెక్టివ్‌గా కనిపించారు. మూవీలో సీయా గౌతమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, స్నేహ గుప్తా, రవితేజ మహాదాస్యం, బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం సమకూర్చారు.

మానవతా విలువల మాణిక్యం



నంద పెరియసామి దర్శకత్వంలో సముద్రఖని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మిస్టర్ మాణిక్యం'. జీపీ రేఖా రవి కుమార్, చింతా గోపాలకృష్ణారెడ్డి, రాజా సెంథిల్ నిర్మాతలు. 'సీతారామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం డిసెంబరు 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఏషియన్ సునీల్ నారంగ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసి మాట్లాడుతూ 'నిర్మాతల్లో ఒకరైన రవి నాకు మంచి స్నేహితుడు. అతను నిర్మించిన మొదటి సినిమా 'మిస్టర్ మాణిక్యం' ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కంటెంట్‌ని నమ్మి నిర్మించిన సినిమా ఇది. మానవతా విలువలకు పట్టం కట్టే విధంగా ఈ సినిమా కథాంశం ఉంది' అని అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ 'విమానం తర్వాత నేను ప్రధాన పాత్రలో నటించిన సినిమా ఇది. నటుడిగా నాకు మంచి పేరు తెచ్చిన సినిమా 'విమానం'. 'మిస్టర్ మాణిక్యం' అంతకు మించి మంచి పేరు తెస్తుందన్న నమ్మకం ఉంది. మానవతా విలువల ప్రధానాంశంగా రూపొందిన చిత్రమిది' అని తెలిపారు.



ఇన్ ప్రోగ్రెస్

తెలంగాణ సంప్రదాయ నేపథ్యం



సుమన్, మురళీగౌడ్, అన్నపూర్ణ ముఖ్య పాత్రలు పోషించిన 'మన కుటుంబం' చిత్రం ఆడియోను సోమవారం విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి ఆకుల రాఘవ దర్శకుడు. ఆడియో వేడుకలో సుమన్, మురళీగౌడ్, సంగీత దర్శకుడు భానుప్రసాద్, దర్శకుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు. అనుబంధాలు, ఆత్మీయతలు, తెలంగాణ సాంప్రదాయలు కలబోసి చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత హేమలత తెలిపారు.

యాక్షన్ థ్రిల్లర్



స్వీయ దర్శకత్వంలో పూర్వాజ్ హీరోగా నటిస్తున్న సెన్సేషనల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. చేతిలో రివాల్వర్‌తో పూర్వాజ్ కనిపిస్తున్నారు. ప్రతి పోస్టర్‌తో 'కిల్లర్' మూవీ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది.

సీరియస్ కథాంశంతో...



రాజేంద్రప్రసాద్ మనవరాలు సాయి తేజస్విని నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఎర్రచీర - ద బిగినింగ్'. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. ఎన్.వి.వి. సుబ్బారెడ్డితో కలసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ హారర్ యాక్షన్ ఎంటర్‌టైనర్ డిసెంబర్ 20న విడుదలవుతోంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'తొలి తొలి ముద్దు' పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత సుమన్ బాబు మాట్లాడుతూ "సీరియస్ కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది" అని అన్నారు.

సోషల్ డ్రామా



సుమన్‌తేజ్, అనుశ్రీ జంటగా నటిస్తున్న చిత్రం 'వశిష్ఠ'. హరీశ్ చావా దర్శకత్వంలో నేరి నాగేంద్రప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రాన్ని మేకర్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ మాట్లాడుతూ "గ్రామీణ నేపథ్యంలో సాగే సోషల్ డ్రామా ఇది. వినోదాత్మకంగా ఉంటుంది" అని చెప్పారు. "ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే చిత్రమిది" అని నిర్మాత నేరి నాగేంద్రప్రసాద్ అన్నారు.





13 ఏళ్లకే కోటీశ్వరుడు

ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ జాక్‌పాట్ కొట్టాడు. ఈసారి పేరున్న ఆటగాళ్లనే ఎవరూ పట్టించుకోక పోగా.. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతను ఏకంగా రూ.కోటీ 10 లక్షలకు రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. దీంతో ఐపీఎల్ కాంట్రాక్ట్ కుదుర్చుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. అయితే ఢిల్లీ జట్టు కూడా ఈ టీనేజర్ కోసం గట్టిగానే ప్రయత్నించింది. ఎడమచేతి బ్యాటర్ అయిన వైభవ్ ఈ ఏడాదే బిహార్ తరఫున రంజీల్లో అరంగేట్రం చేశాడు. అలాగే అండర్-19 యూత్ టెస్టులో భారత్ తరఫున ఆసీస్‌పై 62 బంతుల్లోనే 104 పరుగులు చేసి వార్తలకెక్కాడు. యూత్ టెస్టుల్లో ఇదే ఫాస్టెస్ట్ కావడం విశేషం. ఇక ఐపీఎల్ బరిలోకి దిగి మరెన్ని రికార్డులు నెలకొల్పుతాడో చూడాలి.

ఐపీఎల్ మెగా వేలం తొలి రోజున దూకుడు కనబర్చిన పది ఫ్రాంచైజీలు సోమవారం మాత్రం ఆచితూచి స్పందించాయి. అన్ని జట్ల పర్స్‌లు అధిక మొత్తంలో ఖాళీ కావడంతో ఏ ఆటగాడు కూడా రూ.11 కోట్లు దాటలేకపోయాడు. ముఖ్యంగా పేసర్లు పండగ చేసుకున్నారు. వెటరన్ భువనేశ్వర్‌కు అత్యధికంగా రూ.10.75 కోట్లు లభించాయి. గాయాలతో ఇబ్బందిపడే దీపక్ చాహర్ సైతం రూ.9.25 కోట్లతో మంచి ధరే పలికాడు. విదేశీ ఆటగాళ్లలో గతేడాది రూ.18.5 కోట్లతో అదరగొట్టిన సామ్ కర్రాన్‌ను కేవలం రూ.2.4 కోట్లకే సీఎస్‌కే తీసుకుంది. మరోవైపు 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కోటీశ్వరుడే కాకుండా.. ఐపీఎల్ ఆడబోతున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు. ఇక ఆయా దేశాల స్టార్ ఆటగాళ్లకు వేలంలో ఈసారి నిరాదరణే ఎదురైంది.



ఆకాశ్‌దీప్

ముగిసిన ఐపీఎల్ మెగా వేలం

పేసర్లకు పండగ

భువనేశ్వర్‌కు రూ.10.75 కోట్లు

దీపక్ చాహర్‌కు రూ.9.25 కోట్లు

ముకేశ్, ఆకాశ్‌లకు చెరో రూ.8 కోట్లు



జెడ్డా: ఐపీఎల్ మెగా వేలం రెండో రోజు కూడా భారత ఆటగాళ్లే ఎక్కువగా లబ్ధి పొందారు. అయితే మొదటి రోజుతో పోలిస్తే సోమవారం ధరల దూకుడు తగ్గింది. అనూహ్యంగా వెటరన్ పేసర్ భువనేశ్వర్ (రూ.10.75 కోట్లు)కు అందరికంటే ఎక్కువ ధర పలికింది. ఆ తర్వాత కూడా వరుసగా పేసర్లే అధిక ధరల రేసులో నిలిచారు. అయితే స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు మాత్రం అంచనాలకు భిన్నంగా తక్కువ ధరే లభించింది. గుజరాత్ అతడిని కేవలం రూ.3.2 కోట్ల ధరకే తీసుకుంది. క్రునాల్ పాండ్యా మాత్రం రూ.5.75 కోట్లకు ఆర్‌సీబీకి ఆడనున్నాడు. మొత్తంగా ఈ మెగా వేలంలో రెండు రోజుల్లో 182 మంది ఆటగాళ్లు కొనుగోలు కాగా ఇందులో 62 మంది విదేశీ ప్లేయర్లున్నారు. వీరి కోసం అన్ని జట్లు రూ.639.15 కోట్ల మొత్తాన్ని వెచ్చించాయి. చెన్నై, గుజరాత్, పంజాబ్ జట్లు గరిష్ఠంగా 25 మంది ఆటగాళ్లను కలిగిఉన్నాయి. ఇక వేలం ముగిశాక ఆర్‌సీబీ దగ్గర అత్యధికంగా రూ.75 లక్షలు మిగిలి ఉండగా సీఎస్‌కే కేవలం రూ. 5 లక్షలు మాత్రమే కలిగి ఉంది.

భళా.. భువీ

సన్‌రైజర్స్‌తో భువనేశ్వర్‌కున్న 11 ఏళ్ల సుదీర్ఘ అనుబంధానికి తెర పడింది. మెగా వేలంలో అతడిని బెంగళూరు జట్టు రూ.10.75 కోట్ల అధిక ధరకు తీసుకుంది. కెరీర్ ఆరంభ 2009, 2010 సీజన్లలో తను ఆర్‌సీబీకే ఆడాడు. సోమవారం వేలంలో పది కోట్లు దాటిన ఏకైక ప్లేయర్ భువీనే కావడం విశేషం. ముందుగా తన కోసం ముంబై, లఖ్‌నవూ దూకుడుగా వెళ్లడంతో రేటు రూ.9 కోట్ల వరకు వెళ్లింది. ఈ దశలో ఆర్‌సీబీ పది కోట్లు దాటించి చివరకు తమ పాత పేసర్‌ను వశం చేసుకోగలిగింది.

దీపక్ ఈసారి ముంబైకి..

చెన్నై సూపర్ కింగ్స్‌తో ప్రత్యేక అనుబంధం కలిగిన పేసర్ దీపక్ చాహర్ ఈసారి ఆ జట్టును వీడాల్సి వచ్చింది. వేలంలో అతడిని ముంబై రూ.9.25 కోట్లకు తీసుకుంది. పంజాబ్ అతడి కోసం పోటీపడినా మధ్యలోనే వైదొలిగింది. అలాగే సీఎస్‌కే మరో పేసర్ తుషార్ దేశ్‌పాండే కూడా రూ.6.50 కోట్ల ధరతో రాజస్థాన్‌కు మారాడు. ఇక ఇతర పేసర్లలో లఖ్‌నవూ ఆకాశ్ దీప్‌ను, ఢిల్లీ ముకేశ్ కుమార్‌ను రూ.8 కోట్ల చొప్పున తీసుకున్నాయి. ముకేశ్‌ను పంజాబ్ 6.5 కోట్లకు తీసుకోగా.. ఆర్‌టీఎం ద్వారా డీసీ దక్కించుకుంది. ఉనాద్కట్‌ను కనీస ధర రూ.కోటికి సన్‌రైజర్స్, వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ రూ.75 లక్షలకు గుజరాత్ కొనుగోలు చేశాయి.

ముందే డీల్ జరిగిందా?

సోమవారం మెగా వేలంలో ముంబై ఇండియన్స్ యజమాని ఆకాశ్ అంబానీ తీరు పలు సందేహాలకు తావిచ్చినట్టయ్యింది. గత సీజన్‌లో ఆర్‌సీబీకి ఆడిన విల్ జాక్స్ తన విధ్వంసక ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి ప్లేయర్‌ను ఆర్‌టీఎం ద్వారా ఆర్‌సీబీ తిరిగి తీసుకుంటుందని అంతా భావించారు. అతడికోసం మొదట పంజాబ్, ముంబై పోటీపడగా రేటు రూ.5.25 కోట్ల దగ్గర ఆగింది. అయితే ఈ దశలో ఆర్‌సీబీ నుంచి ఎలాంటి స్పందన లేకపోగా.. ముంబై వైపు చూస్తూ అతడు మీకే అన్నట్టుగా సైగ చేశారు. దీంతో సంతోషం పట్టలేని ఆకాశ్ వెంటనే ఆర్‌సీబీ స్టాఫ్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ తీరును నిరసిస్తూ ముంబైతో ముందే ఒప్పందం కుదుర్చుకున్నారా? అంటూ ఆర్‌సీబీపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ సాగుతోంది.



ఢిల్లీకి సిక్సర్ల వీరుడు

ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదిన ప్రియాన్ష్ ఆర్యకు అదృష్టం పండింది. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతడిపై పంజాబ్ కింగ్స్ రూ.3.8 కోట్లు వెచ్చించింది. ఆర్‌సీబీ కూడా అతడి కోసం చివరి వరకు ప్రయత్నించింది. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 222 రన్స్‌తో ఢిల్లీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



'విదేశీ'లో జాన్సెన్ టాప్

విదేశీ ఆటగాళ్లలో పేస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ రూ.7 కోట్ల ధరతో టాప్‌లో నిలిచాడు. ఇటీవల భారత్‌లో జరిగిన టీ20 సిరీస్‌లో విశేషంగా రాణించడంతో మంచి రేటే పలికింది. ఇక డుప్లెసీ అతడి కనీస ధర రూ.2 కోట్లకే ఢిల్లీ తీసుకుంది. టిమ్ డేవిడ్‌ను రూ.3 కోట్లకు ఆర్‌సీబీ, స్పెన్సర్ జాన్సన్‌ను రూ.2.80 కోట్లకు కేకేఆర్ తీసుకుంది. అలాగే రూ.75 లక్షల కనీస ధర కలిగిన అఫ్ఘాన్ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను ముంబై రూ.4.80 కోట్లకు తీసుకోవడం విశేషం.

రెండో రోజు టాప్-5 ఆటగాళ్లు

భువనేశ్వర్	బెంగళూరు	రూ.10.75 కోట్లు
దీపక్ చాహర్	ముంబై	రూ.9.25 కోట్లు
ఆకాశ్‌దీప్	లఖ్‌నవూ	రూ.8 కోట్లు
ముకేశ్ కుమార్	ఢిల్లీ	రూ.8 కోట్లు
తుషార్	రాజస్థాన్	రూ.6.50 కోట్లు

రెండోసారి అదృష్టం

వేలంలో మొదట అన్‌సోల్డ్‌గా మిగిలిన ఆటగాళ్లలో పలువురికి చివర్లో అదృష్టం దక్కింది. వీరిలో దేవ్‌దత్‌ను ఆర్‌సీబీ, మొయిన్ అలీని కేకేఆర్, గ్లెన్ ఫిలిప్స్‌ను గుజరాత్ జట్లు వారి కనీస ధర రూ.2 కోట్లకు కొనుగోలు చేశాయి. అలాగే అజింక్యా రహానె కోటీ 50 లక్షలకు కేకేఆర్ దక్కించుకుంది. సన్‌రైజర్స్‌కు ఆడిన పేసర్ ఉమ్రాన్‌ను రూ.75 లక్షలకు కేకేఆర్ తీసుకోగా, ఇక సచిన్ తనయుడు అర్జున్‌ను ఎప్పటిలాగే ముంబై రూ.30 లక్షలకు తీసుకుంది.

వీరిని పట్టించుకోలే..

స్వదేశీ ఆటగాళ్లు: మయాంక్, సర్ఫరాజ్, పృథ్వీ షా, శార్దూల్, కేఎస్ భరత్, ఉమేశ్ యాదవ్, సైనీ, శివమ్ మావి, చేతన్ సకారియా. **విదేశీ ఆటగాళ్లు:** వార్నర్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్, మిచెల్, బ్రేస్‌వెల్, ఫిన్ అలెన్, క్యారీ, బెహ్రెన్‌డార్ఫ్, జోర్డాన్, హోప్, అల్జారి జోసెఫ్, కేశవ్ మహరాజ్, బ్రెవిస్, సికిందర్ రజా, నవీనుల్ హక్, ముజీబుర్, ముస్తాఫిజుర్,

కఠినమైన ఆసీస్ టూర్‌ను భారత్ అపూర్వ విజయంతో ఆరంభించింది. బుమ్రా ముందుండి నడిపించగా... జైస్వాల్, కోహ్లీ శతకాలతో దుమ్మురేపడంతో.. ఆప్టస్ స్టేడియంలో ఆతిథ్య జట్టుకు టీమిండియా తొలిసారి ఓటమి రుచి చూపించింది. తొలి ఇన్నింగ్స్ కష్టంగా 150 పరుగులకే కుప్పకూలినా.. పేస్‌దళం నిప్పులు చెరగడంతో పైచేయి సాధించిన భారత్.. ప్రత్యర్థికి కోలుకొనే అవకాశం ఇవ్వలేదు. కొత్తగా టీమ్‌లోకి వచ్చిన కుర్రాళ్లు నితీశ్, హర్షిత్ తమ ఎంపికపై ఎదురైన విమర్శలకు తగిన సమాధానం ఇచ్చారు. మొత్తంగా రోహిత్, జడేజా, అశ్విన్ లాంటి సీనియర్లు లేకుండా బరిలోకి దిగిన టీమిండియా.. చిరస్మరణీయ విజయంతో సిరీస్‌లో ఘనంగా బోణీ చేసింది.



సిరాజ్ (3/51)

పెర్త్ పాదాక్రాంతం



హెడ్ (89)



బుమ్రా (3/42)

తొలి టెస్ట్‌లో భారత్ ఘన విజయం

కంగారూల పనిబట్టిన బుమ్రా

295 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు

హెడ్ పోరాటం వృథా

పెర్త్: సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో క్లీన్‌స్వీప్‌కు గురైన భారత్.. బలంగా పుంజుకొంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని అద్భుత విజయంతో మొదలెట్టింది. బుమ్రా అండ్ కో దుమ్మురేపడంతో.. తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియాను 295 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మరో రోజు ఆట మిగిలుండగానే మ్యాచ్‌ను సొంతం చేసుకొన్న టీమిండియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో పైచేయి సాధించింది. 534 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 12/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్ 238 పరుగులకే కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ (89), మిచెల్ మార్ష్ (47), అలెక్స్ క్యారీ (36) కొంత పోరాటం కనబర్చారు. బుమ్రా, సిరాజ్ తలో మూడు వికెట్లు పడగొట్టగా.. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు కూల్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌ను 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు కుప్పకూలింది. ప్రత్యర్థి వెన్నువిరిచిన స్టాండిన్ కెప్టెన్ బుమ్రా (8/72) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్ట్ (డే/నైట్) వచ్చేనెల 6నుంచి అడిలైడ్‌లో జరగనుంది.

బ్యాటర్ల వైఫల్యం..

కొండంత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్.. టీమిండియా పేసర్ల దెబ్బకు విలవిల్లాడింది. హెడ్, మార్ష్ మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటాన్ని కూడా ప్రదర్శించలేదు. ముందు రోజు మూడు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న కంగారూలను తొలి సెషన్‌లో సిరాజ్ వణికించాడు. ఓవర్‌నైట్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా (4)ను క్యాచవుట్ చేశాడు. అయితే, స్మిత్ (17), హెడ్ ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, స్మిత్‌ను కూడా సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న హెడ్‌కు మార్ష్ జత కలవడంతో స్కోరు వేగం పుంజుకొంది. వీరిద్దరూ వన్డే తరహాలో షాట్లు ఆడడంతో లంచ్ సమయానికి ఆసీస్ 104/5తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత కూడా ఇద్దరూ అటాకింగ్ ఆటనే ప్రదర్శించారు. ఈ దశలో మరోసారి బంతిని అందుకొన్న బుమ్రా.. ధాటిగా ఆడుతున్న హెడ్‌ను క్యాచవుట్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు క్రీజులో పాతుకోవాలని చూసిన మార్ష్‌ను నితీశ్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చింది. స్టార్క్ (12)ను సుందర్ అవుట్ చేయడంతో.. ఆసీస్ 227/8తో టీకి వెళ్లింది. ఆఖరి సెషన్‌లో కేవలం ఐదు ఓవర్లలోనే భారత బౌలర్లు లాంఛనాన్ని ముగించారు. లియోన్ (0)ను సుందర్ అవుట్ చేయగా.. క్యారీని బౌల్డ్ చేసిన హర్షిత్ ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150 ఆలౌట్, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 104 ఆలౌట్, భారత్ రెండో ఇన్నింగ్స్: 487/6 డిక్లేర్డ్.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఖవాజా (సి) పంత్ (బి) సిరాజ్ 4, కమిన్స్ (సి) కోహ్లీ (బి) సిరాజ్ 2, లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3, స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 17, హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 89, మార్ష్ (బి) నితీశ్ 47, క్యారీ (బి) హర్షిత్ 36, స్టార్క్ (సి) జురెల్ (బి) సుందర్ 12, లియోన్ (బి) సుందర్ 0, హాజెల్‌వుడ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 58.4 ఓవర్లలో 238 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-12, 4-17, 5-79, 6-161, 7-182, 8-227, 9-227; **బౌలింగ్:** బుమ్రా 12-1-42-3, సిరాజ్ 14-2-51-3, హర్షిత్ 13.4-1-69-1, సుందర్ 15-0-48-2, నితీశ్ 4-0-21-1.

నా కుమారుడికి చెప్పుకోవడానికి ఎన్నో కథలు

"కెప్టెన్‌గా తొలి విజయం నాకు ఎంతో ప్రత్యేకం. ఈ సమయంలో నా కొడుకు కూడా ఉండడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రస్తుతం అతడు చిన్న పిల్లాడే కానీ.. పెరిగి పెద్ద వాడైన తర్వాత చెప్పుకోవడానికి ఎన్నో అపురూప జ్ఞాపకాలు, కథలు నాకు మిగిలుంటాయి. టీ20 వరల్డ్‌కప్ గెలిచినప్పుడు కూడా వాడు స్టాండ్స్‌లో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైనప్పుడు కూడా జట్టు సభ్యులు ఏమాత్రం డీలా పడకపోవడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. యువ ఆటగాళ్లు నితీశ్, హర్షిత్ ఆకట్టుకొన్నారు. తొలిసారి ఆసీస్‌లో ఆడుతున్నామనే బెరుకు వారిలో కనిపించలేదు." -బుమ్రా

1 ఆప్టస్ స్టేడియంలో ఆడిన ఐదు టెస్ట్‌లో ఆస్ట్రేలియాకు ఇది తొలి ఓటమి.

పెర్త్‌లో టెస్ట్ మ్యాచ్ గెలిచిన రెండో ఆసియా, భారత కెప్టెన్‌గా బుమ్రా. 2008లో అనిల్ కుంబ్లే ఈ ఘనతను అందుకొన్నాడు.

2 గత 40 ఏళ్లలో సొంతగడ్డపై పరుగుల పరంగా కంగారూలకు (295 రన్స్) ఇది రెండో అతిపెద్ద ఓటమి. 2012లో వాకాలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆసీస్ 309 పరుగుల తేడాతో ఓడింది.

భారత్ చేతిలో ఆసీస్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమి. 2008లో మొహాలీ టెస్ట్‌లో 320 పరుగుల తేడాతో చిత్తయింది.

మళ్లీ టాప్‌లోకి..

పెర్త్‌లో విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకొంది. టీమిండియా 61.11 విజయాల శాతంతో నెం:1 ర్యాంక్‌ను సొంతం చేసుకోగా.. ఆస్ట్రేలియా రెండో స్థానానికి దిగజారింది. ఎటువంటి సమీకరణాలు అవసరం లేకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే టీమిండియా ఈ సిరీస్‌ను 4-0తో నెగ్గాల్సి ఉంటుంది. శ్రీలంక, న్యూజిలాండ్ మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

ఢిల్లీ	బెంగళూరు	కోల్‌కతా	రాజస్థాన్	ముంబై
మొత్తం ఆటగాళ్లు: 23 **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, స్టబ్స్, అభిషేక్ పొరెల్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** స్టార్క్, కేఎల్ రాహుల్, బ్రూక్, మెక్‌గర్క్, నటరాజన్, కరుణ్ నాయర్, రిజ్వీ, అశుతోష్, మోహిత్, డుప్లెసీ, ముకేశ్ కుమార్, మల్కండే, నిగమ్, చమీర, ఫెరీర, అజయ్ మండల్, మన్వంత్, త్రిపురన విజయ్, మాధవ్ తివారి.	**మొత్తం ఆటగాళ్లు: 22** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** కోహ్లీ, పటిదార్, యశ్ దయాల్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** లివింగ్‌స్టోన్, సాల్ట్, జితేశ్, హాజెల్‌వుడ్, రసిక్‌దార్, సుయాశ్ శర్మ, క్రునాల్ పాండ్యా, భువనేశ్వర్, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, షఫర్డ్, తుషార, మనోజ్, బెతెల్, పడిక్కళ్, స్వస్తిక్, ఎంగిడి, అభినందన్, మోహిత్ రాఠి.	**మొత్తం ఆటగాళ్లు: 21** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** రింకూ సింగ్, వరుణ్‌చక్రవర్తి, నరైన్, రస్సెల్, హర్షిత్ రాణా, రమణ్‌దీప్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** వెంకటేశ్ అయ్యర్, డికాక్, గుర్బాజ్, నోకియా, రఘువంశీ, మార్కండే, వైభవ్, రోమన్ పొవెల్, మనీష్ పాండే, స్పెన్సర్ జాన్సెన్, సిసోడియా, రహానె, అనుకూల్ రాయ్, మొయిన్ అలీ, ఉమ్రాన్ మాలిక్.	**మొత్తం ఆటగాళ్లు: 20** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** సంజూ శాంసన్, జైస్వాల్, పరాగ్, జురెల్, హెట్‌మయెర్, సందీప్ శర్మ. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** ఆర్చర్, తీక్షణ, హసరంగ, ఆకాశ్, కార్తికేయ, నితీష్ రాణా, తుషార్, శుభమ్ దూబే, యుధ్‌వీర్, ఫరూఖి, వైభవ్ సూర్యవంశీ, మఫాఖ, కునాల్ రాథోడ్, అశోక్ శర్మ,	**మొత్తం ఆటగాళ్లు: 23** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** హార్దిక్, రోహిత్, సూర్యకుమార్, తిలక్, బుమ్రా. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** బౌల్ట్, నమన్, రాబిన్, కర్ణ్‌శర్మ, రికెల్టన్, దీపక్ చాహర్, విల్‌జాక్స్, అశ్వనీ కుమార్, శాంట్నర్, టోప్లే, క్రిష్ణన్, రాజ్ బవా, సత్యనారాయణరాజు, జేకబ్స్, అర్జున్, లిజార్డ్, విఘ్నేష్.

పంజాబ్	సన్‌రైజర్స్	లఖ్‌నవూ	గుజరాత్	చెన్నై
మొత్తం ఆటగాళ్లు: 25 **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** శశాంక్ సింగ్, ప్రభ్‌సిమ్రన్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** శ్రేయాస్ అయ్యర్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, మార్కో జాన్సెన్, అజ్మతుల్లా, ఆరోన్ హర్డీ, సూర్యాంశ్, చాహల్, బ్రార్, ప్రవీణ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, యశ్ ఠాకూర్, ఫెర్గూసన్, వైశాఖ్, నేహల్ వధేరా, కుల్దీప్ సేన్, గ్జేవియర్ హర్నూర్, ప్రియాన్ష్ ఆర్య, ముషీర్ ఖాన్, పైలా అవినాష్, విష్ణు వినోద్, ఇన్‌గ్లిస్,	**మొత్తం ఆటగాళ్లు: 20** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** కమిన్స్, అభిషేక్ శర్మ, నితీశ్‌కుమార్, క్లాసెన్, హెడ్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** షమి, హర్షల్, ఇషాన్ కిషన్, రాహుల్ చాహర్, జంపా, అథర్వ, అభినవ్, సిమర్‌జీత్, జీషన్, ఉనాద్కట్, బ్రైడన్, కమింగు, అనికేత్, ఎషాన్ మలింగ, సచిన్ బేబి.	**మొత్తం ఆటగాళ్లు: 24** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** నికోలస్ పూరన్, బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహిసిన్, బదోని. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** రిషబ్ పంత్, మిల్లర్, మార్‌క్రమ్, మార్ష్, అవేశ్ ఖాన్, సమద్, ఆర్యన్, ఆకాశ్‌దీప్, హిమ్మత్‌సింగ్, సిద్దార్థ్, దిగ్వేష్, షాబాజ్ అహ్మద్, ఆకాశ్‌సింగ్, షమార్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, యువరాజ్, రాజ్‌వర్ధన్, హర్షిల్ కులకర్ణి, బ్రీట్కే.	**మొత్తం ఆటగాళ్లు: 25** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** రషీద్, గిల్, సాయి సుదర్శన్, తెవాటియా, షారుక్. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** రబాడ, బట్లర్, సిరాజ్, ప్రసిద్ధ్ క్రిష్ణ, నిశాంత్, లోమ్రోర్, కుశాగ్ర, అనూజ్, మానవ్‌సుతార్, వాషింగ్టన్, కొట్జీ, హర్షద్, గుర్నూర్, రూథర్‌ఫర్డ్, సాయి కిషోర్, ఇషాంత్ శర్మ, జయంత్, ఫిలిప్స్, కరీం, కుల్వంత్.	**మొత్తం ఆటగాళ్లు: 25** **అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు:** రుతురాజ్, పతిరణ, శివమ్ దూబే, జడేజా, ధోనీ. **కొనుగోలు చేసిన ఆటగాళ్లు:** కాన్వే, త్రిపాఠి, రచిన్, అశ్విన్, ఖలీల్, నూర్ అహ్మద్, విజయ్ శంకర్, కర్రాన్, షేక్ రషీద్, అన్షుల్ కాంబోజ్, ముకేశ్ చౌదరి, దీపక్ హుడా, గుర్‌జప్నీత్, ఎల్లిస్, ఓవర్టన్, నాగర్‌కోటి, రామకృష్ణ, శ్రేయాస్ గోపాల్, వన్ష్‌బేడి, ఆండ్రీ సిద్దార్థ్.

వేలంలో తెలుగు వెలుగులు



రషీద్

ఐపీఎల్ రెండో రోజు వేలంలో నలుగురు తెలుగు క్రికెటర్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఈ నలుగురు క్రికెటర్లను కనీస ధర రూ.30 లక్షలకు కొన్నాయి. 2022 అండర్-19 వరల్డ్‌కప్ నెగ్గిన టీమిండియా వైస్ కెప్టెన్, గుంటూరు యువ బ్యాటర్ షేక్ రషీద్‌ను చెన్నై జట్టు వరుసగా మూడో ఏడాది వేలంలో దక్కించుకుంది. రషీద్‌తో పాటు విశాఖకు చెందిన పైల అవినాష్‌ను పంజాబ్, కాకినాడ ఆటగాడు పెన్మెత్స వెంకట సత్యనారాయణను ముంబై ఇండియన్స్, టెక్కలి క్రికెటర్ త్రిపురన విజయ్‌ను ఢిల్లీ జట్టు తీసుకున్నాయి. తొలి రోజు వేలంలో తళుక్కుమన్న హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్, ముంబై, సన్‌రైజర్స్ రిటైన్ చేసుకున్న తిలక్‌వర్మ, నితీశ్‌రెడ్డితో కలిపి ఈసారి ఐపీఎల్‌లో ఆడే తెలుగు క్రికెటర్ల సంఖ్య ఏడుకి చేరింది. విశాఖకు చెందిన వెటరన్ వికెట్‌కీపర్ కేఎస్ భరత్, సిరిసిల్ల యువ క్రికెటర్ అరవెల్లి అవనీష్ పేర్లు వేలంలో వచ్చినా వీరిని కొనడానికి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. రికీ భుయ్, అశ్విన్ హెబ్బర్, తనయ్ త్యాగరాజన్, తన్మయ్ అగర్వాల్ సహా మొత్తంగా ఈసారి వేలంలో ఆంధ్ర నుంచి పన్నెండు, తెలంగాణ నుంచి ఏడుగురు క్రికెటర్లు పాల్గొన్నారు.

తొలి గేమ్ లిరెన్‌దే..

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ మొదటి గేమ్ అత్యంత ఆసక్తికరంగా సాగింది. అయితే మధ్య గేమ్‌లో తడబాటుకు లోనైన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ మూల్యం చెల్లించుకున్నాడు. దాంతో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నల్ల పావులతో ఆడిన చైనా గ్రాండ్‌మాస్టర్ ఈ విజయంతో 14 గేముల తుది పోరులో 1-0తో పైచేయి సాధించాడు. గుకేశ్ తెల్ల పావులతో కింగ్ పాన్ ఓపెనింగ్‌తో ఆశ్చర్యపరిచాడు. 2001లో అలెక్సీ షిరోవ్‌తో వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో దిగ్గజ ఆటగాడు ఆనంద్ ఇదే ఓపెనింగ్‌ను ఎంచుకొని గెలవడం విశేషం. 17 ఏళ్ల గుకేశ్ అటాకింగ్ ఓపెనింగ్‌ను లిరెన్ ఫ్రెంచ్ డిఫెన్స్‌తో ఎదుర్కొన్నాడు. 12వ ఎత్తు వచ్చేసరికి 30 నిమిషాల సమయంతో గుకేశ్ మెరుగైన స్థితిలోనే నిలిచాడు. కానీ మరో ఎనిమిది ఎత్తుల తర్వాత రెండు నిమిషాల అదనపు సమయంతో లిరెన్ పైచేయి ప్రదర్శించాడు. అంటే..గుకేశ్ ఓపెనింగ్‌ను లిరెన్ సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు మిడిల్ గేమ్ వచ్చేసరికి లిరెన్ పటిష్ఠ స్థితిలో ఉంటాడని తేలిపోయింది. 33వ ఎత్తుకు వచ్చేసరికి గుకేశ్ చిక్కుల్లో పడ్డాడు. 45 సెకన్లలో ఏడు ఎత్తులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఒక సెకనే సమయం ఉండగా 40వ ఎత్తు వేశాడు. ఈ ఎత్తుతో భారత జీఎం అదనపు సమయం దక్కించుకున్నా అప్పటికే రెండు పావులను కోల్పోయాడు. దాంతో ఒత్తిడికి లోనైన గుకేశ్ 42 ఎత్తుల్లో ఓటమిని అంగీకరించక తప్పలేదు.

టైటిల్ కరువు తీరేనా?

బరిలో సింధు, లక్ష్యసేన్

నేటినుంచి సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: ఇటీవల వరస ఈవెంట్లలో విఫలమవుతున్న స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్.. స్వదేశంలో జరుగుతున్న సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలోనైనా విజేతలుగా నిలవాలని పట్టుదలగా ఉన్నారు. మంగళవారం ప్రారంభమయ్యే టోర్నీలో సింధు, సేన్‌తో పాటు డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్/సిరాజ్ టైటిళ్లపై కన్నేశారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్, ఆకర్షి కశ్యప్, రక్షిత శ్రీ, అనుపమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని/తనీషా, గాయత్రి/ట్రీసా జోడీలు ఫేవరెట్లుగా తలపడుతున్నారు.

ఐవరికోస్ట్.. 7 ఆలౌట్

టీ20ల్లో అత్యల్ప స్కోరుతో చెత్త రికార్డు

లాగోస్ (నైజీరియా): పురుషుల టీ20 ఫార్మాట్‌లో ఐవరికోస్ట్ అత్యంత చెత్త రికార్డు నమోదు చేసింది. నైజీరియాతో జరిగిన టీ20 వరల్డ్ కప్ సబ్ రీజనల్ ఆఫ్రికా గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఐవరికోస్ట్ కేవలం ఏడు పరుగులకే ఆలౌటైంది. తద్వారా అత్యల్ప స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. నైజీరియా స్కోరు 271/4 స్కోరుకు జవాబుగా బరిలో దిగిన కోస్ట్..7.3 ఓవర్లలో చాప చుట్టేసింది. దాంతో 10 పరుగుల గత అత్యల్ప స్కోరు రికార్డును బద్దలుగొట్టింది. సింగపూర్‌పై మంగోలియా, స్పెయిన్‌పై ఐసిల్ ఆఫ్ మ్యాన్ జట్టు ఆ స్కోర్లు చేశాయి. ఇక.ఐవరికోస్ట్ జట్టులో మొహ్మద్ (4) టాప్ స్కోరర్.

చలి పులి పంజా!

» సిర్పూర్‌లో 8.3, కోహీర్‌లో 8.8 డిగ్రీలు.. ఒకరి మృతి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. తెల్లవారు జామున పొగమంచు రోడ్లను కప్పేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత మరి ఎక్కువగా ఉంది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 8.8, న్యాల్‌కల్‌లో 9.6, కంగ్టిలో 9.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలుగా రికార్డయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా చోట్ల 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇటు హైదరాబాద్‌లో పటాన్ చెరు ప్రాంతంలో 11.2 డిగ్రీలు రికార్డయింది. రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడ్రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మూడ్రోజులకు యె ల్లో అలెర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, చలిని తట్టుకోలేక గుర్తు తెలియని నడి వయసు మహిళ మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ చౌరస్తాలోని సవేరా హోటల్ వద్ద ఓ మహిళ రోడ్డు పక్కన పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు స మాచారమిచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా.. ఆమె ప్రాణాలతో లేదు. అయితే ఆమె చలికి తట్టుకోలేక అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే: ఎంపీ రఘునందన్

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సర్కారు హయాంలో మల్లన్నసాగర్ రైతులపై దాడులు చేయించి కేసులు పెట్టించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పుడు గిరిజన రైతుల కోసం పోరాడటం విడ్డూరంగా ఉందని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. వంద ఎలుకలను తిన్న పిల్లి పాపప్రక్షాళన కోసం కాశీకి వెళ్లినట్టుగా.. కేటీఆర్, బీఆర్ఎస్ తీరు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఈ రెండు పార్టీలూ నేను కొట్టినట్టు చేస్తా, నువ్వు ఏడ్చినట్టు చెయ్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో తెచ్చిన భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా లగచర్ల రైతులను వేధించడం ఎంతవరకు సబబు అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్‌ను ప్రారంభించాలి

» ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఎస్సీల్లోని 57 ఉపకులాలతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల సమితి డిమాండ్ చేసింది. తెలంగాణలో ఎస్సీ ఉపకులాలకు చెందిన 30 లక్షల మంది ఉన్నారని, గత 78 ఏళ్లుగా వారికి దక్కాల్సిన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు పొందలేక తీవ్రంగా నష్టపోయారని సమితి అధ్యక్షుడు భైరి వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. .

అదానీతో ఒప్పందాలపై స్పష్టత ఇవ్వాలి: బీజేపీ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ. వంద కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్, ఆయన కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలపై స్పష్టతనివ్వాలని బీజేపీ డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంతో అదానీ చేసుకున్న రూ. 12వేల కోట్ల విలువ గల ప్రాజెక్టుల ఒప్పందాలను రద్దుచేస్తారో లేదో రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్రలో పట్టిన గతే తెలంగాణాలోనూ పడుతుందని జోస్యం చెప్పారు.

శాసన మండలి ఎన్నికల బరిలో సీపీఎస్

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి సీపీఎస్ యూనియన్ దిగింది. తమ అభ్యర్థిగా ఎక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కొలిపాక వెంకటస్వామిని ప్రతిపాదించింది. సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానించినట్లు సోమవారం తెలిపారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) తరఫున అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీ చేయనున్నారు. ఈమేరకు జాక్టో చైర్మన్ సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణుడు ప్రకటించారు. సోమవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో జరిగిన జాక్టో భేటీలో చర్చించి ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలపై ఎన్జీవోల చర్చ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత మల్టీజోనల్ క్యాడర్‌కు చెందిన ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుస్తామని టీఎన్జీవో, ఏపీఎన్జీవో ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో జరిగిన అంతర్రాష్ట్ర ఉద్యోగ బదిలీల సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, బదిలీలపై చర్చించారు. రాష్ట్ర విభజన తరువాత 2014 నుంచి ఐచ్ఛికం లేని జిల్లా, జోనల్, మల్టిజోనల్ క్యాడర్లకు సంబంధించి స్థానికేతర ఉద్యోగులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పని చేస్తున్నారు. వీరంతా ఆయా రాష్ట్రాల్లో రిజర్వేషన్ కోల్పోవడం, వారి పిల్లల స్థానికత కోల్పోవడం, ప్రభుత్వం ఇచ్చే ఆరోగ్య కార్డులు తల్లిదండ్రులకు పని చేయకపోవడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఏపీఎన్జీవో, టీఎన్జీవో సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

7న రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్: డ్రైవర్ల జేఏసీ

పంజాగుట్ట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ఆటో డ్రైవర్ల యూనియన్ జేఏసీ ఆరోపించింది. ప్రభుత్వ తీరుకు నిరసనగా డిసెంబరు 7న రాష్ట్రవ్యాప్త ఆటో బంద్‌కు పిలుపునిచ్చింది. అదే రోజున హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపింది. సోమవారం ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌ను కలిసి జేఏసీ ప్రతినిధులు సమ్మె నోటీసు అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో మేరకు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. ఏడాదికి రూ.12 వేల సాయం అందించాలని జేఏసీ కన్వీనర్ వెంకటేశం డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు 10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు.

ఎస్టీ కమిషన్ ముందుకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

» మహబూబాబాద్ జేఎన్‌టీయూ కాలేజీకి నిధుల కేటాయింపులో వివక్షపై ప్రశ్నించిన కమిషన్!

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భూమి, నిధుల కేటాయింపులో వివక్షకు సంబంధించి జాతీయ ఎస్టీ కమిషన్ ఇటీవల సమన్లు జారీ చేసిన నేపథ్యంలో ఢిల్లీలోని కమిషన్ కార్యాలయంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ సోమవారం విచారణకు హాజరయ్యారు. మహబూబాబాద్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమి, నిధుల కేటాయింపులో వర్సిటీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై ఎస్టీ కమిషన్‌కు ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ రిజిస్ట్రార్‌తోపాటు ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కమిషన్ ఇటీవల సమన్లు జారీచేసినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వం తరఫున, జేఎన్‌టీయూ తరఫున ప్రతినిధిగా రిజిస్ట్రార్.. ఎస్టీ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. కళాశాలకు కేటాయించిన స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ వేయడానికి జేఎన్‌టీయూ నుంచి రూ.30లక్షలు విడుదల చేయకపోవడం వల్లనే 15 ఎకరాల భూమి కబ్జాకు గురైందని, ఈ క్రమంలో పోలీసులు, జిల్లా యంత్రాంగానికి ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడాన్ని ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ తప్పు పట్టినట్లు సమాచారం. కాగా, రూ.5 లక్షలకు మించి నిధుల విడుదలకు పాలకమండలి అనుమతి కావాల్సి ఉండగా, ప్రస్తుతం జేఎన్‌టీయూకు పాలకమండలి లేనందునే రూ.30లక్షలు విడుదల చేయలేకపోయినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు ఎస్టీ కమిషన్‌కు వివరణ ఇచ్చారు. పాలకమండలి ఏర్పాటు కాగానే నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి , స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి ఉత్తమ్‌కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు

ఢిల్లీలో సీఎం రేవంత్

స్పీకర్ ఓం బిర్లా కుమార్తె రిసెప్షన్‌కు హాజరు

నేడు రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం

పార్లమెంటులో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చ

కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం

న్యూఢిల్లీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం 6.45 గంటలకు ఢిల్లీకి చేరుకున్నారు. నేరుగా తుగ్లక్ రోడ్డులోని తన అధికారిక నివాసానికి వెళ్లారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. అక్కడి నుంచి రాత్రి మళ్లీ తన నివాసానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో భేటీ కానున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై ఎంపీలతో చర్చించనున్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రం తరఫున లేవనెత్తాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే, పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, మెట్రో రెండో దశ, నూతన విమానాశ్రయాలకు అనుమతులు వంటి వాటిపై చర్చించనున్నట్టు సమాచారం. అవకాశాన్ని బట్టి ఏఐసీసీ పెద్దలతో రేవంత్ రెడ్డి సమావేశమవుతారని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. బుధవారం రేవంత్ రెడ్డి సోదరుడి ఇంట్లో వివాహం ఉండడంతో మధ్యాహ్నం తర్వాత ఆయన తిరిగి హైదరాబాద్ పయనం కానున్నట్టు సమాచారం.

కొన్ని వర్గాలకే భూ కేటాయింపా?

(మొదటిపేజీ తరువాయి)

కుదుర్చుకున్న లీజు ఒప్పందాలు కూడా రద్దయినట్లేనని ప్రకటించింది. సహకార సంఘాలు, సభ్యులు చెల్లించిన డెవలప్‌మెంట్ చార్జీలు, ఖర్చులను కూడా ఆదాయ పన్ను రిటర్నుల్లో సర్దిపై చేసిన తర్వాత తిరిగి చెల్లించాలని తమ తీర్పులో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం తాము వెనక్కు తీసుకున్న భూమిని ఏమి చేయాలో నిర్ణయించుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. భూకేటాయింపులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం, సహకార సంఘాలు, వాటి సభ్యులు దాఖలు చేసుకున్న అన్ని పిటిషన్లనూ సుప్రీంకోర్టు త్రోసిపుచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ వర్గాలకు చెందిన వారికి భూకేటాయింపులపై కొన్ని విధివిధానాలను నిర్ణయిస్తూ 2010లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వివిధ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఈ అంతిమ తీర్పు వెలువరించింది.

ఇది వివక్షే..

తెలంగాణలో ప్రజావనరులను పంపిణీ చేయడంలో ప్రభుత్వ దాతృత్వ వైఖరిని వివక్షగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఇది పౌరులు, వారి హక్కులు, ప్రజాస్వామ్య పనితీరుపై చెప్పుకోదగిన ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించింది. ఒక ప్రైవేట్ వ్యక్తి మాదిరి తన ఇష్టం వచ్చిన నిబంధనలను ఏర్పరచుకుని.. ఇష్టం వచ్చిన వారితో ఒప్పందం కుదుర్చుకుని వనరులను పంపిణీ చేసేందుకు ఒక ప్రభుత్వానికి అధికారాలున్నాయా అనే ప్రశ్నపై సుప్రీం దృష్టి సారించింది. అలా చేయడానికి వీల్లేదని చెప్పేందుకు పలు తీర్పులను ఉటంకించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ప్రజల ఆస్తులను, వనరులను పంపిణీ చేసే అధికారం తిరుగులేనిది కాదని, ఏ కేటాయింపులైనా ఆర్టికల్ 14ను దృష్టిలో ఉంచుకునే జరగాలని స్పష్టం చేసింది. ఆ లెక్కన చూస్తే ప్రభుత్వం జారీ చేసిన జీవోలేవీ రాజ్యాంగబద్ధంగా లేవని తేల్చింది. అమెరికా, బ్రిటన్, కెనడా, దక్షిణాఫ్రికా దేశాల్లో కూడా కోర్టులు ఈ విషయంలో తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేసింది. భూములు కేటాయించేందుకు ఏ వర్గీకరణ చేసినా అది పక్షపాతంతో చేయరాదని, హేతుబద్ధంగా ఉండాలని చెప్పింది. అణగారిన వర్గాలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలతో పోలిస్తే న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మెరుగైన స్థితిలోనే ఉన్నారని తెలిపింది.



సామాన్యుడికి నష్టం..

తమ ఇష్టం వచ్చిన వారికి విలువైన వనరులను అక్రమంగా పంపిణీ చేయడం సరికాదని ధర్మాసనం పేర్కొంది. విస్తృత సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా వనరులను కేటాయించాలని, చట్టసభలు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ప్రజలకు ట్రస్టీలుగా వ్యవహరించాలని హితవు పలికింది. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, జర్నలిస్టులను ప్రత్యేక కేటగిరీలుగా భావించి భూమిని తక్కువ ధరకు కేటాయించడం అసమానతల్ని శాశ్వతం చేస్తుందని పేర్కొంది. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, నిష్పాక్షికత ప్రమాణాలకు ఇది విరుద్ధమని స్పష్టం చేసింది. క్రీడలు, ఇతర కార్యకలాపాల ద్వారా దేశ ప్రగతికి తోడ్పడేవారికి హేతుబద్ధంగా, పక్షపాతం లేకుండా భూమి కేటాయించాలనుకున్నా అది ఆర్టికల్ 14 పరిధిలోనే జరగాలని తెలిపింది.

కేసు పూర్వాపరాలు

2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో భూకేటాయింపులకు సంబంధించి మూడు జీవోలను జారీ చేశారు. జీవో 242లో.. భూవనరులను నిర్వహించేందుకు, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సమగ్ర విధానాన్ని ప్రకటించారు. జీవో 243లో.. భూ కేటాయింపులకు అర్హులైన వ్యక్తుల కేటగిరీలను నిర్ధారించారు. జీవో 244లో.. ఈ కేటాయింపులకు సంబంధించి నిర్ణయం తీసుకునే విధానాలను నిర్ణయించారు. జీవో నంబర్ 243 ప్రకారం.. భూమిని కేటాయించాల్సిన వారిని ఎనిమిది కేటగిరీలుగా నిర్ధారించారు. వారిలో 1) ఎమ్మెల్యేలు, ఎంపీలు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు 2) గుర్తింపు పొందిన, అక్రెడిటెడ్ జర్నలిస్టులు, 3) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగులు, పంచాయతీరాజ్ టీచర్లు, 4) జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, సాంస్కృతిక రంగాల ప్రముఖులు 5) రక్షణ, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, 6) కార్గిల్, ఇతర యుద్ధాల్లో పాల్గొన్న సైనికులు, మావోయిస్టు హింసాకాండలో మరణించిన వారి వితంతువులు, 7) బలహీన వర్గాలు, 8) విద్య, దాతృత్వ, మత సంస్థలు. ఈ ఎనిమిది కేటగిరీల వారిలో మొదటి నాలుగు వర్గాల వారికీ భూమి కనీస విలువ ప్రకారం కేటాయించాలని.. 5, 8 కేటగిరీల వారికి మార్కెట్ విలువ ప్రకారం భూమి కేటాయించాలని.. 6వ కేటగిరీకి ఉచితంగా భూమి కేటాయించాలని.. 8వ కేటగిరీ విషయంలో ప్రభుత్వం తన విధానం ప్రకారం వ్యవహరించాలని జీవో తెలిపింది. ఎవరెవరికి ఎన్ని గజాలు కేటాయించాలో ఈ జీవోలో నిర్దేశించారు. భూమి కేటాయింపులకోసం ఆయా వర్గాలు సహకార సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. ఈ జీవోలకు అనుగుణంగా 2006 మే 4న ఏపీ ప్రభుత్వం ప్రభుత్వ భూమి పంపకాలను ప్రకటిస్తూ జీవో 522ను ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో 245 ఎకరాలు హైకోర్టు న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, జర్నలిస్టులకు కేటాయించాలని జీవోలో పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారులు, వివిధ రంగాల ప్రముఖులకు 500గజాల చొప్పున, మాజీ ఎమ్మెల్యేలు, వారి వితంతువులు, వర్కింగ్ జర్నలిస్టులకు 300గజాల చొప్పున భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, దాదాపు రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నామమాత్ర ధరలకు కేటాయించడం ఆర్టికల్ 14, 38, 39(డి)లకు వ్యతిరేకమని రావు వీబీజే చెలికాని, ఓఎం దేబరా 2006లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూమి పొందేవారిలో చాలామంది సంపన్నులేనని, వేలం లేకుండా భూమిని కేటాయించడం ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే భూమిని కేటాయించిన వారికి కూడా తిరిగి కేటాయిస్తూ జీవో 243ను సడలించడం దారుణమని వాదించారు. దీనిపై 2007అక్టోబరులో హైకోర్టు తీర్పు వెలువరించింది. కొన్ని వర్గాలకు అక్రమంగా ప్రయోజనాలను కట్టబెట్టడాన్ని ప్రశ్నించింది. భూకేటాయింపులకు సంబంధించి స్పష్టమైన విధానాలుండాలని నిర్దేశించింది. ఈ తీర్పు తర్వాత ఏపీ ప్రభుత్వం కొన్ని మార్పు చేర్పులతో మరో ఆరు జీవోలను జారీ చేసి భూ కేటాయింపులపై ముందడుగు వేసింది. దానిపై కూడా రావు చెలికానితో పాటు కేశవరావు జాదవ్, కాంపైన్ ఫర్ హౌజింగ్ అండ్ టెన్యురల్ రైట్స్ అనే సంస్థ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ జీవోలను కొట్టివేయాలని కోరారు. హైకోర్టు ఆ జీవోలను కొట్టి వేసి గతంలో ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా మళ్లీ తాజా కేటాయింపులు జరపాలని ఆదేశించింది.

అదానీతో రూ.12,400 కోట్ల ఒప్పందం మాటేంటి?

» రేవంత్‌రెడ్డీ సమాధానం చెప్పు

» కాంగ్రెస్‌వన్నీ అసత్య ప్రచారాలు:హరీశ్



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : "తెలంగాణకు చెందిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని వెనక్కు ఇవ్వాలని నిర్ణయించావ్.. మరి దావో‌స్‌లో ఆయనతో చేసుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందం మాటేంటి రేవంత్‌రెడ్డీ?" అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. 'రాహుల్ గాంధీ అదానీ అవినీతిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలన్న సమయంలో దావోస్‌లో ఒప్పందం, రాష్ట్రంలోని డిస్కంలను అదానీకి అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల సంగతి చెప్పాలి' అంటూ ఎక్స్ (ట్విటర్) వేదికగా ఆయన నిలదీశారు. అదానీతో రేవంత్‌రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నారని, ఇప్పుడు ఆయన అవినీతి బయట పడగానే మాట మార్చారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాగా, విజయోత్సవాల పేరిట గ్రామాల్లో కాంగ్రెస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు తిప్పికొడుతున్నారన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు ఎదురవుతున్న పరిస్థితి చూస్తుంటే.. కొందరిని కొన్నిసార్లు మోసం చేసినా.. అందరినీ అన్నిసార్లూ మోసం చేయలేమన్న అబ్రహాం లింకన్ చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయని హరీశ్ విమర్శించారు. కాగా, వాంకిడి గురుకుల విద్యార్థిని శైలజ మృతికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని, సర్కారు నిర్లక్ష్యానికి బలైన ఆ విద్యార్థినికి కన్నీటి నివాళి అంటూ.. హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక ప్రాణాలు బలితీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్‌ను కచ్చితంగా వెంటాడుతుందని ఎక్స్‌వేదికగా ఆయన పేర్కొన్నారు. బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని హరీశ్ డిమాండ్ చేశారు.

గిరిజనులూ బీఆర్ఎస్ వలలో చిక్కొద్దు

» కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూ నాయక్

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పారిశ్రామికవాడ కోసం తీసుకునే భూమిలో 11 శాతం మాత్రమే గిరిజనులదని కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలూ నాయక్ అన్నారు. ఆ భూమికి మెరుగైన పరిహారంతో పాటుగా ఉద్యోగాలూ ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కొడంగల్ లాంటి వెనుకబడిన ప్రాంతానికి పారిశ్రామికవాడను తీసుకొచ్చి అక్కడున్న దళిత, గిరిజన బిడ్డలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే కేటీఆర్ ఓర్చుకోలేక పోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పైన అక్కసుతోనే ఆయన ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ వలలో చిక్కుకోవద్దని గిరిజనులకు హితవు పలికారు. మానుకోటలో జగన్‌ను తరిమేశామని అంటున్న కేటీఆర్.. అదే జగన్‌కు ప్రగతిభవన్‌లో విందులు ఇవ్వలేదా అంటూ బాలూ నాయక్ నిలదీశారు.

కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)



మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్

ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సీఎం సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని లగచర్లలో గిరిజనులపై అక్రమ కేసులు, అరెస్టులు, దమనకాండను నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ మహాధర్నా నిర్వహించింది. కేటీఆర్ మాట్లాడుతూ ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో కీలకమైన మలుపునకు కారణమైందని, మళ్లీ ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములు గుంజుకుంటూ ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమైందన్నారు. రేవంత్‌రెడ్డి లగచర్లకు వెళ్లి ఉంటే ప్రజలు ఉరికించి కొట్టేవారన్నారు. సొంత నియోజకవర్గంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీఎంకు సమయం లేదు కానీ ఎక్కే విమానం.. దిగే విమానం అన్నట్టుగా 28 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి ప్రధాని మోదీలాంటి వ్యక్తినే నల్లచట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని, అలాంటి రైతులతో పెట్టుకున్న రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందన్నారు. లగచర్ల ఘటనపై మానుకోటలో ధర్నా ఎందుకని డీజీపీ ప్రశ్నించారని, కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోనూ ధర్నాలు చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించేదాక వదిలిపెట్టబోమన్నారు. సీఎం తన అల్లుడి కోసం పేదవాళ్ల భూములు గుంజుకుంటున్నారని ఆరోపించారు. ఫార్మా విలేజ్ ఎవరి కోసమో చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీ, తన అన్న, తమ్ముడు, అల్లుడి కోసం తప్ప సీఎం రాష్ట్ర ప్రజల కోసం పనిచేయడం లేదని మండిపడ్డారు. మరో పది రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది పూర్తవుతుందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న సీఎం ఒక్క హామీ అయినా నేరవేర్చారా అని ప్రశ్నించారు.

రాళ్లతో కొడతామంటుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?

తాను మహబూబాబాద్ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామని అంటున్నారని, పోలీసులు ఏం చేస్తున్నారని కేటీఆర్ డీజీపీ, ఎస్పీని ప్రశ్నించారు. అయినా తాము భయపడబోమని, ఎందుకంటే తాము కేసీఆర్ తయారుచేసిన దళమని, మానుకోట రాళ్ల మహత్యమేమిటో తెలంగాణను అడ్డుకున్న వారందరికీ తెలుసని అన్నారు. 14 ఏళ్ల కిందటే మానుకోటలో నిప్పు పుట్టిందని, ఆపై తెలంగాణ వచ్చిందని చెప్పారు. మానుకోటలో ధర్నాకు హైకోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకున్నామని, వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని, దీన్నిబట్టి ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందన్నారు. లగచర్లలో 30 మంది రైతులను జైల్లో పెడితే బంజారా ఆడబిడ్డలు భయపడలేదని, జ్యోతి అనే గర్భిణి ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి ఆగడాలను బయటపెట్టిందన్నారు. అక్కడ జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లగచర్ల బాధితుల బాధలు విని కన్నీరు పెట్టుకున్నారన్నారు. ఒక కాకికి దెబ్బ తగిలితే వంద కాకులు ఏకమైనట్టు ఒక గిరిజన బిడ్డకు ఆపద వస్తే అందరూ కదలిరావాలని కేటీఆర్ కోరారు. లగచర్లలో జరిగినట్టు ఎక్కడైనా జరగవచ్చని, ఒక దగ్గర అన్యాయం జరిగితే రాష్ట్రమంతా కదం తొక్కాలన్నారు. బీఆర్ఎస్ అంటే బంజారా రాష్ట్ర సమితి కూడా అని, వారికి అండగా ఉంటామన్నారు.

ఈడీ దాడుల నుంచి తప్పించుకునేందుకు కాళ్లు పట్టుకున్నదెవరో తెలుసు: కేటీఆర్


హైదరాబాద్: 'పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర నీది.. కొట్లాడి తెచ్చిన తెలంగాణను తెర్లు చేయాలని ప్రయత్నించి పట్టుబడిన ఓటుకు నోటు చరిత్ర నీది' అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈడీ దాడుల నుంచి తప్పించుకోవడానికి ఫైవ్ స్టార్ హోటల్లో చీకట్లో కాళ్ల పట్టుకున్నదెవరో అందరికీ తెలుసని పేర్కొన్నారు. 'మీ బడే భాయ్.. చోటే భాయ్‌ల వ్యవహారం ఎవరికి తెలుసు పిట్టల దొరా' అని 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు.

కులగణనపై సర్కారు అబద్ధాలు!

» 70% ఇళ్లకు ఇంకా స్టిక్కర్లే వేయలేదు

» నెలలో సర్వే నివేదిక ఎలా ఇస్తారు?


» ప్రాంతీయ పార్టీలతోనే బీసీలకు న్యాయం: కవిత



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇప్పటికీ 70 శాతం ఇళ్లకు స్టిక్కర్లే వేయలేదని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సర్వే పూర్తికాలేదని అన్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం 90 శాతం సర్వే పూర్తయిందంటూ అసత్యాలు చెబుతోందని విమర్శించారు. కులగణనపై నెలరోజుల్లో నివేదిక ఇస్తామని ప్రభుత్వం చెబుతుండడంపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సోమవారం కవిత బీసీ రిజర్వేషన్ల ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావును కలిసి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రూపొందించిన సమగ్ర నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీల ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని, తమిళనాడులో జయలలిత హయాంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు సమయంలో, ఆతర్వాత తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ నాయకత్వంలో బీసీలకు న్యాయం జరిగిందని కవిత తెలిపారు. ఈ దేశాన్ని 55 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశంలో కులగణనను ఎందుకు చేపట్టలేదో రాహుల్‌గాంధీ చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తాము కులగణన చేపట్టబోమని సుప్రీంకోర్టులో 2021లో అఫిడవిట్ దాఖలు చేసిందని తెలిపారు. బీజేపీ డీఎన్ఏలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక భావాలున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా. వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి చెందడం తనను కలచివేసిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కాంగ్రెస్ అసమర్థ పరిపాలన మరో పేద బిడ్డ ప్రాణం తీసిందని, కన్నతల్లికి కడుపు కోత విధించిందని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆమె విమర్శించారు. 11 నెలల్లో 43 మంది విద్యార్థుల ప్రాణాలు తీశారని, ఇవన్నీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్యలేనని కవిత ఆరోపించారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు కాంగ్రెస్ సర్కార్‌ది

'ఉపాధి' పనులతో విజయోత్సవాలు సిగ్గుచేటు: బండి



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చే జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో కాంగ్రెస్ ప్రభుత్వం తన ఏడాది పాలన విజయోత్సవాలను ప్రారంభించుకోవడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఏడాది పాలనలో చేసిందేమీ లేకపోవడంతో కేంద్ర నిధులతో అమలవుతున్న పనులను రాష్ట్ర ప్రభుత్వం తన పథకంగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. సొమ్ము కేంద్రానిది, సోకు కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నట్లుగా ఉందన్నారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ పథకం పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో ప్రధాని మోదీ ఫొటో ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలకు కూడా ప్రధాని ఫొటోను తప్పనిసరిగా ఉండేలా ఆదేశించాలని కోరారు.

రాష్ట్రంలో అంబర్ రెసోజెట్ పరిశ్రమలు

- రూ.250 కోట్లతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్లాంట్లు
- మూడేళ్లలో స్థాపన.. వెయ్యి మందికి ఉపాధి
- మంత్రి శ్రీధర్ బాబును కలిసిన సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ పరికరాలు, విడిభాగాలను సరఫరా చేసే 'అంబర్-రెసోజెట్' సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టనుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కంపెనీ వచ్చే మూడేళ్లలో తమ ఉత్పత్తుల తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనుందని చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. త్వరలోనే తెలంగాణలో అధునాతన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల పరిశ్రమను నెలకొల్పడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అంబర్-రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండీషనర్ల వంటి పలు పరికరాలను ఉత్పత్తి చేసి అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. వందే భారత్ రైళ్లు, మెట్రో రైళ్లు, బస్సులు, డిఫెన్స్ వాహనాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఎయిర్ కండీషనర్ల తయారీలో అంబర్ ఎంటర్‌ప్రైజెస్‌కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ కంపెనీ హైదరాబాద్‌లో ప్లాంట్లను పెట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని శ్రీధర్ బాబు అన్నారు.

ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు పరుగు పెట్టాలి

- నిర్ణీత గడువులోగా పూర్తికావాలి
- సీతారామ టెండర్ల ప్రక్రియను పూర్తిచేయాలి: మంత్రి ఉత్తమ్

ప్రాధాన్య సాగునీటి ప్రాజెక్టుల పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పనులకు పరిపాలనపరమైన అనుమతుల జారీ, ఇతర నిర్ణయాల్లో అధికారులు ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ, ఆర్థిక రంగాల అభివృద్ధికి ప్రాజెక్టులు ఎంతో కీలకమని, వాటిని నిర్దేశిత గడువు ల్లోగా పూర్తిచేసేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందన్నారు. సీతారామ ప్రాజెక్టు కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను సత్వరం ప్రారంభించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై సోమవారం ఆయన జలసౌధ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొడికుంట వాగు ప్రాజెక్టు అంచనా వ్యయం తయారీ, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూసేకరణలో అడ్డంకులను అధిగమించడానికి పునరావాసం, పునర్‌నిర్మాణ విభాగం కమిషనర్ వినయ్‌కృష్ణా రెడ్డితో కలిసి పనిచేయాలని కోరారు. జలాశయాల్లో పూడిక తొలగింపు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. నీటిపారుదల శాఖలో లష్కర్ల నియామకం, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ఎంపిక తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు.

ఎస్‌హెచ్‌జీ సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో ముందడుగు

- పరికరాల సరఫరా వెండార్ల ఎంపిక కోసం టెండర్లు
- ఈపీసీ విధానంలో ఆహ్వానించిన టీజీరెడ్కో

ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు దిశగా ముందుగులు పడుతున్నాయి. ఈ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సరఫరా చేసే వెండార్లను ఎంపిక(ఎంప్యానల్‌మెంట్) చేసేందుకు ఈపీసీ విధానంలో టెండర్లను ఆహ్వానించినట్టు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీరెడ్కో) సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆసక్తిగల బిడ్డర్లు డిసెంబరు 10లోగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లు వేయాలని టీజీరెడ్కో కోరింది. ఒక్కో మహిళా గ్రూప్‌తో ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన సౌరవిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పీఎం కుసుమ్ పథకం కింద 4 వేల మెగావాట్ల ప్లాంట్లు ఎస్‌హెచ్‌జీల ద్వారా పెట్టించాలని నిర్ణయించిన సర్కారు.. తొలి దశలో రాష్ట్రంలో మహిళలతో 1,000 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఎంప్యానల్‌మెంట్, మరిన్ని వివరాలకు http://tgredco.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

36 నెలల్లో ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం.!

- 14నెలల్లో 4 నివేదికలు.. 22 నెలల్లో నిర్మాణం
- డీపీఆర్ కన్సల్టెంట్ కోసం టెండర్లకు ఆహ్వానం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణభాగంలో మరో ముందడుగు పడింది. ఈ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించనున్న నేపథ్యంలో శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. వచ్చే మూడేళ్లలో అందుబాటులోకి తీసుకువచ్చేలా లక్ష్యం పెట్టుకుంది. మొదటి 14 నెలల్లో వివిధ అంశాలకు సంబంధించి నివేదికలను సమర్పించాలి. ఆ నివేదికలను పరిశీలించి, ఆమోదించిన అనంతరం రహదారి నిర్మాణాన్ని చేపట్టి 22 నెలల్లోనే పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ప్రణాళికను కార్యరూపంలో పెట్టేందుకు దక్షిణభాగం రహదారికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)కోసం ప్రభుత్వం కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం టెండర్లను ఆహ్వానించింది. టెండర్లలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం నుంచి డిసెంబర్ 16 మధ్యాహ్నం 3గంటల వరకు అవకాశం కల్పించింది. ఈ టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చన్న ప్రభుత్వం.. పలు నియమ, నిబంధనలను పొందుపర్చింది. ఈ టెండర్లను ఇంటర్నేషనల్ కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఆహ్వానిస్తున్నట్టు తెలిపింది. కాగా రహదారి మార్గం(అలైన్ మెంట్) దగ్గరి నుంచి రోడ్డు నిర్మాణ విధానం సహా పలు అంశాలన్నీ సమగ్ర ప్రాజెక్టు నివేదికలో తేలనున్నాయి. ముఖ్యంగా రహదారి నిర్మాణం, మార్గమధ్యంలో నిర్మించే వెహికల్ అండర్ పాస్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్, జంక్షన్‌లను ఎన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందనేది తెలియనుంది. రహదారి వెళ్లే మార్గంలో ఏమైనా గ్రామాలు, ఆవాసాలున్నాయా, ఉంటే అక్కడ ఎంతమంది నివసిస్తున్నారు, చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయి, సాగు చేసుకుంటున్న భూములున్నాయా, అటవీభూములు ఎన్ని ఉన్నాయనే వివరాలను సేకరిస్తారు. రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న భూముల వివరాలతో పాటు నిర్మాణ వ్యయ అంచనాలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక ద్వారా తెలుస్తాయి. అంతే కాకుండా అసలు ఈ రహదారిని ఏ పద్ధతిలో నిర్మించాలి, ఏ విధానంలో నిర్మిస్తే లాభదాయకంగా ఉంటుందన్న వివరాలు కూడా తెలుస్తాయి. కాగా దక్షిణభాగం రహదారి నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ కన్సల్టెన్సీ సంస్థ కోసం ప్రభుత్వం త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుందన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' నవంబర్ 14న "కొంత రుణం..కొంత బాండ్లు" శీర్షికన ప్రచురించిన కథనంలోనే చెప్పింది.

జేఎల్ ఎకనామిక్స్ అభ్యర్థుల ఎంపిక

ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోని జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించారు. ఎకనామిక్స్ ఎకనామిక్స్ ఉర్దూ మీడియంకు సంబంధించిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు వెల్లడించారు.

లష్కర్‌లకు సరంజామా

నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, జూరాల, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల రక్షణ కోసం త్వరలో నియమితులయ్యే లష్కర్‌లకు తగిన పరికరాలు అందించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించింది. సోమవారం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) కమిటీ సమావేశం ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. కాలువల్లో గడ్డి, మొక్కల కత్తిరింపు కోసం బుష్ కట్టర్లు, చెట్ల కోసం ట్రీ కట్టర్లు, గ్రీజ్ గన్‌లను అందించాలనే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు ప్రతీ సబ్ డివిజన్‌కు ఒక సెట్ యంత్రాలు సమకూర్చనున్నారు.

ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫీజు గడువును పొడిగించారు. బుధవారంతో ముగియనున్న ఫీజు చెల్లింపు గడువును డిసెంబరు 3వ తేదీ వరకు పెంచుతున్నట్లు బోర్డు అధికారులు సోమవారం తెలిపారు. అలాగే.. రూ. 100 ఆలస్య రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ. 500తో డిసెంబరు 17 వరకు, రూ. 1,000తో డిసెంబరు 24 వరకు, రూ. 2,000తో జనవరి 2 వరకు ఈ గడువును పొడిగించారు.

అదానీ.. వంద కోట్లు వద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తానన్న రూ.100 కోట్లను వద్దనుకున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్కిల్స్ వర్సిటీకి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు ఇచ్చేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని, అందులో భాగంగా అదానీ సంస్థ కూడా ముందుకు వచ్చిందని తెలిపారు. "ఆ వంద కోట్లు ఏదో మాకు అప్పనంగా ఇస్తున్నట్లు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారు. స్కిల్స్ వర్సిటీకి అదానీ సహా ఏ సంస్థ నుంచి కూడా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. తెలంగాణ ప్రతిష్ఠపైనా.. వ్యక్తిగతంగా నాపైనా అనవసరమైన చర్చ జరగడం నాకు, మంత్రులకు ఇష్టం లేదు. అందుకే, ఆ నిధులు తీసుకోవడానికి సిద్ధంగా లేదంటూ లేఖ రాయించాం" అని వివరించారు.



తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి

అదానీతో బీఆర్ఎస్ సర్కారు ఒప్పందాలు

అదానీతో విమానాల్లో ఆడంబరంగా తిరిగింది బీఆర్ఎస్ నాయకులేనని సీఎం రేవంత్ వెల్లడించారు. అదానీ సంస్థతో బీఆర్ఎస్ ప్రభుత్వమూ ఒప్పందాలు చేసుకుందన్నారు. ఈ సందర్భంగా ఏయే ప్రాజెక్టుల్లో అదానీతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుందో ఆ వివరాలను వెల్లడించారు. అదానీతో కలిసి కేసీఆర్, కేటీఆర్ దిగిన ఫొటోలనూ ప్రదర్శించారు. అదానీకి కేసీఆర్ వంగి వంగి దండాలు పెట్టారని ఆ ఫొటో చూపిస్తూ విమర్శించారు. అదానీతో అన్ని ఒప్పందాలు చేసుకుని కమిషన్లు మెక్కినవారు.. రాష్ట్ర ప్రయోజనం కోసం స్కిల్ వర్సిటీకి వంద కోట్లు తీసుకుంటే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అదానీతో చేసుకున్న పెట్టుబడుల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఒక ఒప్పందాన్ని రద్దు చేయాలంటే న్యాయపరమైన సలహాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఏకపక్షంగా రద్దు చేస్తే ఆయా సంస్థలు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అవకాశం అందరికీ ఉంటుందని, అంతే తప్ప.. అయాచితంగా, అప్పనంగా ఎవరికీ లబ్ధి చేకూర్చడం ఉండదని అన్నారు. ఓవైపు.. రాష్ట్రానికి పెట్టుబడులు రావట్లేదని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు.. మరో వైపు, వస్తున్న పెట్టుబడులును రద్దు చేసుకోవాలని మాట్లాడుతున్నారని, పెట్టుబడుల విషయంలో ఇంతకీ వారి విధానం ఏమిటంటూ నిలదీశారు. అదానీని బ్లాక్ లిస్టులో పెట్టాలన్న బీఆర్ఎస్ నేతల డిమాండ్లపై స్పందిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే టెండర్లలో ఆయన భాగస్వామి అవుతారో లేదో తేలకుండా చర్యలు తీసుకుంటామన్న చర్చ ఎలా వస్తుందని ప్రశ్నించారు. "అదానీతో చేసుకున్న ఒప్పందాలపై విచారణకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నారా? ఆయనకు అన్ని ప్రాజెక్టులు ఇచ్చిన కేసీఆర్‌పై విచారణ చేయాలా?" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులకు 2023లో అధికారం, 2024 జూన్‌లో డిపాజిట్లు పోయాయని, ఇప్పుడు మెదడు కూడా పోయిందని ఎద్దేవా చేశారు.

మేము మీలా.. పైరవీల కోసం ఢిల్లీకి పోవట్లేదు

తమ ఢిల్లీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహానికి హాజరు కావడానికే తాను, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెళుతున్నామన్నారు. తాను, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీలుగా ఉన్నప్పుడు ఆయన స్పీకర్‌గా ఉన్నారని, తమను ప్రత్యేకంగా ఆహ్వానించడంతో వెళుతున్నామని చెప్పారు. "కొంతమంది హర్రాస్ పాట పాడినట్లు 26వ సారి, 27వ సారి ఢిల్లీకి వెళుతున్నానంటూ నా పర్యటనకు లెక్కలు వేస్తున్నారు. నేనేమీ వాళ్లలాగా పైరవీల కోసమో.. మోదీ ముందు మోకరిల్లడానికో.. కాళ్లు పట్టుకుని కేసులు ఎత్తివేయించుకోవడానికో ఢిల్లీకి వెళ్లట్లేదు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి అయినా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులు సాధించుకునే ప్రయత్నంలో భాగంగా వెళుతున్నాం. గత పదేళ్లుగా కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన వాళ్లు.. వారితో అంటకాగడంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది" అని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇవ్వాల్సిన అనుమతులకు సంబంధించి పార్లమెంటులో ప్రస్తావించడంపై తెలంగాణ ఎంపీలతో మంగళవారం సమావేశమై చర్చిస్తామన్నారు. ఇందుకు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మెట్రో రైలు, సాగునీటి కేటాయింపులు తదితర అంశాలు కేంద్రం వద్ద దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులను కలిసే ప్రయత్నం చేస్తామని చెప్పారు. "రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఏమీ బీజేపీ ఖజానా నుంచి రావట్లేదు. కేంద్ర ప్రభుత్వ ఖజానా నుంచే వస్తున్నాయి. అవి రాష్ట్రాల హక్కు. ఫామ్ హౌస్‌లో పడుకుంటే ప్రయోజనం ఉండదు. రాజకీయ పక్షపాతం చూపకుండా వెళ్లి కలిసినప్పుడే నిధులు రాబట్టుకోగలం. ఇందు కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళతాం" అని స్పష్టం చేశారు. తాను ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ మీడియాలో మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వస్తోందని, తన పర్యటనకు దానికి సంబంధం లేదన్నారు.

ఉప ఎన్నికల్లో ఓడించింది మోదీనే!

నాందేడ్, వయనాడ్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే.. ఆ రెండు స్థానాలనూ కాంగ్రెస్సే గెలిచిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ రెండు సీట్లలో ప్రజలు మోదీని, కిషన్‌రెడ్డిని ఓడించి... రాహుల్ నాయకత్వాన్ని బలపరిచారని వ్యాఖ్యానించారు. వయనాడ్‌లో ప్రియాంకకు రాహుల్ గాంధీ కంటే ఎక్కువ మెజారిటీ వచ్చిందన్నారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మహా యుతి మళ్లీ అధికారంలోకి వచ్చిందని, జార్ఖండ్‌లో అధికార కూటమి మరోసారి గెలిచిందని, బీజేపీ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావట్లేదన్నారు.

అదానీతో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు ఇవే!

ప్రాజెక్టు పేరు	ప్రస్తుత పరిస్థితి	వివరాలు
మామిడాలపల్లిలో అదానీ ఎల్బిట్ సిస్టమ్స్ డిఫెన్స్ యూనిట్	ప్రాజెక్టు పని చేస్తోంది	ఇండియన్ ఆర్మీ, నేవీల కోసం డ్రోన్ల తయారీ యూనిట్ ఇక్కడ నడుస్తోంది. ఇజ్రాయెల్‌కూ ఈ డ్రోన్లు ఎగుమతి అవుతున్నాయి
మామిడాలపల్లిలో మిస్సైల్ షెల్ తయారీ యూనిట్	నిర్మాణ దశ	క్షిపణులను తయారు చేసే ఈ యూనిట్ వచ్చే జనవరికల్లా పూర్తి కానుంది.
ఎల్లికట్ట వద్ద మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్	మొదటి దశ పూర్తి	రెండో దశ కోసం భూమి కొనుగోలు పూర్తి
3 నేషనల్ హైవే ప్రాజెక్టులు	2 పూర్తి, తుది దశలో మరోటి	ఖమ్మం - సూర్యాపేట, మంచిర్యాల - రేపల్లె వాడ హైవేలు పూర్తయ్యాయి. ఖమ్మం - కోదాడ 85% పూర్తయింది.
750 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ ప్రాజెక్టు	పూర్తయింది	వడోదర, వరంగల్, కర్నూలు, చిలకలూరిపేటలను

కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు

ప్రాజెక్టు పేరు	ప్రస్తుత పరిస్థితి	వివరాలు
చందన్‌వ్యాలీ వద్ద డాటా సెంటర్ టెక్ పార్కు	భూ సేకరణ దశలో	49 ఎకరాలకుగాను ఇప్పటి దాకా టీజీఐఐసీ ద్వారా 34.8 ఎకరాల సేకరణ జరిగింది.
రామన్నపేట వద్ద లాజిస్టిక్ పార్కు, డ్రై పోర్టు	భూ సేకరణ పూర్తి, కానీ, ప్రభుత్వ అనుమతి పెండింగ్‌లో ఉంది	ఈ ప్రాజెక్టు కోసం రామన్నపేట వద్ద 375 ఎకరాల సేకరణ పూర్తయింది. ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉంది.
పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు	ప్రతిపాదన దశలో	5 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించి దావోస్‌లో ఎంఓయూ జరిగింది. భూ కేటాయింపు, ఇతర అనుమతుల కోసం ప్రభుత్వం వద్ద ప్రతిపాదన
రామన్నపేట వద్ద 6000 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు	పర్యావరణ అనుమతి పెండింగ్‌లో	దావోస్‌లో ఎంఓయూ జరిగింది. డీపీఆర్ ప్రభుత్వానికి సమర్పించారు. పర్యావరణ అనుమతికి బహిరంగ విచారణ పూర్తయింది
కొడంగల్‌లో 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సిమెంట్ ప్లాంట్ నిర్మాణం	ప్రతిపాదన దశలో..	ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసే ఆసక్తి ఉన్నట్లుగా ప్రభుత్వానికి ప్రతిపాదన

సైకో రామ్!

ఎప్పుడు జైలుకు వెళదామా అని కేటీఆర్ చూస్తున్నడు
వెళితే ముఖ్యమంత్రి అవుతానని అనుకుంటున్నడు
అలా అయితే ఆయనకన్నా ముందే కవిత జైలుకెళ్లింది
కేటీఆర్‌పై సీఎం రేవంత్ సెటైర్లు



కేసుల విచారణ త్వరగా జరిగి.. ఎప్పుడెప్పుడు జైలుకు వెళదామా అని కేటీఆర్ ఎదురు చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇటీవల మీడియాలో వచ్చింది చూసి.. జైలుకు వెళ్లి నోళ్లు సీఎంలు అవుతున్నారని ఆయన అనుకుంటున్నారని, అట్లా అయితే ఆయన చెల్లెలు కవిత ఆయన కంటే ముందుగానే జైలుకు వెళ్లి వచ్చి.. ఆ చాన్స్ కొట్టేశారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ను 'సైకో రామ్' అంటూ అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. ఆయన గురించి ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదన్నారు.



గూడు ఎప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గానికి 3500-4000 చొప్పున 4.16 లక్షల ఇళ్లు.. రిజర్వ్ కోటాలో (సీఎం, సీఎస్ పరిధిలో) మరో 33,500 ఇళ్లు కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై)కు అనుసంధానం చేయాలని భావిస్తోంది. అందుకు సంబంధించిన ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చిందని పలుమార్లు చెప్పింది. కేంద్ర పథకంతో అనుసంధానమైతే అక్కడి నుంచి కొంతమేర నిధులు అందుతాయని, తద్వారా రాష్ట్రానికి ఆర్థిక ఉపశమనం కలుగుతుందని భావించింది. పథకం అమలు, పర్యవేక్షణకు యాప్‌ను రూపొందించామని, త్వరలోనే దాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పినా.. అవేమీ జరగలేదు.

ఇళ్ల కోసం 80,54,554 దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పలు పథకాలకు దరఖాస్తులను స్వీకరించింది. అందులో ఇందిరమ్మ ఇంటి కోసం దాదాపు 80,54,554 దరఖాస్తులు రాగా వీటిలో అర్బన్ పరిధిలో 23.25 లక్షలు, రూరల్‌లో 57.25 లక్షల దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వానికి వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో ఆహార భద్రత కార్డులతో సరిపోలినవి 53.95 లక్షలుండగా, మరో 26.59 లక్షల దరఖాస్తులు సరిపోలలేదు. 12.72 లక్షల దరఖాస్తులు డూప్లికేషన్, గతంలో లబ్ధిపొందిన వారి జాబితాలో ఉన్నాయని తేల్చినట్లు సమాచారం. వీటిలో డూప్లికేషన్, గతంలో లబ్ధిపొందిన వారు, ఆహార భద్రత కార్డు సరిపోలని వారిని తీసివేయగా మిగిలిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీ చేయనున్నారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2004 నుంచి 2014 వరకు తెలంగాణ ప్రాంతంలో 23,85,188 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 19,32,001 ఇళ్లు పూర్తవగా, మరో 4,53,187 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం సేకరించిన లెక్కల్లో తేలింది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత నుంచి 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేనాటి వరకు రాష్ట్రంలో గత ప్రభుత్వం 2,36,711 ఇళ్లను మంజూరు చేయగా, వీటిలో 1,58,860 ఇళ్లు పూర్తయ్యాయి. 1,36,116 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

వేలం ధాన్యాన్ని అమ్మేశారా?

(మొదటిపేజీ తరువాయి)



అధికారులు, డీఎంలు, రైస్‌మిల్లర్లు, వేలం సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలకు సిద్ధమయ్యాయి. 2022-23 యాసంగి పంటకాలానికి సంబంధించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో వేలం వేసిన విషయం తెలిసిందే.! కేంద్రీయ భండార్, న్యాకాఫ్, మంచుకొండ అగ్రోటెక్, హిందుస్థాన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థలు ఈ టెండర్లను దక్కించుకున్నాయి. సగటున క్వింటాకు రూ.2వేల చొప్పున ధర ఖరారైంది. వేలం సంస్థలు తొలుత రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు డబ్బులు చెల్లించి, విడుదల ఉత్తర్వులు తీసుకెళ్లి, మిల్లు యజమానులకు చూపించి.. ధాన్యం తీసుకెళ్లాలనే నిబంధన పెట్టారు. 90 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని గడువు విధించారు. నిర్ణీత గడువులో వేలం సంస్థలు ధాన్యం లోడెత్తలేదు. కొన్ని రైస్‌మిల్లుల్లో ధాన్యం ఉండటం, మరికొన్ని మిల్లుల్లో లేకపోవటంతో వేలం సంస్థలకు, రైస్‌మిల్లర్లకు మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడింది. వేలం ధర ప్రకారం క్వింటాలుకు రూ.2వేలు చెల్లిస్తామని రైస్‌మిల్లర్లు, రూ.200 కమీషన్ కలిపి రూ.2,200 చొప్పున చెల్లించాలని వేలం సంస్థలు పట్టుబట్టడంతో సమస్య కొలిక్కిరావటంలేదు. ఇప్పటి వరకు 12 లక్షల టన్నుల ధాన్యం వసూలు కాగా.. ఇంకా 23 లక్షల టన్నులు రైస్‌మిల్లర్ల వద్దే ఉన్నాయి. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరకపోవటంతో.. వేలం సంస్థలు ఈనెల 8, 18 తేదీల్లో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదులు చేశాయి. వేలం పాటలో విక్రయించిన ధాన్యం రైస్‌మిల్లుల్లో అందుబాటులో లేదని, అందుకే మిల్లర్లు ధాన్యం అప్పగించటంలేదనేది ఆ ఫిర్యాదుల్లోని సారాంశం. దీంతో.. పౌరసరఫరాల సంస్థ ఎండీ డీఎస్ చౌహాన్ రైస్‌మిల్లుల్లో సంయుక్త సర్వే చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు(డీసీఎస్‌వోలు), జిల్లా మేనేజర్లు(డీఎంలు), రైస్‌మిల్లర్లు, వేలం సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, క్షేత్రస్థాయిలో తనిఖీలకు పంపించారు. అసలు రైస్‌మిల్లుల్లో ధాన్యం ఉందా? లేదా? అనే విషయాన్ని ఈ తనిఖీల్లో నిర్ధారించాలని ఎండీ ఆదేశించారు. దీంతో.. శనివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైస్‌మిల్లుల్లో భౌతిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. వేలం సంస్థలు దక్కించుకున్న ధాన్యం లాట్ల వారీగా జాబితాలను తయారుచేసి, సంయుక్త తనిఖీలకు వెళ్లే.. బృందాలకు అందజేశాయి. రైస్‌మిల్లు పేరు, ఆ రైస్‌మిల్లుకు ఇచ్చిన ధాన్యం పరిమాణం ఎంత? సీఎంఆర్ ఎంత తిరిగిచ్చారు? ఉప్పుడు బియ్యం ఎంతిచ్చారు? ముడి బియ్యం ఎంతిచ్చారు? తిరిగిచ్చిన బియ్యానికి సరిపోయే ధాన్యం ఎంత? వేలం సంస్థలు ఎంత ధాన్యాన్ని తీసుకెళ్లాయి? ఇంకా ఎంత ధాన్యం మిగిలి ఉంది? అనే ప్రొఫార్మాలో సంయుక్త తనిఖీ బృందాలు నివేదికలను సిద్ధం చేస్తాయి. ఈ నెల 30న రాష్ట్ర స్థాయి నివేదికను సమర్పించాలని డీఎస్ చౌహాన్ ఆదేశించారు.

తుది గడువు దాటితే ఈఎండీ జప్తు

వేలం నిబంధనల ప్రకారం 90 రోజుల్లోనే ధాన్యం తీసుకెళ్లాలి. ఇప్పటివరకు నాలుగు సార్లు ఈ గడువును పొడిగించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో డిసెంబరు 31 వరకు తుది గడువు ఇవ్వాలని నిర్ణయించారు. అప్పటికి ధాన్యాన్ని పూర్తిగా తీసుకెళ్లినా, తీసుకెళ్లకపోయినా వేలం సంస్థలతో ఒప్పందం రద్దుచేసుకోవాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులోపల ప్రక్రియ పూర్తికాకపోతే.. ఈఎండీ జప్తు చేయాలనే నిర్ణయానికి మంత్రివర్గం రావటం గమనార్హం.! ఇటీవల జారీచేసిన పొడిగింపు ఉత్తర్వుల్లో కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా చేర్చారు. టెండరు ఒప్పంద సమయంలో సంబంధిత వేలం సంస్థలు రూ.336 కోట్ల మేర ఈఎండీ చెల్లించాయి. మొత్తం 12 లాట్లు కాగా.. ఒక్కో లాట్‌కు రూ.28 కోట్ల చొప్పున ఈఎండీని అందజేశాయి. సకాలంలో ధాన్యం తీసుకెళ్లకుండా.. టెండరు నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను ఈఎండీని జప్తుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇదే జరిగితే 336 కోట్లలో చాలా వరకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఖాతాలోకి వెళ్లిపోతాయి.

రైస్‌మిల్లర్లకు 25% జరిమానా

తుది గడువులోగా ధాన్యం అప్పగించని రైస్‌మిల్లర్లకు 25% జరిమానా విధించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. డిసెంబరు 31లోగా.. ధాన్యాన్ని వేలం సంస్థలకు అప్పగిస్తే.. ఎలాంటి జరిమానా ఉండదు. ఒకవేళ గడువు దాటి, టెండర్లు రద్దయితే మాత్రం.. మిల్లర్లు 25% జరిమానాతో కలిపి.. 125% చెల్లించాల్సి ఉంటుంది. అంటే.. వెయ్యి టన్నుల ధాన్యం బకాయి ఉన్న రైస్ మిల్లరు 250 టన్నులు అదనంగా కలిపి 1,250 టన్నుల ధాన్యాన్ని అప్పగించాలి. టెండర్ ధర ప్రకారం చూసుకుంటే.. క్వింటాకు రూ.2వేలు ఖరారవ్వగా.. మిల్లర్లు దానికి రూ.500 జరిమానాను చేర్చి, రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది.

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

లక్ష టన్నుల ఎగుమతికి సర్కారు నిర్ణయం

- 5% నూకతో.. ముడి బియ్యం కొనుగోలుకు ఫిలిప్పీన్స్ సుముఖత
- సరఫరా చేసే మిల్లర్లకు క్వింటాకు రూ.300 పరిహారం

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కారు.. ఆ దిశలో తొలి అడుగు వేస్తోంది. ఫిలిప్పీన్స్‌కు ముడి బియ్యం ఎగుమతి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. ఇటీవల ఫిలిప్పీన్స్ ప్రభుత్వంతో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. లక్ష మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఫిలిప్పీన్స్ అంగీకరించింది. రాష్ట్రానికి ఈ మేరకు డిమాండ్ లేఖను పంపింది. అయితే బియ్యంలో నూకశాతం 5 శాతానికి మించి ఉండకూడదనే షరతు విధించింది. ఈ ప్రతిపాదనపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సోమవారం కొందరు రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. విధివిధానాలపై రైస్ మిల్లర్లతో చర్చించారు. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించే కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)లో 25% వరకు నూకలకు అనుమతి ఉంటుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లోనూ 75:25 నిష్పత్తితో బియ్యాన్ని అందజేస్తారు. అయితే.. ఫిలిప్పీన్స్ సర్కారు మాత్రం ఈ నిష్పత్తికి అంగీకకరించలేదు. తమ దేశానికి పంపించే బియ్యంలో 5% వరకు నూకలు ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండబోదని స్పష్టం చేసింది.

రైస్ మిల్లర్లతో కమిషనర్ భేటీ

ఫిలిప్పీన్స్ ప్రతిపాదనపై రాష్ట్ర పౌర సరఫరాల భవన్‌లో సోమవారం కొందరు రైస్‌మిల్లర్లతో కమిషనర్ డీఎస్ చౌహాన్ సమావేశం నిర్వహించారు. ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయటానికి కావాల్సిన బియ్యాన్ని సరఫరా చేయాల్సిందిగా రైస్‌మిల్లర్లను కోరారు. 2022-23 యాసంగి పంట కాలానికి సంబంధించిన పాత బియ్యాన్ని ఎగుమతి చేయాలని నిర్ణయించారు. నూక 25శాతానికి బదులుగా 5శాతంగా ఉంటే.. మిగతా 20 శాతానికి ప్రభుత్వం క్వింటాకు రూ.300 చొప్పున నష్టపరిహారం ఇస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిసింది. తొలుత నష్టపరిహారాన్ని రూ.250గా ఖరారు చేయగా.. మిల్లర్లు అంగీకరించలేదని, దాంతో రూ.300 ప్రకటన వచ్చిందని సమాచారం. అయితే.. రైస్‌మిల్లర్లు, బియ్యం ఎగుమతిదారులతో చర్చించిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘం, రాష్ట్ర మంత్రిమండలిలో విధివిధానాలను ఖరారుచేసే అవకాశాలున్నాయి.

గిర్మాపూర్ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు టీచర్లపై చర్యలు

కొండాపూర్, జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'కుళ్లిన కూరగాయలు- అన్నంలో పురుగులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో అదనపు కలెక్టర్ మాధురి సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, పారిశుధ్య లోపంతోపాటు సమస్యలు పరిష్కరించడంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నివేదిక ఇచ్చారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ సత్య ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం అమలుపై ప్రత్యేకాధికారులు తనిఖీలు చేసి నివేదికను కలెక్టర్ అందజేశారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్కూల్ అసిస్టెంట్ వి వెంకటరమణ రావును సస్పెండ్ చేయడంతో పాటు ఎం ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామికి మెమో జారీ చేశారు. అలాగే మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ఫుడ్ ఇన్‌చార్జి సీహెచ్ కిషోర్‌ను సస్పెండ్ చేశారు. ప్రిన్సిపాల్ మాధవీలతకు మెమో జారీ చేశారు.

సౌమ్య స్వామినాథన్‌కు లైఫ్‌టైమ్ అవార్డు

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రధాన సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. సోమవారం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్‌లో జరిగిన గోల్డెన్‌జూబ్లీ కార్యక్రమంలో వర్సిటీ వీసీ బీజేరావు చేతుల మీదుగా డాక్టర్ సౌమ్య ఈ అవార్డును అందుకున్నారు. క్షయ, హెచ్ఐవీ/ఎయిడ్స్ రంగాల్లో డాక్టర్ సౌమ్య చేసిన కృషికి గుర్తింపుగా ఈ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు ఎఫ్ఏబీఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు రెడ్డన్న తెలిపారు. కోవిడ్, క్షయ వంటి అంటు వ్యాధులు ప్రపంచ ఆరోగ్య రంగానికి పెను సవాళ్లను విసిరాయని ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

ఏసీబీకి చిక్కిన నీటిపారుదల ఏఈ

పెద్దపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటున్న నీటి పారుదల శాఖ అధికారిని ఏసీబీ అధికారులు సోమవారం పెద్దపల్లిలో పట్టుకున్నారు. ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన కాంట్రాక్టర్ తమ్మడవేణి శ్రీనివాస్.. జూలపల్లి మండలం కాచాపూర్‌లో ఎస్సారెస్పీ డీ-83 కెనాల్‌కు రూ.91 వేలతో మరమ్మతులు చేశారు. ఆ బిల్లులకు ఎంబీ రికార్డు చేయాలని ఏఈ నర్సింగరావును కోరారు. దీంతో బిల్లులో సగం వాటా ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేశారు. రూ.20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన ప్రకారం 20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

18 నెలల పసిపాపతో సహా చెరువులో దూకి తండ్రి ఆత్మహత్య


క్రాంతికుమార్(ఫైల్)

మోపాల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక, అప్పుల భారంతో 18 నెలల పసిపాపతో సహా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడో తండ్రి. నిజామాబాద్ జిల్లాలో సోమవారం ఈ ఘటన జరిగింది. నిజామాబాద్ నగరంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన క్రాంతికుమార్(30) డిచ్‌పల్లి మండలం ధర్మారం గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. క్రాంతికుమార్‌కు భార్య మానస, ఇద్దరు కుమార్తెలు (ఒకరి వయసు 18 నెలలు, మరో కూతురు వయసు 3 నెలలు) ఉన్నారు. పెద్ద కూతురు నేహశ్రీ మెదడువాపు వ్యాధితో బాధపడుతోంది. ఇప్పటికే ఆమెకు రెండుసార్లు ఆపరేషన్ చేయించారు. ఇందుకోసం క్రాంతికుమార్ రూ.లక్షల్లో అప్పు చేశాడు. అయినప్పటికీ ఆ వ్యాధి నయం కాలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భార్య, పిల్లలతో కలిసి క్రాంతికుమార్ తన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నాడు. సోమవారం తెల్లవారుజామున.. తను, తన కూతురు నేహశ్రీతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి వాట్సాప్‌లో మెసేజ్ చేశాడు. మెసేజ్ చూసిన వెంటనే ఆ ఉద్యోగి క్రాంతికుమార్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే క్రాంతికుమార్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆ ఉద్యోగి 101కు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. వెంటనే మోపాల్ పోలీసులు మాసాని చెరువు వద్దకు వచ్చేసరికి క్రాంతికుమార్ చెరువు కట్టవద్ద బైక్, చెప్పులను వదిలేసి కూతురు నేహశ్రీతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సోలార్ ప్యానల్స్‌తో మేలుకన్నా హాని ఎక్కువ

- ఈ ప్యానెల్స్ వేడితో అకాల ప్రకృతి వైపరీత్యాలు
- ఏఆర్‌సీఐ శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రమ్ గణేశ్ ఆందోళన

పంజాగుట్ట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుదుత్పత్తికి అవసరమైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటుతో మేలు కంటే హాని ఎక్కువగా జరుగుతోందని ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ) శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రమ్ గణేష్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సోలార్ ప్యానల్స్‌పై తాను పరిశోధనలు చేస్తున్నానని తెలిపారు. సౌర ఫలకల ద్వారా 20శాతమే మేలు జరుగుతుండగా.. 80శాతం హాని జరుగుతోందన్నారు. సోలార్ ప్యానల్స్‌తో 20శాతం సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, 30శాతంకన్నా ఎక్కువ కాంతిని, ఉష్ణశక్తిని ఉత్పత్తి చేస్తాయని తెలిపారు. ఆ వేడి వల్ల అకాల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని, సోలార్ ప్యానల్స్ మూలంగా కలిగే నష్టాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదన్నారు. తాను రూపొందించిన సెమీకండక్టర్ అండ్ లిక్విడ్ అసిస్టెడ్ ఫొటో థర్మల్ ఎఫెక్ట్(ఎస్ఎల్ఏపీఈ)వల్ల తక్కువ దుష్పరిణామాలు ఉంటాయని తెలిపారు.

ప్రీ లాంచ్ పేరుతో మోసాలు

- 200 మంది నుంచి రూ.48 కోట్లు వసూళ్లు
- బాధితుల ఫిర్యాదుతో దంపతుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ ఆఫర్‌లో తక్కువ ధరకే ఇళ్లు ఇస్తామని పలువురిని మోసం చేసిన ఇద్దరిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లికి చెందిన చక్క భాస్కర్, అతడి భార్య సుధాణి ఛైర్మన్, ఎండీలుగా ఆర్ హోమ్స్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో సంస్థను స్థాపించారు. ఘట్‌కేసర్ యామన్నపేటలో బ్లిస్ హైట్స్ ప్రాజెక్ట్, పటాన్‌చెరు కర్దనూరులో ఓఆర్ఆర్ హైట్స్ ప్రాజెక్ట్.. నారాయణఖేడ్, సంగారెడ్డి జిల్లా కారముంగి ప్రాంతాల్లో పామ్‌లాండ్ ప్రాజెక్టుల పేరుతో వెంచర్లను ప్రారంభించారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరలోనే ప్లాట్లు, ఇళ్లు ఇస్తామని చెప్పి దాదాపు 200 మంది నుంచి రూ.48 కోట్లు వసూలు చేశారు. తమ ప్రాజెక్టులలో పెట్టుబడి పెడితే మూడేళ్లలో ఇళ్లు కట్టి ఇస్తామని.. లేని పక్షంలో డబుల్ బెడ్ రూంకు నెలకు రూ.6 వేలు, ట్రిపుల్ బెడ్‌రూంకు రూ.8 వేల చొప్పున అద్దె చెల్లిస్తామని అగ్రిమెంట్లు చేశారు. వీరి మాటలు నమ్మిన పలువురు 2021 నుంచి 2023 వరకు డబ్బులు కట్టారు. మూడేళ్లయినా పనులు ప్రారంభం కాకపోవడంతో బాధితులు నిర్వాహకులను సంప్రదించారు. వారిచ్చిన చెక్కులు చెల్లకపోయేసరికి మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి

- స్కూల్‌లో కలుషిత ఆహారంతో తీవ్ర అస్వస్థత
- 20రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స
- విద్యార్థిని మృతికి ప్రభుత్వమే కారణం: హరీశ్
- రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్


శైలజ(ఫైల్)

వాంకిడి, హైదరాబాద్ సిటీ, నవంబరు 25: కలుషిత ఆహారం తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజ (14) సోమవారం సాయంత్రం మృతి చెందింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులు.. అక్టోబరు 30న పాఠశాలలో వాంతులు విరేచనాలతో అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వారిలో తొమ్మిదో తరగతి చదువుతున్న శైలజ, మరో ఇద్దరు తప్ప మిగతా అందరూ చికిత్స అనంతరం కోలుకున్నారు. ఆ ముగ్గురికీ మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి.. మరింత మెరుగైన వైద్యం కోసం ఈ నెల 5న హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి మెరుగుపడడంతో డిశ్చార్జ్ చేశారు. శైలజను దాదాపు 20 రోజులుగా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. శైలజ మరణవార్త వినగానే ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే శైలజ మృతిచెందిందని ఆమె కుటుంబసభ్యులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై దాదాపు 27 రోజులు కావస్తున్నా అందుకు గల కారణాలను అధికారులు తెలుపకపోవడంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం శైలజ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు, నష్టపరిహారం అందించాలని మాలీ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్య వహించి, ఆమె కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సర్కారు నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి శైలజ బలైందని ఆయన ధ్వజమెత్తారు. గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం ఒక పాపం కాగా.. అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరో పాపమని హరీశ్ మండిపడ్డారు.

పిల్లలకు సొంత వైద్యం

(మొదటి పేజీ తరువాయి)

వైద్యులు చెబుతున్నారు. పిల్లలకు వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్లకు ఎడాపెడా యాంటీబయాటిక్స్ వాడేస్తున్నారు. దీనివల్ల పిల్లల్లో ఏఎంఆర్ పెరుగుతోంది. చిన్నారుల ఎదుగుదలపైనా ప్రభావం పడుతోంది. రెండేళ్ల లోపు పిల్లలకు పదేపదే యాంటీబయాటిక్స్ ఇవ్వడం వల్ల వారు బరువు పెరగడం, ఎముకలు అసాధారణ రీతిలో పెరగడం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన సెప్సిస్ కేసుల్లో కూడా యాంటీబయాటిక్స్ పనిచేయడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. మున్ముందు సాధారణ ఇన్ఫెక్షన్లు కూడా చికిత్సకు లొంగకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సాధారణ వైరల్ జ్వరాలైతే రోగలక్షణాలను బట్టి చికిత్స చేసి, నయం చేయవచ్చని చెబుతున్నారు. తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలకు త్వరగా నయం కావాలన్న ఆత్రుతలో యాంటీబయాటిక్స్‌ను ఉపయోగిస్తున్నారని అంటున్నారు. కొందరైతే యాంటీబయాటిక్స్ మందులు రాయాలంటూ తమపై ఒత్తిడి చేస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. యాంటీబయాటిక్స్ మితిమీరి వినియోగిస్తే పిల్లల్లో న్యుమోనియా, గ్యాస్ట్రిక్ ఇన్‌ఫెక్షన్లు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్యం కారణంగా పిల్లల్లో తరచూ రోగనిరోధక సమస్యలు తలెత్తుతాయంటున్నారు. చాలా మంది పిల్లలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతుంటారని చెప్పారు. జీర్ణాశయ వ్యాధులు, చెవి, ముక్కు సమస్యలకు కారణమవుతాయని, ఇలాంటి సమయాల్లో సొంత వైద్యం వల్ల ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరిస్తున్నారు.

దీర్ఘకాలికంగా వాడితే..

యాంటీబయాటిక్స్ మందులను దీర్ఘకాలికంగా వాడితే రోగనిరోధక శక్తి తగ్గితుంది. తరుచూ వినియోగించడం వల్ల ప్రస్తుతమున్న జబ్బులను నయం చేయడం మాట దేవుడెరుగు.. లేనిపోని కొత్త రోగాలను కొని తెచ్చుకునే పరిస్థితి ఎదురవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్ వాడకం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి బ్యాక్టీరియా శక్తిమంతమవుతుందని హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ మందులు వాడేస్తున్నారన్నారు. పిల్లలకు ఓవర్ డోస్ అయితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. పిల్లలకు డాక్టర్లు రాసిన చీటీ ప్రకారం కూడా కొన్ని దుకాణాల్లో మందులు ఇవ్వడం లేదని.. వారికి తెలిసిన మందుల్ని అంటగడుతున్నారని చెబుతున్నారు.



గూగుల్‌లో వెతుకుతున్నారు



చాలా మంది తల్లిదండ్రులు గూగూల్‌లో వెతుక్కోవడం, పాత చీటీ ఉంటే అవే మందులు తీసుకుని పిల్లలకు వేయడం చేస్తున్నారు. డోసు ఎక్కువ.. తక్కువ తీసుకుంటున్నారు. ఇలా వినియోగించడం వల్ల ఆ మందులు పనిచేయడం లేదు. ఆస్పత్రి ఓపీలో 60 శాతం యాంటీబయాటిక్స్‌ను ముందే తీసుకొని వస్తున్నారు. అలాంటి వారికి డోసు పెంచుతున్నాం. లేకపోతే మందులు మార్చి ఇస్తున్నాం. ఫీవర్ పెరిగితే అడ్మిట్ చేసుకుని ఇంజెక్షన్ల ద్వారా ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలకు సొంత వైద్యం చేయడం చాలా ప్రమాదకరం.

\- డాక్టర్ కాంచన్, పీడియాట్రిషన్, కామినేని ఆస్పత్రి

వైద్యులు సూచించిన మేరకే వాడాలి



పిల్లలైనా, పెద్దలైనా ఇష్టానుసారం యాంటీబయాటిక్స్ వాడితే ఇబ్బందులు వస్తాయి. ఏ జబ్బుకైనా డాక్టర్లు చెప్పిన మందులు, అదీ సరైన డోసులోనే వేసుకోవాలి. బ్యాక్టీరియాకు మందులు ఇచ్చినప్పుడు కోర్సు ప్రకారం వాడాలి. జబ్బు తగ్గగానే మందులు వాడడం మానేస్తున్నారు. పూర్తి కోర్సును వాడకపోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి తయారు కావడం లేదు. రెండు, మూడు రోజులు వాడి మానేస్తే ఆ తర్వాత మందులు పనిచేయవు. పూర్తిగా వైద్యులు సూచించిన మేరకు మందులు వాడాలి.

\- డాక్టర్ రవికుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, నిలోఫర్ ఆస్పత్రి


బాధ్యతలు స్వీకరిస్తున్న వెన్నెల చిత్రంలో జూపల్లి, వీహెచ్

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా డాక్టర్ వెన్నెల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెల బాధ్యతలు స్వీకరించారు. మాదాపూర్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి, విమలా గద్దర్, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... ప్రజలను చైతన్యం చేయడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక ఔన్నత్యం ఇనుమడించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. గద్దర్ అడుగుజాడల్లో నడుస్తున్న ఆయన కుమార్తె డాక్టర్ వెన్నెలను సాంస్కృతిక కళా సారథి చైర్‌పర్సన్‌గా నియమించి సముచిత స్థానం కల్పించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆట, పాటకు ఆదరణ దక్కలేదని, కళాకారులకు సరైన గుర్తింపు లేదని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో కళాకారులందరికీ సముచిత గౌరవం లభిస్తున్నదని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

'సెకీ' ఒప్పందంపై నేను సంతకం పెట్టలేదు!

- నా డిజిటల్ సంతకం వాళ్లే పెట్టేశారేమో!!
- అప్పుడు విద్యుత్ శాఖను నడిపించింది సీఎంవోనే
- 'ఆంధ్రజ్యోతి'తో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా 'సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)'తో చేసుకున్న ఒప్పందంపై తాను సంతకం పెట్టలేదని నాటి ఏపీ విద్యుత్ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తన డిజిటల్ సంతకాన్ని వాళ్లే పెట్టేశారేమోనని వ్యాఖ్యానించారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇస్తానన్నారు. సోమవారం హైదరాబాద్‌లో తన నివాసంలో బాలినేని 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అసలు సెకీతో సౌర విద్యుత్ సరఫరా ఒప్పందం గురించే తనకు తెలియదని, ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదన్నారు. ఉందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని చెప్పారు. అసలు సెకీ విషయంలో జగన్ తనతో ఎప్పుడూ చర్చించలేదన్నారు. ఆ శాఖ కార్యదర్శి వచ్చి ఒప్పందం జరుగుతుందని చెప్పారు తప్పితే.. ఎప్పుడూ తనతో చర్చించలేదని తెలిపారు. సీఎం కార్యాలయం అర్ధరాత్రి ఫైలు పంపి సంతకం పెట్టాలంటే.. పెట్టలేదన్నారు. తర్వాతి రోజు సంతకంతో కేబినెట్‌కు ఫైలు వెళ్లిందని, దానిపై మంత్రివర్గంలోనే చర్చించామన్నారు. కానీ ఒప్పందంతో తనకు సంబంధం లేదని.. అసలు సెకీ వాళ్లు వచ్చినప్పుడు తనను సమావేశానికి పిలువలేదని చెప్పారు. తాను సంతకం పెట్టింది సెకీతో ఒప్పందం ఫైలుపై కాదన్నారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ కార్యదర్శిగా ఉన్న అధికారిని అడిగితే అన్ని విషయాలూ తెలుస్తాయని చెప్పారు. ఈ వ్యవహారంలో జగన్ ముడుపులు తీసుకున్నారో లేదో తనకెలా తెలుస్తుందన్నారు. నిజంగా అలా తీసుకుని ఉంటే విచారణలో తేలుతుందని, తప్పని రుజువైతే.. ప్రజలకు అన్యాయం చేసినట్లేనని స్పష్టం చేశారు. సెకీ విషయంలో తనకు అణువంత కూడా తెలియదని, వాళ్లు పంపిన ఫైలుపై సంతకం పెట్టి పంపానని.. తనకు అంతవరకే తెలుసని పునరుద్ఘాటించారు. విద్యుత్ శాఖను నడిపిందంతా సీఎంవోయేనని చెప్పారు. సీఎండీలను నియమించిన ఫైలు కూడా తన వద్దకు రాలేదని, సంబంధిత శాఖ మంత్రిగా తనకు తెలియకుండానే నియమించారని తెలిపారు. సీఎంవోతో పాటు ఒక కాంట్రాక్టరు సీఎండీలను కూడా ప్రభావితం చేసేవారని.. ఇంకా ఇలాంటి విషయాలు చాలానే ఉన్నాయని, అవన్నీ త్వరలోనే చెబుతానని తెలిపారు.

చంద్రబాబు మంత్రి పదవి ఇస్తానన్నారు..

ఎన్నికలకు ముందే వైసీపీ నుంచి బయటకు వెళ్దామనుకున్నానని, ఇదే విషయంపై చంద్రబాబుతో కూడా మాట్లాడానని బాలినేని తెలిపారు. ఆయన కూడా టీడీపీలోకి ఆహ్వానించడంతో పాటు మంత్రి పదవి కూడా ఇస్తామన్నారని చెప్పారు. 'నా రాత బాగోలేక అప్పుడు పార్టీ వీడలేదు. ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదు. జగన్‌తో రాజకీయ ప్రయాణం వల్ల చివరకు మొత్తం ఆస్తిని అమ్ముకోవలసిన పరిస్థితికి తీసుకొచ్చారు' అని ఆవేదన వ్యక్తంచేశారు.

ఒకే నేరంపై అనేక ఎఫ్ఐఆర్‌లు ఎందుకు?

- పట్నం నరేందర్‌రెడ్డి కేసులపై హైకోర్టు
- వేర్వేరు చోట్ల జరిగిన నేరాలు, ఫిర్యాదులన్న ఏజీ
- 3 కేసులపై పట్నం పిటిషన్.. తీర్పు రిజర్వు



హైదరాబాద్/వికారాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకే నేరానికి సంబంధించి అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం ఎందుకు? అని హైకోర్టు పోలీసులను ప్రశ్నించింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణ విచారణకు వచ్చిన కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడి ఘటనపై పోలీసులు అదనంగా మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ ఈ కేసులో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు వాదిస్తూ.. ఒకే నేరానికి సంబంధించి అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు, ఈ హైకోర్టు పలు తీర్పులు ఇచ్చాయని తెలిపారు. పిటిషనర్ సహా ఇతర నిందితులను ఇబ్బంది పెట్టడానికి ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. లగచర్ల గ్రామంలోనే వేర్వేరు చోట్ల జరిగిన నేరాలని, ఫిర్యాదుదారులు, బాధిత అధికారులు సైతం వేర్వేరని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మూడు ఫిర్యాదులను పరిశీలించింది. మూడు ఫిర్యాదులు వేర్వేరు వ్యక్తులు ఇచ్చినప్పటికీ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రైటర్.. ఫిర్యాదుదారుల పేర్లు మార్చి ఒక్కటే ఫిర్యాదును మూడింటికీ కాపీ చేశారని పేర్కొంది. ప్రభుత్వ అధికారులైన ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదు తాము కూడా రాసుకోలేరా? అని ప్రశ్నించింది. ఈ మేరకు తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు లగచర్ల ఘటనకు ముందు దుద్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై దాడి ఘటనలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సదరు ఎఫ్ఐఆర్‌లో నరేందర్‌రెడ్డి నిందితుడిగా లేకపోయినప్పటికీ.. ముందస్తు బెయిల్ కోరారు.

బెయిల్, కస్టడీపై తీర్పు వాయిదా

పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్, కస్టడీ పిటిషన్లపై తీర్పు ప్రకటన మరోసారి వాయిదా పడింది. లగచర్ల ఘటనకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జే ఎఫ్ఎంసీలో పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు తీర్పు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. సోమవారం మరోసారి ఈ పిటిషన్ కోర్టు ముందుకు రాగా, తీర్పును డిసెంబరు 2కు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. వికారాబాద్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో పట్నం నరేందర్‌రెడ్డి తరఫున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్.. జడ్జి సెలవులో ఉన్న కారణంగా అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణకు రాగా, ఈనెల 27వ తేదీకి వాయిదా వేశారు.

స్వతంత్ర కమిషనర్‌ను నియమించండి

హైదరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్ 79 (1)లో పేర్కొన్న విధంగా స్వతంత్ర రాష్ట్ర కమిషనర్‌ను నియమించాలని పేర్కొంటూ ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ (ఏఐసీబీ), డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ (డీడబ్ల్యూఏబీ) సంస్థలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టి న జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం.. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. విచారణ డిసెంబరు 2కు వాయిదా పడింది.

అధికారులపై దాడి ఎలా జరిగింది?

- అర్ధరాత్రి కరెంటు ఎందుకు ఆపేశారు?
- లగచర్ల ఘటనపై కొనసాగిన ఎన్‌హెచ్ఆర్‌సీ ప్రతినిధుల విచారణ
- అమాయకులపై కేసులు ఎత్తేయాలి
- దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య
- లగచర్ల, రోటిబండ తండాలో పర్యటన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


రోటిబండ తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

భూసేకరణ కోసం ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వచ్చిన అధికారులపై దాడి ఎలా జరిగిందని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ప్రతినిధుల బృందం.. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతులను అరెస్టు చేసే క్రమంలో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరాను ఎవరి ఆదేశాలతో నిలిపివేశారని విద్యుత్ శాఖ ఏడీఈ అర్జున్, డీఈ భానుప్రసాద్‌లను విచారించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి ఘటనకు ముందు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం విచారణ మూడోరోజు కొనసాగింది. సోమవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో ఎన్‌హెచ్ఆర్‌సీ న్యాయవిభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ముకేశ్, ఇన్‌స్పెక్టర్‌లు యతిప్రకాశ్ శర్మ, రోహిత్‌సింగ్.. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులను విచారించారు. దీంతో పాటు బాధిత కుటుంబాల నుంచి మూడురోజుల పాటు సేకరించిన వివరాలతో సమగ్ర నివేదికను ఎన్‌హెచ్ఆర్‌సీకి అందించనున్నట్లు వారు తెలిపారు. మరోవైపు లగచర్లలో జరిగిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య విచారణ చేపట్టారు. సోమవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల, రోటిబండ తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. తమ కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. తమ పూర్వీకుల నుంచి ఆధారపడి జీవిస్తున్న భూములను తాము ఇవ్వబోమన్నారు. దీంతో.. ఎవరూ భయపడొద్దని, కమిషన్ అండగా ఉంటుందని చైర్మన్ భరోసా ఇచ్చారు. అయితే అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని, అమాయక గిరిజనులపై కేసులు ఎత్తేయాలని జిల్లా ఎస్పీకి సూచించినట్లు తెలిపారు.

ప్రజాభీష్టం మేరకే భూములు తీసుకోవాలి

2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామాల్లో నోటీసులతో చాటింపులతో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభీష్టం మేరకే భూములు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ అన్నారు. పోలీసులు అరెస్టులు ఆపి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలన్నారు. విచారణ అనంతరం వికారాబాద్‌లోని అనంతగిరి హరిత రిసార్ట్‌కు వచ్చిన ఆయన.. కమిషన్ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాత్రివేళ గిరిజన మహిళలపై దాడి చేసినట్లు కమిషన్ దృష్టికి రావడంతో జిల్లా ఎస్పీకి, కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం వ్యవహరించాలని అన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్టయిన వారికి స్టేషన్ బెయిల్ ఇస్తుండడంతో చట్టానికి విలువ లేకుండా పోతోందని కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతామన్నారు. అధికారులపై దాడి ఘటనలో అరెస్టయి.. సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల గ్రామస్తులను కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ వెంకటయ్య పరామర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.